సోమవారం
13-10-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 22
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జెలెన్‌స్కీ ట్రంప్ ఫోన్ చర్చలు

కీవ్: ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థను మరింతగా బలోపేతం చేసుకొనే అంశమై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఫోన్ చర్చలు జరిపారు. ఈ మేరకు జెలెన్‌స్కీ స్వయంగా ఎక్స్‌లో పేర్కొన్నారు. తమ దేశ ఇంధన వ్యవస్థలపై రష్యా చేస్తున్న దాడుల గురించి ట్రంప్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తమకు ట్రంప్ సహాయం చేసేందుకు ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థ బలోపేతం, లక్ష్యసాధనకు పటిష్ఠ ఒప్పందాల గురించి ట్రంప్‌తో చర్చించినట్లు జెలెన్‌స్కీ వెల్లడించారు. ఉక్రెయిన్ బలాన్ని పెంచుకోవడానికి సంబంధించి మంచి ఎంపికలు, ఆలోచనలు ఉన్నాయన్నారు.

'లాపతా లేడీస్'కు 13 ఫిలింఫేర్‌లు

అహ్మదాబాద్: సినీ అభిమానులు ఎదురు చూస్తున్న ఫిలింఫేర్-2025 అవార్డుల్ని ప్రకటించారు. ఈ అవార్డుల్లో 'లాపతా లేడీస్' హాస్య చిత్రం ఏకంగా 13 అవార్డులతో సంచలనం సృష్టించింది. ఉత్తమ నటులుగా అభిషేక్ బచ్చన్, కార్తీక్ ఆర్యన్.. ఉత్తమ నటిగా అలియా భట్ పురస్కారాలు దక్కించుకున్నారు. బాలీవుడ్ ఫిలింఫేర్ -2025 అవార్డుల సంబురం అహ్మదాబాద్‌లోని కంకారియా సరస్సు వద్ద ఉన్న ఏక ఎరీనాలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి షారుఖ్ ఖాన్, కరణ్ జోహార్, మనీష్ పాల్

- మిగతా 2 లో

మోదీకి ట్రంప్ ఆహ్వానం!

న్యూదిల్లీ: ఇజ్రాయిల్, గజా శాంతి ఒప్పందం నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈజిప్టు వేదికగా సోమవారం జరగబోయే సమావేశానికి హాజరు కావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించారు. ఈ మేరకు జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈజిప్ట్ వేదికగా రేపు ఇజ్రాయిల్, గజా మధ్య శాంతి ఒప్పందం జరుగబోతుంది. ఈ శాంతి ఒప్పందంలో ప్రధాని మోదీ హాజరు కావాలని ట్రంప్ ఆకాంక్షించారు. ఈ మేరకు మోదీకి ఆహ్వానం పంపించారు. మరోవైపు... ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్-సిసి సైతం మోదీని ఆహ్వానించినట్లు తెలుస్తోంది. చివరి నిమిషంలో మోదీకి ఈ ఆహ్వానం అందినట్లు వార్తలు వచ్చాయి.

రాజ్యాంగం హామీతో చెక్కుచెదరని భారత్

న్యూదిల్లీ: పొరుగుదేశాల్లో పౌర నిరసనలు, గందరగోళ పరిస్థితులు తలెత్తినప్పటికీ... భారతదేశం బలంగా, ఐక్యంగా ఉండేలా రాజ్యాంగం హామీ ఇచ్చిందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలోని మండన్‌గడ్ తాలూకాలో కోర్టు భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ 'దేశం ఐక్యంగా ఉంది. అభివృద్ధి పథంలో పయనిస్తోంది. అంతర్గతంగా అత్యవసర పరిస్థితిని చూశాం. కానీ మనం బలంగా, ఐక్యంగా ఉన్నాము. దానికి కారణం డా.బీఆర్ అంబేద్కర్ రచించిన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అవి మన భూములేరా... చిన్నా... పదేళ్ళనుంచీ ఖాళీగా పడి వున్నాయి!

త్యాగశీలి రామిరెడ్డి

- ఫ్లోరైడ్ పీడిత నల్లగొండకు గోదావరి నీటి కోసం పోరాడిన వీరుడు
- ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2కి దామోదర్ రెడ్డి పేరు
- సంస్మరణ సభలో రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: ఐదుసార్లు ఎమ్మెల్యేగా... మంత్రిగా పనిచేసిన రామిరెడ్డి దామోదర్‌రెడ్డి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో వారసత్వంగా వచ్చిన వేలాది ఎకరాల భూములను పార్టీకి, కార్యకర్తల కోసం త్యాగం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో దివంగత నేత రామిరెడ్డి సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాజకీయ కక్షలతో కార్యకర్తలపై దాడులు జరిగితే వారికి అండగా నిలబడ్డారని తెలిపారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ జెండాను కాపాడారన్నారు. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల కోసం గోదావరి జలాలను తీసుకురావడానికి పోరాటం చేశారని చెప్పారు. ఎస్ఆర్ఎస్పీ ద్వారా నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు ఇవ్వాలని కొట్లాడారని, అప్పటి చంద్రబాబు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 ప్రారంభమయ్యేలా కృషి చేశారని కొనియాడారు. దామోదర్ రెడ్డి సూర్యాపేట నుంచి పనిచేసినా తుంగతుర్తి కార్యకర్తలను కాపాడుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో టైగర్ దామన్న గా గుర్తింపు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. తుంగతుర్తి ఎమ్మెల్యే ఎం. సామేల్ 50 వేల మెజార్టీతో గెలవడం వెనుక రామిరెడ్డి కృషి ఉందన్నారు. సోనియా గాంధీ, మలికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ... సంతాపం తెలిపారని, రామిరెడ్డి కుటుంబానికి రాజకీయంగా అండగా ఉంటామని, స్వయంగా రాహుల్ ... ఆయన కుమారుడు సర్వోత్తంకి లేఖ రాశారన్నారు. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 కి రామిరెడ్డి దామోదర్ రెడ్డి పేరు పెడుతున్నామని తెలిపారు. 24 గంటల్లో దీనిపై జీవో ఇస్తామన్నారు. కాంగ్రెస్ అంటే దామోదర్ రెడ్డికి అమిత అభిమానమని పేర్కొన్నారు. కాంగ్రెస్ జెండాతోనే ఆయన చివరి శ్వాస విడిశారు.

ధీరోదాత్తుడు: డిప్యూటీ సీఎం భట్టి

నేను అంటేనే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటేనే నేను అని నిలబడి కొట్లాడిన ధీరోదాత్తుడు రామిరెడ్డి దామోదర్ రెడ్డి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాను చదువుకునే రోజుల్లోనే దామోదర్ రెడ్డి ప్రజల్లో ఆదర్శ నాయకునిగా గుర్తింపు సాధించారని అన్నారు. 1985లో ఎవరూ గెలవలేని పరిస్థితుల్లో గెలిచి కాంగ్రెస్ జెండాను దామోదర్ రెడ్డి రెపరెపలాడించారన్నారు. శాసనసభ్యులుగా, మంత్రిగా ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఆయన కృషి చేశారని తెలిపారు. ప్రలోభాలకు లొంగకుండా కడవరకు కాంగ్రెస్ సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఎన్నికల ముందు తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదుగా వెళుతున్న సందర్భంలో తన వయసును కూడా లెక్కచేయకుండా అడుగులో అడుగు వేసిన గొప్ప ప్రజానేత దామోదర్ రెడ్డి మన మధ్య లేకపోవడం దురదృష్టకరం అన్నారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమం కోసం పరితపించారని గుర్తు చేశారు. దామోదర్ రెడ్డి ఆశయాలు, సిద్ధాంతాలు, ఆలోచనలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మాజీ మంత్రి జానారెడ్డి మాట్లాడుతూ ... దామోదర్‌రెడ్డి తన జీవితాన్ని ప్రజాసేవకే

- మిగతా 2 లో

ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక రియల్ ఎస్టేట్

వ్యవసాయం తరువాత ఉపాధి ఈ రంగంలోనే
నిర్మాణ రంగ వృద్ధి రేటు 11.97 శాతం : మంత్రి దుద్దిళ్ల

విశాలాంధ్ర - హైదరాబాద్: వ్యవసాయం తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలోనే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైటెక్స్‌లో నిర్వహిస్తున్న 15వ నారెడ్కో (రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) తెలంగాణ ప్రాపర్టీ షోలో ఆదివారం ఆయన మాట్లాడుతూ... '2024-25లో రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవల రంగం 15.4 శాతం వృద్ధి రేటు నమోదు చేసిందన్నారు. 11.97 శాతం వృద్ధి రేటుతో నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80వేల కోట్లకు పైగా సమకూర్చిందన్నారు. స్టేట్ సర్వీసెస్ జీఎస్‌డీపీలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంది అని పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ -మల్కాజ్ గిరి జిల్లాల పరిధిలో 2024, సెప్టెంబరులో రూ.2,820 కోట్ల విలువైన 4,903 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగిందని వివరించారు. ఈ ఏడాది సెప్టెంబరులో రూ.4,804 కోట్ల విలువైన 6,612 ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయన్నారు. గతంతో పోలిస్తే ఇది 35 శాతం అధికమన్నారు. విలువలో వార్షిక వృద్ధి 70 శాతంగా నమోదయిందన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలయిందంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్న వారికి ఇవి ధీటైన సమాధానాలు అని అన్నారు. 'భారత్ లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. అయితే... అభివృద్ధి చెందిన దేశాల జీడీపీలో స్థిరాస్తి రంగ వాటా సగటున 10 నుంచి 15 శాతం కాగా... చైనాలో అత్యధికంగా 23 శాతం నుంచి 25 శాతం వరకుంది. మన దేశంలో ఇది ఆరు నుంచి నుంచి ఎనిమిది శాతమే. ఇది మరింత పెరగాల్సిన అవసరముంది' అని మంత్రి అభిప్రాయపడ్డారు. 'ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో ఫేజ్ -2, భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్డు తదితర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు మారిపోనున్నాయన్నారు. 'ఫ్యూచర్ సిటీ'లో 200 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న ఏఐ సిటీకి రెండు, మూడు నెలల్లోనే భూమి పూజ చేయబోతున్నాం' అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నారెడ్కో తెలంగాణ ప్రతినిధులు విజయసాయి మేక, కాళీ ప్రసాద్ దామెర, లయన్ కిరణ్, కె.శ్రీధర్ రెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిచర్యలకు వెనుకాడం

బెదిరింపులు కాదు... చర్చలతోనే పరిష్కారం: అమెరికా సుంకాలపై చైనా 2 లో

జేడీయూ, బీజేపీకి 202 సీట్లు

చెరొక 101 స్థానాల్లో పోటీ
ఎల్‌జేపీ-29, ఆర్ఎల్ఎం, హెచ్ఏఎం చెరో ఆరు
బీహార్ ఎన్డీఏలో సీట్ల ఖరారు

న్యూదిల్లీ: బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, వివిధ పార్టీల్లో సీట్ల కేటాయింపుపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. తాజాగా ఎన్డీఏలో సీట్ల పంపకంపై నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. మొత్తం 243 సీట్లపై అధికార ఎన్డీఏ కూటమి లో భాగస్వామ్య పక్షాల నడుమ ఒప్పందం కుదిరింది. ప్రధాన పక్షాలు బీజేపీ, జేడీయూలు చెరో 101 స్థానాలో పోటీ చేయనున్నాయి. చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్)కి 29 సీట్లు దక్కాయి. కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహా సారథ్యంలోనిరాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం), కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం) చెరో ఆరు సీట్లలో పోటీ చేస్తాయి. ఈ మేరకు కేంద్రమంత్రి, బీహార్ ఎన్నికల ఇంఛార్జిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ అధికారికంగా 'ఎక్స్' సామాజిక మాధ్యమంలో వివరాలు ప్రకటించారు. "ఎన్డీఏ మిత్రపక్షాలు స్నేహపూర్వక వాతావరణంలో సీట్ల పంపిణీని పూర్తి చేశాయి. ఎన్డీఏ పార్టీల కార్యకర్తలు, నాయకులందరూ దీనిని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నారు. బీహార్ సిద్ధంగా ఉంది... ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ ఏర్పడుతుంది" అని ప్రధాన్ ట్వీట్ చేశారు. బీహార్ ఎన్నికల ఇంఛార్జిగా ఉన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, గత ఏడాది హర్యానాలో బీజేపీకి వరుసగా మూడో విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారు. జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఝా కూడా ఈ సమాచారాన్ని సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. బీజేపీ, జేడీయూ సమాన స్థానాల నుంచి పోటీ చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఎన్డీఏలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారని, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలో మరోసారి బీహార్‌లో ఎన్డీఏ సర్కారును భారీ మెజారిటీతో ఏర్పాటు చేయాలన్న దృఢనిశ్చయంతో ఐక్యంగా ఉన్నారని సంజయ్ ఝా పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు బీహార్ సిద్ధంగా ఉందని ఆయన 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు.

కాగా, కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీ తన పార్టీ హెచ్ఎఎమ్ 15-20 సీట్లు కావాలని డిమాండ్ చేసినప్పటికీ ఆరు సీట్లతో

- మిగతా 2 లో

ప్రజల్లో చైతన్యం నింపిన సీఆర్

- సమాజంలో పెరుగుతున్న అంతరాలు
- విచ్ఛిన్నమౌతున్న కుటుంబ వ్యవస్థ
- వృద్ధాశ్రమ వార్షికోత్సవంలో జస్టిస్ నగేశ్ భీమపాక

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమాజంలో అంతరాలు పెరిగిపోతున్నాయని, విచ్ఛిన్నమవుతున్న కుటుంబాల సంఖ్య నానాటికీ పెరుగుతోందని తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక ఆందోళన వ్యక్తం చేశారు. సీఆర్ (చంద్ర రాజేశ్వరరావు) ఫౌండేషన్ వృద్ధాశ్రమ 26వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన భీమపాక మాట్లాడుతూ... తన చుట్టూ జరుగుతున్న అన్యాయాలను ఎదిరించే అంశంలో మౌనంగా ఉండకూడదనే ఉద్దేశంతోనే చంద్ర రాజేశ్వరరావు వంటి ఎంతో మంది మహనీయులు ప్రజలలో చైతన్యాన్ని నింపేందుకు కృషి చేశారని అన్నారు. సమాజానికి అనేక రకాలుగా సేవలందించిన వారు వృద్ధాశ్రమంలో ఉన్నారని, వారంతా నడిచేదేవుళ్ల అని అభివర్ణించారు. ప్రజా సమస్యలపై చేపట్టిన ఆందోళనలకు గాను తన తండ్రి ప్రతి ఏటా కనీసం పది రోజుల పాటు జైలు జీవితాన్ని గడిపేవారని జస్టిస్ భీమపాక గుర్తు చేసుకున్నారు. పది ఎకరాల్లో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి, మరింత సేవలను అందించాలని, ఇందుకు తమ వంతు సహకారం అందిస్తామని ఆయన హామీనిచ్చారు. అజీజ్ పాషా మాట్లాడుతూ చంద్ర రాజేశ్వర్ రావు

- మిగతా 2 లో

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ, బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరి

కలసికట్టుగా ఉద్యమిస్తే విజయం తథ్యం
'బీసీ హక్కుల సాధన సమితి' సమావేశంలో కూనంనేని

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ఉద్యమం తరహా 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల' సాధన కోసం బీజేపీ, బీఆర్ఎస్ ఎందుకు కలిసి రావడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. రిజర్వేషన్ల అమలుపై రాహుల్ గాంధీ మాట్లాడడం లేదని ప్రశ్నిస్తున్న బీజేపీ... రాహుల్ మాట్లాడకపోతే కేంద్రం మాట్లాడదా... ఆ బిల్లులను ఆమోదించరా అని నిలదీశారు. 'బీసీ హక్కుల సాధన సమితి' రాష్ట్ర కౌన్సిల్ సమావేశం మఖ్దూం భవన్ ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా

- మిగతా 2 లో

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడిగా మనోహర్‌నాయుడు

విశాలాంధ్ర-విజయవాడ: పాఠకుల విజ్ఞాన వికాసానికి పెద్దఎత్తున తోడ్పాటు అందిస్తున్న విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడిగా టి.మనోహర్‌నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే పుస్తక ప్రదర్శనలో విజయవాడ పుస్తక మహోత్సవం ముఖ్యమైనది. పుస్తక పఠనంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేదుకు సొసైటీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు పాఠకుల మన్ననలు అందుకుంటూ తనదైన ముద్ర వేసుకుంటుంది. ఇప్పటి వరకు 35 ప్రదర్శనలు

- మిగతా 2 లో

ప్యాలెస్ పజిల్

- రుషికొండ భవనాల వినియోగంపై కూటమి సర్కారు మల్లగుల్లాలు
- నిరుపయోగంగా మారిన విలాస భవంతులు
- నెలలు గడుస్తున్నా ఎటూ తేల్చని వైనం
- చివరకు సూచనలు, సలహాలివ్వాలంటూ బహిరంగ ప్రకటన

2 లో

అఫ్గాన్ ప్రతీకార దాడి

58 మంది పాక్ సైనికుల మృతి: 20 ఔట్‌పోస్టులు ధ్వంసం

- ఐసిస్-కె సభ్యుల అప్పగింతకు తాలిబన్ల డిమాండ్
- ఖతార్, సౌదీ విజ్ఞప్తితో పోరుకు తెర
- 200 మందిని మట్టుబెట్టాం: పాక్ సైన్యం

8 లో

అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దుల్లో సైనిక ఘర్షణలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. గురువారం పాక్ జరిపిన వైమానిక దాడులకు అఫ్గాన్ ప్రతీకారం తీర్చుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు పెద్దఎత్తున సైనిక ఆపరేషన్ నిర్వహించింది. ఈ క్రమంలో రెండు దేశాల సరిహద్దులు మూసివేశారు.

లండన్‌లో పలస్తీనా సంఘీభావ ప్రదర్శన

శాశ్వత శాంతికి పిలుపు

లండన్: గజాలో శాశ్వత శాంతి కోసం బ్రిటన్ ప్రజలు డిమాండ్ చేశారు. ఆయుధాలు నిషేధించాలని పిలుపునిచ్చారు. పలస్తీనాకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. సెంట్రల్ లండన్‌లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి పలస్తీనాకు మద్దతుగా భారీస్థాయిలో ప్రదర్శన నిర్వహించారు. పలస్తీనాకు స్వాతంత్ర్యం, మారణహోమం వద్దు, పలస్తీనా వర్ధిల్లాలి, మీకు మానత్వం లేదా అన్న నినాదాలు, ప్లకార్డులతో శాంతియుతంగా విక్టోరియా ఎంబార్క్‌మెంట్ నుంచి వైట్ హాల్ వరకు మార్చ్ జరిగింది.

'ఫ్రమ్ ద రివర్ టు సీ, పలస్తీనా విల్ బి ఫ్రీ' (నది నుంచి సముద్రం వరకు... పలస్తీనాకు స్వాతంత్ర్యం), మారణహోమాన్ని వ్యతిరేకించడం నేరం కాదు, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ చేతులు రక్తంతో తడిచాయి, పలస్తీనాకు విమోచనం' నినాదాలు రానిస ప్లకార్డులను ప్రదర్శించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించినది సంపూర్ణ శాంతికి ఉద్దేశించిన ప్రణాళిక కాదు. హింసకు కారణాల ప్రస్తావన అందులో లేదు. పలస్తీనాలో వర్ణవివక్ష వ్యవస్థ గురించీ, పలస్తీనీయన్లు సొంత నిర్ణయాలు తీసుకోగల హక్కు గురించీ ఈ ప్రణాళికలో ఏమీ లేదు. పలస్తీనా ప్రజలకు సంపూర్ణ స్వాతంత్ర్యం లభించేంత వరకు మా ఆందోళనలు, ప్రదర్శనలు కొనసాగిస్తాం' అని నిర్వాహకులు వెల్లడించారు. పలస్తీనా సంఘీభావ సంఘం డైరెక్టర్ బెన్ జమాల్ వెల్లడించారు. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినాగానీ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. 2023 అక్టోబరు నుంచి పలస్తీనాకు మద్దతుగా జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రదర్శనల్లో ఇది 32వదని పలస్తీనా సంఘీభావ సంఘం వెల్లడించింది. శాంతి-పలస్తీనా విమోచనం కోసం పోరాడతామని పేర్కొంది.

ప్రతిచర్యలకు వెనుకాడం

బెదిరింపులు కాదు...చర్చలతోనే పరిష్కారం: అమెరికా సుంకాలపై చైనా

బీజింగ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశంపై సుంకాలతో విరుచుకుపడటాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. బెదిరింపులకు పాల్పడటం వల్ల ఫలితం ఉండదని, విభేదాలను చర్చించి పరిష్కరించుకోవచ్చిన హితవు పలికింది. అమెరికా సుంకాల విషయంలో చైనా వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ఆ దేశ వాణిజ్య శాఖ ఆదివారం ఒక ప్రకటన చేసింది. వాణిజ్య యుద్ధాన్ని కోరుకోవడం లేదు కానీ ప్రతి చర్యలు అవసరం అనుకుంటే వెనుకాడబోమని తేల్చిచెప్పింది. చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో చైనా వాణిజ్య శాఖ స్పందించింది. తరచూ అధిక సుంకాలతో బెదిరింపులకు పాల్పడే వైఖరి సరైనది కాదని అమెరికాకు సూచించింది. ఎలాంటి సమస్యలైనా చర్చించి పరిష్కరించుకోవచ్చని, సుంకాల విషయంలోనూ చర్చలకు తమ దేశం సానుకూలంగా ఉన్నట్లు వెల్లడించింది. అమెరికా మొండిగా వ్యవహరిస్తేగనుక తమ న్యాయమైన హక్కులు, ప్రయోజనాల పరిరక్షించుకునేందుకు చైనా కూడా ప్రతి చర్యలకు సిద్ధం కావాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది.

సుంకాల విషయంలో అమెరికా ద్వంద్వ ప్రమాణాలు రెండు దేశాల ప్రయోజనాలకు హాని కలిగిస్తాయని పేర్కొంది. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు ద్వైపాక్షిక, ఆర్థిక, వాణిజ్య చర్చల వాతావరణాన్ని దెబ్బతీస్తాయని వెల్లడించింది. అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలతో ట్రంప్ మండిపడ్డారు. 'భారీ సుంకాలు విధిస్తా... చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ రద్దు చేసుకుంటా' అని బెదిరించారు. చైనా దిగుమతులపై మరో 100 శాతం సుంకాలు నవంబర్ 1 నుంచి విధిస్తామని, చైనా స్పందన బట్టి వీటిని ముందుగానే అమల్లోకి తెచ్చే అవకాశం లేకపోలేదని ట్రంప్ వెల్లడించారు.

నేడు ఈజిప్టులో గజా శాంతి సదస్సు

హాజరుకానున్న గుటెర్రస్, ట్రంప్

ఐరాస: గజా శాంతి సదస్సు సోమవారం ఈజిప్టులో జరగనుంది. ఐక్యరాజ్య సమితి (ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ పాల్గొంటారు.

ఈ మేరకు ఐరాస ప్రతినిధి ఆదివారం వెల్లడించారు. రెడ్ సీ రిసార్ట్‌లో ఈ సదస్సుకు వేదికైంది. గజా యుద్ధానికి ముగింపు పలికేందుకుగాను తుది ఒప్పందం కోసం ఈ సదస్సు జరుగుతోంది. ఈ మేరకు ఈజిప్టు అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటన చేసింది. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా అల్ సిసీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సుకు 20కుపైగా దేశాధినేతలు హాజరవుతారు. పశ్చిమాసియాలో శాంతి-సుస్థిరత నెలకొల్పడం, ప్రాదేశిక భద్రత-సుస్థిరత కోసం కొత్త దశ మొదలు పెట్టడం వంటి వాటిపై చర్చిస్తారని అధికారిక ప్రకటన వెల్లడించింది.

'లాపతా లేడీస్'కు 13 ఫిలింఫేర్‌లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ వేడుకలో షారుఖ్, కృతి సనన్, కాజోల్ తదితరులు తమ ప్రదర్శనలతో అలరించారు. 2024లో విడుదలైన చిత్రాలకు ఈ అవార్డులను ప్రకటించగా.. లాపతా లేడీస్, చందు ఛాంపియన్, కిల్ చిత్రాలు సత్తా చాటాయి. దర్శకురాలు కిరణ్ రావు తెరకెక్కించిన 'లాపతా లేడీస్' సినిమా అదరగొట్టింది. ఏకంగా 13 అవార్డులు ఖాతాలో వేసుకుంది. ఉత్తమ చిత్రంగానూ పురస్కారం సొంతం చేసుకుంది. ఒకే సినిమా అత్యధిక అవార్డులు గెలుచుకున్న రికార్డును (గల్లీ బాయ్ కూడా 13 గెలుచుకుంది) సమం చేసింది. ఇక 'లాపతా లేడీస్' ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకురాలు (కిరణ్ రావు), ఉత్తమ సహాయ నటుడు (రవి కిషన్), ఉత్తమ సహాయ నటి (ఛాయా కదమ్) సహా వివిధ విభాగాల్లో ఈ చిత్రం అవార్డులు గెలుచుకుంది. ఈసారి ఉత్తమ నటుడి అవార్డును ఇద్దరు పంచుకున్నారు. 'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తీక్ ఆర్యన్, 'ఐ వాంట్ టు టాక్' చిత్రానికి అభిషేక్ బచ్చన్ సంయుక్తంగా ఈ గౌరవాన్ని అందుకున్నారు. 'జిగ్రా' చిత్రంలో అద్భుత నటనకు గాను ఆలియా భట్ ఉత్తమ నటిగా అవార్డు అందుకుంది. ఉత్తమ నటుడు (క్రిటిక్స్) అవార్డును 'శ్రీకాంత్' చిత్రానికి రాజ్‌కుమార్ రావు గెలుచుకోగా, 'లాపతా లేడీస్' చిత్రానికి ప్రతిభా రాంటా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. బాలీవుడ్‌కు చేసిన విశేష సేవలకు గాను సీనియర్ నటి జీనత్ అమన్, దర్శకుడు శ్యామ్ బెనెగల్‌ను జీవన సాఫల్య పురస్కారాలతో సత్కరించారు. 'లాపతా లేడీస్' చిత్రంలోని పాటను ఆలపించినందుకు గాను అరిజిత్ సింగ్ ఉత్తమ ప్లేబ్యాక్ సింగర్ (మేల్) అవార్డును గెలుచుకున్నారు. దీంతో ఫిల్మ్‌ఫేర్‌లో అత్యధికంగా 8 ఉత్తమ సింగర్ అవార్డులు గెలుచుకున్న కిషోర్ కుమార్‌తో సమానంగా నిలిచి అరిజిత్ సింగ్ రికార్డు సృష్టించారు.

'తొమాహాక్'లకు అణ్వస్త్రాలతో బదులిస్తాం

ఉక్రెయిన్‌తో యుద్ధంపై పశ్చిమ దేశాలకు రష్యా హెచ్చరిక

మాస్కో: ఉక్రెయిన్‌కు తొమాహాక్ క్షిపణులను అమెరికా సరఫరా చేసే అవకాశాలను రష్యా తీవ్రంగా పరిగణించింది. అన్ని వైపుల నుంచి ఒత్తిళ్లతో యుద్ధం నాటకీయ స్థితికి చేరుకుందని, దీనిని మరింతగా పెంచేందుకు ప్రయత్నించవద్దని పశ్చిమ దేశాలకు క్రెమ్లిన్ హెచ్చరిక చేసింది. తొమాహాక్ క్షిపణుల అంశంపై క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ఆందోళన వ్యక్తంచేశారు. తొమాహాక్ క్షిపణులతో దాడి చేస్తే... అణ్వస్త్రాలను బయటకు తీయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అదే జరిగితే ఎలాంటి పరిణామాలు ఎదరవుతాయో ఒక్కసారి ఆలోచించండన్నారు. 'న్యూక్లియర్ వార్‌హెడ్స్‌తో దీర్ఘశ్రేణి క్షిపణులు ప్రయోగిస్తే ఏం జరుగుతోందో ఊహించండి! రష్యా ఎలా ఆలోచించాలి... ఏ విధంగా స్పందించాలన్నది విదేశాల్లోని సైనిక నిపుణులు ఆలోచించాలి... అర్థం చేసుకోవాలని పెస్కోవ్ అన్నారు. కాగా, ఉక్రెయిన్‌కు తొమాహాక్ క్షిపణులు ఇవ్వడానికి ముందు వాటిని ఆ దేశం ఏ విధంగా వాడాలని అనుకుంటోందో తనకు తెలియాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం మరింతగా పెరగాలని కోరుకోవడం లేదు కానీ ఈ విషయంలో ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు.

ప్యాలెస్ పజిల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ తీర సౌందర్యానికి ప్రతీకగా నిలిచిన రుషికొండ ఇప్పుడు రాజకీయ, పరిపాలనా చర్చలకు వేదికగా మారింది. గత ప్రభుత్వ కాలంలో భారీ వ్యయంతో నిర్మించబడిన రుషికొండ భవనాల భవితవ్యంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇప్పటికీ తుది నిర్ణయానికి రాలేకపోయింది. ప్రజాధనంతో నిర్మించిన ఈ విలాస భవనాలు వాడుక లేకుండా ఖాళీగా ఉండిపోవడంతో కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులు వృథా అవుతున్నాయనే విమర్శలు ఊపందుకుంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.500 కోట్ల వ్యయంతో ఆరు భవనాలు నిర్మించారు. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో, సముద్ర తీరానికి సమీపంగా ఉన్న ఈ నిర్మాణాలను మొదట పర్యాటక హోటల్, రిసార్ట్‌లుగా ప్రణాళిక చేశారు. అయితే, పూర్వ వైసీపీ ప్రభుత్వం వీటిని విశాఖలో ఏర్పాటు చేయాలనుకున్న 'పరిపాలనా రాజధాని'లో సీఎం క్యాంపు కార్యాలయంగా వినియోగించే దిశగా మార్పులు చేపట్టడంతో తీవ్ర వివాదం చెలరేగింది. పర్యావరణ నిపుణులు, ప్రజా సంఘాలు ఈ నిర్మాణాలు రుషికొండ పర్వత ప్రాంతంలోని సహజ సమతుల్యాన్ని భంగం కలిగించాయని ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించాయి. ప్రస్తుతం ఆ కేసులు విచారణ దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీటి భవిష్యత్తుపై అనేక సమావేశాలు నిర్వహించినప్పటికీ స్పష్టతకు రాలేకపోయింది. గత ప్రభుత్వం వందల కోట్ల ప్రజా ధనాన్ని వెచ్చించి ఈ భవనాన్ని నిర్మించి దుర్వినియోగం చేసిందని కూటమి ప్రభుత్వ పెద్దలు విమర్శించారు. శాసనసభలో సైతం చర్చ జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఈ ప్యాలెస్ ఎలా వినియోగంలోకి తీసుకురావాలో అర్థం కావడం లేదని, శాసనసభ్యులు కూడా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఈ భవనాలను ఎలా వినియోగంలోకి తీసుకురావాలనే అంశంపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. మంత్రులు పయ్యావుల కేశవ్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, కందుల దుర్గేశ్ లతో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు కాగా... ఈ కమిటీ ఏర్పాటయ్యాక మూడు నెలలకు తొలి సమావేశం ఇటీవల జరిగింది. భవనం నిరుపయోగంగా ఉండటం వల్ల ఖర్చులు భరించాల్సి వస్తోంది. నెలకు రూ.25 లక్షలు విద్యుత్ చార్జీలు, నిర్వహణ ఖర్చులు పెట్టుకోవాల్సి వస్తుంది. గతంలో రూ.7 కోట్లు ఆదాయం వచ్చే చోట ఇప్పుడు ప్రభుత్వం ఎదురు చెల్లించాల్సి వస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితులను ఎలా అధిగమించాలనే విషయంపై మంత్రివర్గ ఉప సంఘం చర్చించినా ఒక నిర్ణయానికి రాలేకపోయింది. పర్యాటక శాఖ అధికారులు భవనాలను పర్యాటక హోటల్‌గా, ప్రభుత్వ విశ్రాంతి గృహాలుగా లేదా అంతర్జాతీయ కాన్ఫరెన్స్ సెంటర్‌గా ఉపయోగించేందుకు ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలుస్తోంది. అయితే, భవనాల స్థితి, భద్రత, చట్టపరమైన ఇబ్బందులు వంటి అంశాలపై వివిధ విభాగాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. రుషికొండ భవనాల సమస్య ఇప్పుడు కేవలం పరిపాలనా అంశం కాకుండా రాజకీయ అంశంగా మారింది. గత ప్రభుత్వ నిర్ణయాలపై విచారణ చేపట్టాలా? లేక భవనాలను పర్యాటక ప్రయోజనాలకు వినియోగించాలా? అన్న విషయంలో కూటమి ప్రభుత్వం ఏకాభిప్రాయానికి రాలేకపోతోంది. ఈ క్రమంలో ప్రజాభిప్రాయాలు కోరుతూ ప్రకటన ఇవ్వాలని కమిటీ నిర్ణయానికి వచ్చింది. ప్రజల నుంచి విస్తృతంగా సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత ప్యాలెస్ వినియోగంపై మంత్రుల సబ్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. సబ్ కమిటీ సూచనల నేపథ్యంలో తాజాగా టూరిజం అథారిటీ సీఈవో ఆమ్రపాలి... ప్రజల నుంచి సూచనలు, సలహాలు ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఆ భవనాలు ఎలా ఎలా వినియోగిస్తే బాగుంటుందో తెలపాలని ప్రజలను కోరారు. ప్రజలు తమ సూచనలను మెయిల్ (rushikonda@aptdc.in) చేయాలని విజ్ఞప్తి చేశారు.

17న జాతీయ,అంతర్జాతీయ స్థాయి సంస్థలతో సమావేశం

విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీ టూరిజం అథారిటీ కార్యాలయంలో ఈ నెల 17 నఉదయం 11 గంటలకు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలతో సమావేశం జరగనుంది. ప్రముఖ జాతీయ,అంతర్జాతీయ ఆతిథ్య గ్రూపులు, సమావేశంలో పాల్గొనవచ్చు. రుషికొండ ప్యాలెస్ ల వినియోగంపై ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) చేయవచ్చు. రుషికొండ భవనాల వినియోగంపై సమావేశంలో సంస్థలు అభిప్రాయాలు తెలియజేయవచ్చని ఏపీ టూరిజం అథారిటీ తెలిపింది. పౌరులు, సంస్థలిచ్చిన అన్ని సూచనలు, సలహాలను మంత్రుల బృందం సమీక్షిస్తుందని. ఏపీ టూరిజం అథారిటీ సీఈవో ఆమ్రపాలి తెలిపారు. మంత్రుల బృందం సమీక్ష తర్వాత వినియోగించే విధానం పై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని ఆమ్రపాలి స్పష్టం చేశారు. కాగా, ప్రజా నిధులతో నిర్మించిన భవనాలు వృథా కాకూడదని, వినియోగంలోకి తీసుకువచ్చి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్‌గా ఉంది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం కమిటీ సమావేశాలు, సమీక్షల పేరుతో కాలయాపన చేస్తూ వచ్చింది. దీంతో దాదాపు రూ.500 కోట్లతో నిర్మించిన భవనాల భవితవ్యంపై అనిశ్చితి కొనసాగుతోంది. అయితే ఈ కాలయాపన వెనుక రాజకీయ కోణం కూడా ఉందన్న మాటలు వినబడుతున్నాయి. ఈ భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చి ఆదాయం మెరుగ్గా ఉండి మంచి పేరు వస్తే ఆ క్రెడిట్ వైసీపీ తన ఖాతాలో వేసుకుంటుంది. అలా కాకుండా భవనాలను వినియోగంలోకి తెచ్చిన తర్వాత దాని వల్ల ప్రభుత్వానికి నష్టం వాటిల్లితే ఆ నెపాన్ని ప్రభుత్వ అసమర్థ నిర్ణయాలుగా ప్రతిపక్షం విమర్శించే అవకాశం ఉంది. ఈ నేపథంలో మంచీ, చెడు ప్రజలపై తోసేసేందుకు ప్రభుత్వం స్వతహాగా దీనిపై నిర్ణయాన్ని తీసుకోకుండా ప్రజల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలని నిర్ణయించిందనే మాట వినబడుతోంది.

జేడీయూ, బీజేపీకి 202 సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2020తో పోలిస్తే ఒక సీటు తగ్గింది కూడా. గత ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఏడు సీట్లలో పోటీ చేసి నాలుగింటిలో గెలుపొందారు. అయితే, తన పార్టీకి ఇచ్చిన దానితో తాను సంతృప్తి చెందానని మాఝీ తెలిపారు. "మాకు ఆరు సీట్లు వచ్చాయి. మేము దానిని అంగీకరిస్తున్నాము. మాకు లభించిన దాంతో మేము సంతృప్తి చెందాము. మాకు ఎటువంటి అభ్యంతరాలు లేవు" అని ఆయన అన్నారు. కాగా ఎల్జేపీ అధినే చిరాగ్ పాశ్వాన్ మొత్తం మీద ఎన్డీఏలో పైచేయి సాధించారు. 2020లో జేడీయూ, బీజేపీకి ఆయన చేసిన నష్టం దీనికి ప్రధాన కారణం. అందువల్ల జేడీయూ, బీజేపీ ఈసారి ఓ మెట్టు దిగొచ్చి ఆ పార్టీకి 29 స్థానాలు కేటాయించాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ అత్యధికంగా 115 స్థానాల నుండి పోటీ చేయగా, బీజేపీ 110 స్థానాలలో అభ్యర్థులను నిలబెట్టింది. చిరాగ్ పాశ్వాన్ పార్టీ 135 స్థానాల నుండి పోటీ చేసింది. 243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీల్లో జరుగుతాయి మరియు ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరుగుతుంది.

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడిగా మనోహర్‌నాయుడు

(మొదటిపేజీ తరువాయి)

పూర్తిచేసుకొని... 36వ ప్రదర్శనకు సన్నద్ధమవుతున్న వేళ ఆదివారం సొసైటీ ప్రాంగణంలో జరిగిన 2025-26 వార్షిక సర్వసభ్య సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా సొసైటీ అధ్యక్షుడిగా మనోహర్‌నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 14 మంది కార్యవర్గ సభ్యులు, ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులను సమావేశం ఎన్నుకుంది.

నూతన కార్యవర్గం

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడిగా టి.మనోహర్ నాయుడు (విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్), ఉపాధ్యక్షుడిగా జక్కంపూడి ప్రసాద్ (జేపీ పబ్లికేషన్స్), కార్యదర్శిగా కె.లక్ష్మయ్య (ప్రజాశక్తి బుక్ హౌస్), సహాయ కార్యదర్శిగా ఏబీఎస్ సాయిరామ్ (సహస్ర బుక్స్), కోశాధికారిగా కొండపల్లి రవి(నవసాహితి బుక్ హౌస్), వర్కింగ్ కమిటీ సభ్యులుగా జి.లక్ష్మి (సాహితి ప్రచురణలు), గోళ్ల నారాయణరావు (సుజాత పబ్లికేషన్స్), విశ్వేశ్వరరావు (సాహితీ మిత్రులు), వీజీయస్ రామారావు (వీజీయస్ పబ్లిషర్స్), ఎ.భాస్కరరావు (స్పందన పబ్లికేషన్స్), బి.రవికుమార్ (నవరత్న బుక్ హౌస్), బీవీ బసవ రాజు(వసుంధర పబ్లికేషన్స్), కె.శ్రీనివాస్ (జనవిజ్ఞాన వేదిక), వి. శ్రీనివాసరావు (శ్రీనిహిల్ పబ్లికేషన్స్), ఎన్ఎస్ నాగిరెడ్డి (శివరామ్ పబ్లిషింగ్ హౌస్), పి.సుబ్రహ్మణ్యం (వాసు బుక్ హౌస్), వల్లూరి శివప్రసాద్ (అమరావతి పబ్లికేషన్స్), కె.సత్యరంజన్ (సాహితి స్రవంతి), చలపాక ప్రకాశ్ (ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం) ప్రత్యేక ఆహ్వానితులుగా యస్.వెంకట నారాయణ (పల్లవి పబ్లికేషన్స్), పెనుగొండ లక్ష్మీనారాయణ (ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం) నియమితులయ్యారు.

త్యాగశీలి రామిరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

అంకితం చేశారన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాగమయి తదితరులు ... దామోదర్‌రెడ్డి ప్రజాసేవలను ప్రశంసించారు. డిప్యూటీ స్పీకర్ రామచందర్ నాయక్, కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి, ప్రజాప్రతినిధులు, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం నింపిన సీఆర్

(మొదటిపేజీ తరువాయి)

జీవితం ఎంతో మందిని ప్రభావితం చేసిందన్నారు. పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ అధ్వర్యంలో మహిళలకు ఎంబ్రాయిడరీ, కంప్యూటర్ తదితర వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. లైబ్రరీ సెంటర్‌కు సురవరం సుధాకర్ రెడ్డి పేరు పెట్టామని,ఈ లైబ్రరీని డిజటల్ చేశామని తెలిపారు.

వైద్య సేవలను కూడా అందిస్తున్నామని పల్లా తెలిపారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట రెడ్డి, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కె.అజయ్ కుమార్, కార్యదర్శి పి.జె. చంద్రశేఖర్‌రావు, కోశాధికారి, డైరెక్టర్ వి.చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజని, ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ... చంద్రరాజేశ్వరరావు, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డితో పాటు వృద్ధాశ్రమంలో మృతిచెందిన పలువురికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. తొలుత సీఆర్ విగ్రహానికి పూల మాల వేశారు. వృద్ధాశ్రమం డైరెక్టర్ వి.చెన్నకేశవ రావు సీఆర్ ఫౌండేషన్ గొప్పదనాన్ని వివరించారు. డాక్టర్ రజనీ... తాను అందుకున్న అవార్డును ఫౌండేషన్ కు అంకితం చేశారు. వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు టి. రాజేందర్ రావు, తమ్మారెడ్డి తాన్యా కుమారి వేదికపై ఆశీనులయ్యారు.

ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయం నేడు ప్రారంభం

- రూ.257 కోట్ల వ్యయంతో జీ ప్లస్ 7 అంతస్తుల నిర్మాణం
- రాజధాని అమరావతి భవనం ముందు భాగంలో 'ఏ' సింబల్
- ఇకపై ఇక్కడ నుంచే రాజధాని పనుల పర్యవేక్షణ
- ఉదయం 9.54 గంటలకు చంద్రబాబుచే ప్రారంభోత్సవం



విశాలాంధ్ర - సచివాలయం: ఏపీ సీఆర్డీఏ భవనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం ప్రారంభిస్తారు. ఇది అమరావతి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నిర్మించిన మొదటి భవనం. రాజధాని పనులు వేగం పుంజుకుంటున్న వేళ అమరావతిలో సీఆర్‌డీఏ కార్యాలయ నిర్మాణం పూర్తికావడం కీలకంగా మారింది. సీడ్ యాక్సెస్ రోడ్‌ను ఆనుకుని రాయపూడి వద్ద సీఆర్డీఏ నూతన భవనం సుమారు 4.32 ఎకరాల్లో నిర్మించారు. 2018లోనే భవన నిర్మాణం ప్రారంభం అయినా వైసీపీ పాలనలో పూర్తిగా పనులు నిలిచిపోయాయి. మరలా కుటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక పనులు తిరిగి ప్రారంభించి సర్వాంగ సుందరంగా భవనం నిర్మించారు. సుమారు రూ.250 కోట్ల వ్యయంతో నిర్మించిన సీఆర్‌డీఏ భవనాన్ని సీఎం ఉదయం 9.54 గంటలకు ప్రారంభించనున్నారు. 3.07 లక్షల చ. అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన జీ ప్లస్ 7 అంతస్తుల నూతన కార్యాలయంలో గ్రౌండ్ ఫ్లోర్లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్, కాల్ సెంటర్, క్యాంటిన్, రిసెప్షన్ ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో సమావేశ మందిరాలు నిర్మించారు. రెండు, మూడు, ఐదు అంతస్తుల్లో సీఆర్డీఏ అధికారులు, సిబ్బంది కార్యాలయాలు ఉన్నాయి. నాల్గవ అంతస్తులో మున్సిపల్ శాఖ డైరెక్టరెట్ కార్యాలయం, ఆరో అంతస్తులో అమరావతి డెవలప్‌మెంట్ కార్యాలయం, ఏడో అంతస్తులో మున్సిపల్ శాఖ మంత్రి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయంతో పాటు మున్సిపల్ శాఖ హెచ్‌వోడీల కార్యాలయాలు ఉంటాయి. భవనం ముందు భాగంలో అమరావతి సింబల్ 'ఏ' వచ్చేలా డిజైన్ చేశారు. 300 కార్ల పార్కింగ్, 300 ద్విచక్రవాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. భవనం ముందు భాగంలో 100 అడుగుల ఎత్తులో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేశారు. అధునాత వీధి లైట్లు, చూట్టూ పచ్చని చెట్లు ఏర్పాటు చేశారు. ఇక పై ఈ భవనం నుంచే అధికారులు రాజధాని పనులు పర్యవేక్షించునున్నారు. రాజధాని రైతులు ఇప్పటి వరకు విజయవాడలోని సీఆర్డీయే కార్యాలయానికి రావాల్సి వచ్చేది. ఇక పై రైతులకు తమ ప్రాంతంలోనే పురపాలక శాఖ ప్రధాన కార్యాలయం రావడంతో ఆనందం వక్తం చేస్తున్నారు. అమరావతి పర్యటనకు వచ్చే విదేశీయులు, ఇతర అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కార్యాలయంలోనే సమావేశాలు నిర్వహిస్తారు. ప్రస్తుతం అమరావతిలో 79 ప్రాజెక్ట్ ల పనులు ప్రారంభమయ్యాయి. వీటిలో సీఆర్డీఏ నుంచి రూ.12,762.46 కోట్ల విలువైన 19 పనులు, ఏడీసీఎల్ నుంచి రూ.36,737.06 కోట్ల విలువైన 60 పనులు జరుగుతున్నాయి. మొత్తం రూ.54,693.09 కోట్ల విలువైన 90 పనులకు పాలనాపరమైన అనుమతులు వచ్చాయి. మరో ఏడు పనులు టెండర్ల ప్రక్రియలో ఉన్నాయి. మరో ఐదు పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఇవికాకుండా మరో రూ.36,577 కోట్ల విలువైన 20 పనులకు పాలనాపరమైన అనుమతులు రావాల్సి ఉంది.

బీజేపీ, బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరి

(మొదటిపేజీ తరువాయి)

విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ... శాసనసభ ఆమోదించిన 'బీసీ రిజర్వేషన్ల బిల్లుల'ను కేంద్రంలోని అధికాం బీజేపీ ఆమోదిస్తే, ప్రస్తుతం రిజర్వేషన్ల సమస్య ఉత్పన్నమయ్యేదే కాదన్నారు. రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఒక వైపు అసెంబ్లీలో రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు పలుకుతూనే, ఆ బిల్లు ఎలా పెండింగ్ ఉండాలని ఆలోచిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వమే దేశ వ్యాప్తంగా కులగనణ చేపట్టి, వాటి ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలి కదా, మిగతా రాష్ట్రాలలో కూడా బీసీలు ఓట్లు వేస్తేనే బీజేపీ అధికారంలోనికి వచ్చిందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. బీసీ మండల కమిషన్‌కు వ్యతిరేకంగా అప్పటి బీజేపీ సీనియర్ నాయకుడు అద్వాని కమండల్ యాత్ర నిర్వహించారని కూనంనేని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడా సాధ్యం కాదని అనేక మంది చెప్పారని, కానీ అందరూ కలిసి ఉద్యమించారని, తద్వారానే రాష్ట్ర ఏర్పాటు జరిగింది, రిజర్వేషన్లు కూడా అలాగే చేస్తే సాధ్యమవుతుందని వివిధ రాజకీయ పార్టీలకు కూనంనేని సూచించారు. రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా చిత్తశుద్ధితో కలిసి ముందుకు రావాలని అన్నారు. రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమించాలన్నారు. రిజర్వేషన్లను సాధించే దిశగా ఉద్యమ కార్యా చరణను రూపొందించాలని పిలుపు నిచ్చారు. 'బీసీ హక్కుల సాధన సమితి' అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు, గౌరవ అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, నాయకులు పాండురంగాచారి, యాదయ్య, విజయుడు, ఎల్. శ్రవన్, ప్రమీల, కుమార స్వామి పాల్గొన్నారు.

రాజ్యాంగం హామీతో చెక్కుచెదరని భారత్

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగం. రాజ్యాంగం కారణంగానే అల్లర్లు, నిరసనల వంటి పరిస్థితులు నెలకొన్న పొరుగుదేశాల కన్నా భిన్నంగా ఉండగలిగాము' అని అన్నారు. రాజ్యాంగ నిర్మాత, ప్రముఖ సంఘ సంస్కర్త డా.బీఆర్ అంబేద్కర్ స్వస్థలమైన అంబాదావే ప్రాంతంలో కోర్టు భవనం నిర్మించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గత 22 ఏళ్లలో జడ్జీగా తాను న్యాయవ్యవస్థ వికేంద్రీకరణకు మద్దతిచ్చానని అన్నారు. అనేక న్యాయ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూసుకున్నానని చెప్పారు. కొల్హాపూర్ సర్క్యూట్ బెంచ్ (బాంబే హైకోర్టు), రెండేళ్లలో పూర్తయిన మండన్‌గడ్ కోర్టు భవనం తనకు పూర్తి సంతృప్తినిచ్చాయని అన్నారు. కలసాకారమైందని, మండన్‌గడ్ కోర్టు భవన నిర్మాణ ప్రాజెక్టును వేగవంతం చేసినందుకు మహారాష్ట్ర ప్రభుత్వానికి సీజేఐ కృతజ్ఞతలు తెలిపారు.

డీసీసీ అధ్యక్ష పదవికి కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవచ్చు

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : డీసీసీ అధ్యక్ష పదవిపై కార్యకర్తల అభిప్రాయం తిసుకుంటాము అని కార్యకర్తలు ఎవరైనా డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకోవచ్చునాని ఏఐసీసీ అబ్జర్వర్ జరిత అన్నారు. ఆదివారం స్థానిక రెడ్లస్ హెటల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఎంపికలో భాగంగా సంఘటన్ శ్రీజన్ కార్యక్రమంలో దరఖాస్తుల రిలీజ్ చేసి, ప్రక్రియ ప్రారంభించిన అనంతరం జరిత మాట్లాడుతూ డీసీసీ అధ్యక్ష పదవిపై కార్యకర్తల అభిప్రాయం తిసుకుంటాం అన్నారు. కార్యకర్తలు ఎవరైనా డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకోవచ్చు తెలిపారు. పార్టీ కార్యకర్తలే కాకుండా, స్వచ్చంద సంస్థలు, కుల సంఘాల అభిప్రాయాలు తీసుకుంటాం అని తెలిపారు. ఈనెల 20 వరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి ఏఐసీసీకి నివేదిక ఇస్తాం అని తెలిపారు. జిల్లా అధ్యక్ష ఎన్నిక తర్వాత మండల, బ్లాక్‌తో పాటు పిపిసి కమిటీ ప్రక్షాళన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, టీజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాధ్యానం, నాయకులు కూన సంతోష్, గంగేరి శ్రీహరి, కిరణ్ గౌడ్, గడిల రామ్ రెడ్డి పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు మండల కేంద్రంలో అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. నూతన కార్యవర్గ అధ్యక్షులు ముయ్యబోయిన వెంకన్న, ప్రధాన కార్యదర్శి ముక్తవరం సత్యనారాయణ, కోశాధికారి బత్తుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుమండల వెంకటేశ్వర్లు, ఊకె లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి, నూనావత్ వీరన్నక్రీడా కార్యదర్శి, పెనుక ప్రభాకర్ప్రచార కార్యదర్శి, వాంకుడోత్ గోపీనాథ్, గౌరవ అధ్యక్షులు, ఎండి కాసిం, వాంకుడోత్ కొమ్మాలు, గౌరవ సలహాదారులు కన్న వెంకటేశ్వర్లులను ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు ముయ్యబోయిన.వెంకన్న మాట్లాడుతూ అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ అధ్యక్షులుగా సభ్యులందరూ తనను ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం బలపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. సంగెపు స్వామి, బీరం వెంకట్ రెడ్డి, అయిలబోయిన వీరయ్య, బుర్రి కొమురయ్య, బట్టు సారయ్య, ముంజాల పూర్ణచందర్, పేరాల రాము, గజ్జి మల్లయ్య, వద్దూరి రాజలింగాచారి, సయ్యద్ కరీం, సిహెచ్ దేవేంద్రరావు, బెజ్జం రమేష్, మడిపెద్ది భాస్కర్‌లు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న పాలక పార్టీలు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్/ తొర్రూరు : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలకు చట్టసభలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్తున్న మాటలు నీటి మీద రాతలేనని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మాస్ లైన్ డివిజన్ తొర్రూర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తోరూర్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేము అనుకూలంగానే ఉన్నాము కానీ బిజెపి, టీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాని కాంగ్రెస్ చెబుతూట్టే మరోవైపు మేము అనుకూలమే కాంగ్రెస్కు చిత్తశుద్ధి లేదని బిజెపి, టీఆర్ఎస్‌లు ప్రజలను మభ్యపరచడం జరుగుతుందని అన్నారు. మూడు రాజకీయ ప్రధాన పార్టీలు అందరూ అనుకూలమే అంటూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా కుట్రలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. భారత రాజ్యాంగంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్టు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు హక్కులు ఉండాలని దానికి మేము అనుకూలం అంటూ అధికారంలోకి వచ్చిన పార్టీ గవర్నర్ ఆమోదం లేకుండా రాజ్యాంగ సవరణ చేయకుండా 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత లేదని విషయం కాంగ్రెస్కు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజలను మభ్యపరచడానికి పాలకవర్గ పార్టీలు తమ పబ్బం కడుపుకోవటానికి చేస్తున్న ఎత్తులు జిత్తులను ప్రజలు అర్థం చేసుకోవాలని రవి తెలిపారు. అనంతరం సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా అందరు అనుకూలమేనని 17 సంవత్సరాలుగా భారత పార్లమెంటు హౌస్‌లో మొలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి అదే రకమైన గతి పడుతుందా అని అనుమానాన్ని వ్యక్తం చేశారు. సీనియర్ డివిజన్ నాయకులు ఊడుగుల రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జక్కుల యాకయ్య, సేద్యం యాకయ్య, చింత నవీన్, కొమ్మనబోయిన వెంకన్న, గద్దల వెంకటయ్య, జక్కుల ఐలయ్య, కేశవులు, సంతోష్, షరీఫ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - తొర్రూరు: ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ అన్నారు. తొర్రూరు మున్సిపాలిటీలోని దుబ్బ తండలో జిల్లా కేంద్రంలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మునుకుంట్ల యాదలక్ష్మీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం 2వ రోజు ఆదివారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యాదలక్ష్మి వాలంటీర్లకు యోగా సాధన ప్రాముఖ్యతను వివరించారు. 50 మంది వాలంటర్లు ఉత్సాహంగా పాల్గొని ప్లాస్టిక్ భూతాన్ని నిర్మూలిద్దాం- పచ్చదనాన్ని పెంచుదాం, ప్లాస్టిక్ భూతం- ప్రాణాలు ఖతం, ప్లాస్టిక్ వద్దు- కాటన్ ముద్దు, ప్లాస్టిక్ నిషేధం- పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా మన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులను సమ తుల్యం చేస్తుందని, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగ సాధనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సాధ్యమైనంతవరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం వస్త్ర సంచులు, జ్యూట్ బ్యాగ్స్ లేదా గాజు పదార్థాలు ఉపయోగించడం అలవాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించడంపై వాలంటీర్లు అవగాహన పెంపొందించుకొని, ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రజిని, సమత డిగ్రీ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ తండా హరీష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఝాన్సీ, నవ్య, అఖిల, త్రిష, మౌనిక, స్రవంతి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కాంగ్రెస్ కమిటీల ఎన్నిక

ఉత్తరాఖండ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, ఏఐసిసి పరిశీలకురాలు జ్యోతి రౌతేలా

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: పారదర్శకంగా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ చేస్తున్నట్లు ఉత్తరాఖండ్ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, ఏఐసిసి పరిశీలకురాలు జ్యోతి రౌతేలా అన్నారు. ఆదివారం మెదక్‌లో డిసిసి అధ్యక్ష పదవి ఎన్నిక సందర్భంగా సంఘటన్ సృజన్ అభియాన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా సంస్థాగత ఎన్నికలను గుజరాత్‌లో ప్రారంభించి రాజస్థాన్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా మీదుగా తెలంగాణకు రావడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీలోని అన్ని వ్యవస్థలను పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. పారదర్శక ఎన్నిక కోసం అన్ని వర్గాల స్థాయి కార్యకర్తల నుండి అభిప్రాయాలు సేకరించడం జరుగుతుందన్నారు. మండల, బ్లాక్, జిల్లాస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలు సందర్శిస్తున్నామన్నారు. పార్టీలో పని చేసే నాయకులకు, కార్యకర్తలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు సముచిత ప్రాధాన్యత లభిస్తుందన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవి కోసం అందజేసిన నామినేషన్ పత్రాలను ఈనెల 22న ఏఐసిసికి నివేదిక సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సుహాసిని రెడ్డి, పీసిసి ఉపాధ్యక్షులు, కోఆర్డినేటర్ జగదీశ్వరరావు, పీసీసీ కో ఆర్డినేటర్లు అహ్మద్ నజీర్, వరలక్ష్మి, డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, పిసిసి కార్యదర్శి సుప్రభాత రావు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పర్శగౌడ్, నర్సాపూర్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, దుబ్బాక ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాఫీజ్, మ్యాడం బాలకృష్ణ, ఉప్పల రాజేష్, మహిపాల్ రెడ్డి, బొజ్జ పవన్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల శ్రమకు తగిన వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర - నల్గొండ బ్యూరో : మున్సిపల్ కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం లేకపోవడం దారుణమని, కాంట్రాక్టర్ విధానాన్ని రద్దు చేసి రెండవ పీఆర్సీలో కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలని సీఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నల్గొండలోని దొడ్డి కొమురయ్య భవనంలో జరిగిన తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా 5వ మహాసభలో ఆయన మాట్లాడుతూ "ధరలు విపరీతంగా పెరిగినా వేతనాలు పెరగడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కార్మికులకు రూ.24,500 ఇస్తున్నారు. కానీ తెలంగాణలో మాత్రం వేతనాల పెంపు జరగలేదు" అన్నారు. కార్మికులకు పని భద్రత, ఇన్సూరెన్స్, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని, కాంట్రాక్ట్-ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి శాశ్వత నియామకాలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మహాసభ ప్రారంభంలో యూనియన్ జెండాను తుమ్మల వీరారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చింతకాయల సంతోష్, శ్రీనివాస్, లక్ష్మమ్మ, పొట్ట తారమ్మ, ఎండి సలీం, దండెంపల్లి సత్తయ్య, జక్కల రవికుమార్, చిలుముల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపికైన దాసరి రాహుల్‌కు సత్కారం

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్లకు చెందిన యువకుడు దాసరి రాహుల్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో డీఎస్పీ హోదాకు ఎంపిక కావడంతో ఆదివారం స్థానిక పోలీసు అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ ఎ.రవీందర్, హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు రాహుల్‌కు శాలువా కప్పి సత్కారం చేశారు. కార్యక్రమంలో రాహుల్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు. సత్కార కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ "గ్రామీణ ప్రాంతం నుండి కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగిన రాహుల్ యువతకు ఆదర్శం" అని అభినందనలు తెలిపారు. రాహుల్ తన విజయం వెనుక కుటుంబ సహకారం, క్రమశిక్షణ, కష్టపడి చదివిన ప్రతిఫలమని పేర్కొన్నారు.

నేటి నుండి ప్రజావాణి కార్యక్రమం పునఃప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : 2వ సాధారణ జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణ కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం అక్టోబర్ 13వ తేదీ (సోమవారం) నుండి యధావిధిగా కొనసాగించబడుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా నిర్వహించబడు తుందని తెలిపారు. ప్రజలు, అర్జీదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు, విజ్ఞప్తులను నేరుగా అధికారుల సమక్షంలో సమర్పించుకోవచ్చని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ముఖ్య వేదికగా నిలుస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

సింగరేణి మెయిన్ హాస్పిటల్‌లో సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని మెయిన్ హాస్పిటల్లో సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంపులో నిర్వహించింది. ఆదివారం నిర్వహించిన ఈ క్యాంపులో 143 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు. ముఖ్యంగా కార్డియాలజీ, న్యూరో, గ్యాస్ట్రో, యురాలజీ, నెఫ్రో తదితర విభాగాల్లో స్పెషలిస్ట్ వైద్యుల ద్వారా సేవలు అందించారు. హైదరాబాద్‌లోని నిఖిల్ హాస్పిటల్, డెక్కన్ హాస్పిటల్ నిపుణ వైద్యులు ఈ క్యాంప్‌లో సేవలు అందించారు. ఇందులో సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతోపాటు పదవీ విరమణ చేసిన ఉద్యోగ కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఈ క్యాంప్‌లో చికిత్సలు చేయించుకున్నారు. సంస్థ సీఎండీ యన్. బలరాం ఆదేశాల మేరకు డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు సలహాతో చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ సారధ్యంలో అడిషనల్ సీఎంవో ఉష పర్యవేక్షణలో ఈ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు కార్పొరేట్ అధికారులు వెల్లడించారు. ఈ వైద్య సేవల్లో అనస్థీషియాలజిస్ట్ కాళేశ్వర రావు, హెల్త్ ఆఫీసర్ డా. లలిత, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ పి.బి. అవినాష్, మెయిన్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర - కారేపల్లి : కారేపల్లి మండలంలో అనారోగ్యాలతో మృతి చెందిన కుటుంబాలను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదివారం పరామర్శించారు. భాగ్యనగర్ తండాలో కాంగ్రెస్ మండల మహిళా నాయకురాలు గుగులోత్ నాగవేణి మామ గుగులోత్ లాలు నాయక్ సంస్మరణ కార్యక్రమానికి హాజరైన వైరా ఎమ్మెల్యే మృతుని చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కారేపల్లిలో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్ర ప్రకాష్, మేదరి వీర ప్రతాప్, ఎండి హనీఫ్, పొలగాని శ్రీనివాస్, మజీద్ పాష, షఫీ, వాంకుడోత్ గాంధీ, మేదరి రాజా, గుగులోతు బీముడు, బానోత్ హిరాలాల్, సట్టు వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

అలజడి రేపిన కార్పొరేటర్ అరెస్టు..!

విశాలాంధ్ర బ్యూరో- ఖమ్మం : ఖమ్మం నగరంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ మంజులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆమె ఖమ్మం పోలీసులు రౌడీషీటర్లకు మద్దతునిస్తున్నారంటూ ఆరోపించారు. తన భర్త నిఖిల్‌లేని నరేంద్ర పై కొంతమంది రౌడీషీటర్లు శనివారం దాడికి యత్నించారని ఆ విషయంలో ఖమ్మం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిని కచ్చితంగా అరెస్టు చేస్తానని సిఐ హామీ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. కాగా వారిని అరెస్టు చేయకపోవడంతో వారు తిరిగి మళ్లీ మరోసారి తమ ఇంటి వద్దకు వచ్చి చిటికెలు వేసి తన భర్త నరేంద్రను హత్య చేసేందుకు కవింపులకు పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. తన భర్తను కాపాడుకునేందుకు ఆమె ఆందోళన చేపట్టానని పేర్కొన్నారు. తమ ఇంటిపై దాడికి యత్నించే రౌడీషీటర్లను అరెస్టు చేయాలంటూ ఆమె రోడ్డుపై బైఠాయించి కొంతమంది మహిళలను వెంటబెట్టుకొని ధర్నా చేస్తుండగా పోలీసులు ఆమె నానా హంగామా చేస్తుందంటూ ఆమెను ఆమె భర్త నరేంద్రను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆమెను పోలీసులు వాహనంలో తీసుకెళుతుండగా పోలీసులపై ఆమె పలు ఆరోపణలు చేస్తూ తమను ఏ పోలీస్ స్టేషన్కు తీసుకెళుతున్నారు తెలియదని రౌడీషీటర్లను అరెస్టు చేయాలని తాను కోరగా చేస్తానని మాట ఇచ్చిన సీఐ వారిని ఏమీ అనకుండా బాధితులమైన మమ్ములను పోలీసులు అదుపులోకి తీసుకొని వేరే ప్రాంతానికి తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియో వైరల్ అయింది. ఈ రెండు వర్గాల మధ్య ఉత్పన్నమైన వివాదానికి కారణం ఒక భూమికి సంబంధించిన వ్యవహారం అని తెలుస్తోంది. ఆమె అధికార పార్టీ కార్పొరేటర్ అయినప్పటికీ ఆమె భర్త నరేంద్ర అధికార కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అయినప్పటికీ పోలీసులు మాత్రం వారు ఇరువురిని అదుపులోకి తీసుకోవడం ఖమ్మం నగరంలో చర్చనీయాంశంగా మారింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం నియోజకవర్గంలో నగరంలో ఈ ఘటన జరగటం గత రెండు మూడు రోజులుగా ఈ వివాదం చినుకు చినుకు గాలివానగా మారడం పట్ల నగర ప్రజల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

దీపావళి టపాసుల దుకాణానికి అనుమతి తప్పనిసరి: ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : త్వరలో రాబోయే దీపావళి పండుగ నేపథ్యంలో టపాసుల దుకాణదారులు తప్పకుండా తమ పరిధిలోని డివిజనల్ స్థాయి పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డివిజనల్ పోలీస్ అధికారి అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలను పెడితే వారిపై ఎక్స్ ప్లోజివ్ యాక్టు - 1884, రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారంగా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాలను నిర్దిష్ట ఖాళీ ప్రదేశాలలో మాత్రమే నెలకొల్పాలని ఆ ప్రదేశానికి సంబంధించిన ఎన్.ఓ.సి సర్టిఫికేటు పొందుపర్చాలన్నారు. ఒక క్లస్టర్లో 50 షాపులకు మించరాదన్నారు. జనావాస ప్రదేశాలలో షాపుల ఏర్పాటు చేయరాదన్నారు. ఈ షాపుల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంభంధిత అన్ని శాఖల నుండి అనుమతి పత్రాలను పొందిన తర్వాతనే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

విశాలంధ్ర - కారేపల్లి : కారేపల్లి మండల పరిధిలోని భజ్యాతండ గ్రామపంచాయతీకి చెందిన బిఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాసు నాయక్ సమక్షంలో విశ్వనాథపల్లి మాజీ సర్పంచ్ అజ్మీర కాంతి, ఉప సర్పంచి భూక్య మోహన్‌రావు వ్యాపారవేత అజ్మీర నరేస్-నికిత, వాంకుడోత్ బాబు లాల్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వైరా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీని నమ్ముకొని చేరిన వారికి అందరికి సముచిత స్థానం కల్పిస్తామని వారికి అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోసైటీ డైరెక్టర్ బానోత్ హిరాలాల్ కాంగ్రెస్ నాయకులు షేక్ సైదులు, గుత్తా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందాలి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : వైద్య సేవలు సకాలంలో ప్రజలకు అందించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్యాధికారులను ఆదేశించారు. కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజరు పట్టిక, మందుల స్టాక్ రిజిస్టర్, ఆసుపత్రి పరిసరాలు పరిశీలించి వైద్యాధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల కేసులు, వాటికి సంబంధించిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్లవేళలా వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు విశేష కృషి చేయాలని సూచించారు.

వానవాసి విద్యాలయానికి వాటర్ ప్యూరిఫైయర్ వితరణ

విశాలాంధ్ర - చర్ల : మండల కేంద్రంలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయానికి ఎన్ఆర్ఐ డాక్టర్ మిత్రవింద దంపతులు ఆర్వో వాటర్ ప్యూరి ఫైయర్‌ను అందచేసారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ సందర్భంగా ఆదివారం విద్యాలయ సలహాదారులు బివిఎస్ఎల్ నరసింహారావు మాట్లాడుతూ రామకృష్ణ - మిత్రవింద కుమారులు భువన్ కృష్ణ, నిర్మల్ కృష్ణలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. గత ఏడాది సైతం విద్యార్థులకు నెల రోజులకు సరిపడా కిరణా సామాన్లను అందచేసిన విషయాన్ని గుర్తుచేసారు. మాతృ భూమిపై మమకారంతో తమ ఉదారాత్వాన్ని చాటుకున్నారనీ ఎన్ఆర్ఐ దంపతులని కొనియాడారు. తాము ఇతర దేశంలో ఉన్నప్పటికీ జన్మభూమి ప్రజలకు విశాల హృదయంతో సహాయం చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ రామకృష్ణ మాతృమూర్తి సూర్యకాతం వర్ధంతి సందర్భంగా వాటర్ ప్యూరిఫైయర్‌ను అందించటం స్ఫూర్తిదాయకమన్నారు. అశోక్‌నగర్ సంపద ఉన్న శ్రీమంతులు ఆదివాసి విద్యార్థుల చదువుల కోసం సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ కమిటీ అధ్యక్షులు తాటి పాపారావు, కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, బాధ్యులు రాంలక్ష్మణ్, వేములపల్లి ప్రవీణ్ బాబు, శివరాజు కిషోర్, సత్యనారాయణ మూర్తి, లవన్ కుమార్ రెడ్డి, యాదాల సందీప్, ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

ఐఎస్‌జిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జర్నలిస్ట్ లోగాని శ్రీనివాస్

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఉదార సేవా భావం, సమాజ హితంకోసం పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్న ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా కొత్తగూడెం సీనియర్ జర్నలిస్ట్ లోగాని శ్రీనివాస్ ఎన్నిక అయ్యారు. ఆదివారం ఇక్కడి సింగరేణి చిల్డ్రన్స్ పార్కులోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయంలో ఎస్ఐజిఎఫ్ రాష్ట్ర సమ్మేళనం జరిగింది. ఇందులో సింగరేణి జీఎం వెల్ఫేర్ జీవి కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ అధ్యక్షుడు (ఎగ్జిక్యూటివ్) మ్యాక్ మిక్కి ప్రధాన పర్యవేక్షకుడుగా పాల్గొని మాట్లాడారు. భద్రాద్రి జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లోగాని శ్రీనివాస్ పేరును మిక్కి ప్రతి పాదించారు. ఎస్‌జిఎఫ్ జిల్లా అధ్యక్షుడుగా ప్రధాన కార్యదర్శిలు పత్స రామకృష్ణా రావు, చిట్టిమళ్ళ శ్వేతా బ్రహ్మాంచారి బలపర్చగా అందరూ ఆమోదం తెలిపారు. దింతో లోగాని శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు జాతీయ అధ్యక్షులు మ్యాక్ మిక్కి ప్రకటించారు. జర్నలిస్టుగా మంచి పేరున్న లోగాని రాష్ట్రస్థాయి పదవిలో ఎంపిక కావడం పట్ల సహచర జర్నలిస్టులతో పాటు పట్టణంలోని పరువులు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - ఇల్లందు : పాతికేళ్ల క్రితం ఒకే కళాశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థుల కలయిక అప్పటి నిష్కల్మష స్నేహాన్ని, ఆనంద ఘడియలను తలుచుకుంటూ సమ్మేళనం నిర్వహించారు. 2001-02 ఏడాది పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం అట్టహాసంగా గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆనాటి మధుర, చిలిపి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. అనంతరం తమకు విద్య నేర్పిన గురువులను ఆత్మీయంగా శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. అప్పటి గురువులు తమకు నేర్పిన విద్యాబుద్ధులతో పాటు ప్రేమ, దండన కూడా భవిష్యత్తులో స్థిరపడేలా చేసిందని పలువురు విద్యార్థులు ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆనాటి కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రావు, అధ్యాపకులు సాగర్, వేణుగోపాల్, సోమేశ్వరావు, జగన్, చంద్రశేఖర్, భూపాల్, రాములు తోపాటు పూర్వ విద్యార్థులు యాకయ్య, శోభన్, రాంబాబు, శ్రీను, మధు, విజయ్, సారయ్య, కుమార్, మమత, సమత, శ్రీలత, భాను, మన్సూర్బీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశలను నెరవేర్చ గల ఏకైక పార్టీ కాంగ్రెస్

విశాలాంధ్ర - కొమరం భీం : కాగజ్‌నగర్ పట్టణ కేంద్రంలోని రన్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ "సంఘటన్ శ్రీజన్ అభియాన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అబ్జర్వర్ నరేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నరు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ కమిటీలను మరింత సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దడం, కార్యకర్తలతో సమన్వయం పెంచడం, పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడమే సంఘటన్ శ్రీజన్ అభియాన్ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఏఐసిసి ఆర్గనైజర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆలోచనలు ఏఈసిసి ఆదేశానుసారం జిల్లా అధ్యక్షులు ఎంపిక పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరితో ఎఐసిసి అబ్జర్వర్ అందరి అభిప్రాయాలు తీసుకొని. పార్టీ ఆలోచనలను గ్రామ స్థాయి వరకు తీసుకో వెళ్లేందుకు మహిళలకు మరింత అవకాశాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశలను నెర వేర్చగాల ఏకైక శక్తి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు పులి అనిల్ కుమార్, అధువల జ్యోతి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, టీపిసిసి ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సాహితి

కొత్త విప్లవం

నువ్వు నిజంగా మార్పుని
కోరుకున్న వాడివైతే
గొడ్రాలు అయిపోతున్న
మట్టితో ఆరంభించు
దయాదాక్షిణ్యం లేకుండా
కర్కశంగా నరకబడుతున్న
వృక్షాలతో ఆరంభించు
కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతున్న
వాయువుతో ఆరంభించు
నీ రూపం ఇదే కదా!
నీ మూలాన్ని తెలుసుకోకుండా విప్లవం
ఎలా సాధ్యం?

హిందీ మూలం: కైలాశవాజపేయ్
తెలుగు అనువాదం:
పారనంది నిర్మల, సెల్: 9985103804

తెలుగు కథానికకు వేదిక వేదగిరి

డా॥ అమ్మిన శ్రీనివాసరాజు
సెల్:77298 83223

అవి తెలుగు కథానిక నూరేళ్ల పండుగకు సిద్ధమవుతున్న రోజులు. తన జీవిత గమనాన్ని మార్చిన కథానికకు తనకు తానుగా ఎంతో కొంత సహాయపడాలనే తపనతో ఒక సాహసయాత్ర మొదలుపెట్టి ఆంధ్రదేశంలోని జిల్లాలన్నీ తిరిగి కథానిక సదస్సులు నిర్వహిస్తున్నాడు ఒక నిస్వార్థ వ్యక్తి.

అందులో భాగంగా 27 ఏప్రిల్ 2008న పత్రికలో చదివిన వార్త ఆధారంగా కథానిక మీద ఉన్న మక్కువతో రాజమండ్రి వెళ్లాను, గౌతమీ గ్రంథాలయ ఆవరణలో జరిగిన కథానిక సదస్సులో పాల్గొన్నాను, అదిగో అక్కడే తొలిసారిగా చూశాను ఆ కథానిక వంశోద్ధారకుని రూపాన్ని అక్కడే అంకురించింది మా మైత్రి మొలక.

నాలోని తపన నిబద్ధత ఆయనను ఆకర్షించి ఉండవచ్చు ఆయన చేస్తున్న కథానిక యజ్ఞంలో నాకు కాస్త చోటు ఇచ్చి పునీతుడిని చేశారు, తెలుగు సాహిత్యంలో కథానికకు మారుపేరుగా మారుమోగిన ఆ దీక్షా దక్షుడే డాక్టర్ వేదగిరి రాంబాబు.

అలా మొదలైన మా అక్షర బంధం సాహితీ బంధువులు అయ్యేలా చేసింది ఎన్నో సభలు సమావేశాలు చర్చలు ముచ్చట్లుగా సాగిన మా అక్షరమైత్రి 9 ఏళ్ల పాటు సాగటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

భద్రాచలంలో 10 డిసెంబర్ 2017 న ఆయన చేతుల మీదుగా ప్రారంభించిన మాగంటి కళాపీఠం సభ భద్రాచలంలో ఆయన పాల్గొన్న చివరి సభ అవుతుందని మేము ఎవరు ఊహించలేదు, ఆ తర్వాత ప్రపంచ తెలుగు మహాసభల చివర రోజు19 డిసెంబర్ 2017 న హైదరాబాదులో బాలసాహిత్య పరిషత్ సభలో మా అందరితో ఆప్యాయంగా మాట్లాడిన ఆ మాటలే మాకు ఆయన చివరి మాటలు అవుతాయని మేము ఎవరు అనుకోలేదు. ఒకవైపు గురజాడ ప్రతి సృష్టి అయిన "కథానిక" ప్రచారం, గురజాడ సమగ్ర సాహిత్యం పునఃముద్రణతో పాటు తెలుగు కథానిక వికాసం కోసం కృషి, మరోవైపు తెలుగు భాష అమలు కోసం పోరాటం, ఆయన ఏది చేసినా ఏది రాసిన సమగ్ర సంపూర్ణ సమాచారంతో ఉండేది, ముక్కుసూటితనం ఆయన నైజం, ఆత్మీయత అనురాగం ఆయనలో అంతర్గత లక్షణాలుగా ఉండేవి.

మృదు మధురమైన స్వరం అలాంటిదే ఆయన రచనా శైలి కూడా, వందలాది కథలు ఎన్నో విశ్లేషణలు మరెన్నో ప్రయోగాత్మక రచనలు 1975 నుంచి 2017 వరకు ఎన్నో ప్రయోగాత్మక ప్రయోజనాత్మక రచనలు చేయడమే కాక ఎందరో యువ సాహితీవేత్తలకు బాసటగా స్ఫూర్తిగా నిలిచారు, ఒక విశ్వవిద్యాలయమో ఒక సాహితీ సంస్థనో, ఒక రాష్ట్ర ప్రభుత్వమో చేయాల్సిన బృహత్తర కార్యక్రమాలను ఒక వ్యక్తిగా... ఏనాడు ఒక్క రూపాయి కూడా ఇతరుల నుంచి ఆశించకుండా లక్షలాది రూపాయలు తాను ఇష్టపడ్డ కథానిక కోసం ఖర్చు చేసిన అక్షర ధీరుడు డాక్టరు వేదగిరి. సాహితీసేవ అంటే తాను ఒక్కడే చేసేసి ఆ కీర్తి కిరీటాలు తానొక్కడే సొంతం చేసుకోవడం కాదని, తాను నమ్మిన సాహితీ ప్రక్రియలో మరికొందరిని ప్రావీణ్యులను చేయడం, ఆ ప్రక్రియ పరిమళాలు అందించాలని ఆరాటంతో అన్నిటా తానై అనేక కథానిక సదస్సులు నిర్వహించి ఆయా జిల్లాల్లోని కథానిక చరిత్రను తెలుసుకుంటూ నాటి తరం రచయితలను వారి రచనలను ఈ తరం వారికి పరిచయం చేయడమే కాక ...నేటి యువ రచయితల్లో కథానిక ప్రక్రియపై ఆలోచన కలిగిస్తూ ఆసక్తిని పెంచుతూ రాష్ట్రవ్యాప్తంగా కథానిక సదస్సులు నిర్వహించిన నిజమైన కష్టజీవి ఆయన.

తెలుగు కథకు "కథానిక" అనే నిర్వచనం అందించిన డాక్టర్ వేదగిరి రాంబాబు తనదైన సాహితీ కృషిలో భాగంగా అనేక రచనలు చేయడంతో పాటు ఎందరో రచయితల రచనలు సొంత డబ్బుతో ప్రచురించి వెలుగులోకి తెచ్చారు.

1976లో ఆయన రాసిన తొలికథ సముద్రంకు ఆంధ్రప్రభ దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి లభించింది. అలా మొదలైన వేదగిరి రచన ప్రస్థానం వందలాది కథల రూపంలో అక్షర ప్రవాహమై పాఠకులను పరవశింపజేసింది,

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ఉద్యోగిగా ప్రారంభమైన వేదగిరి ఉద్యోగ ప్రస్థానం అనేక పత్రికల్లో ఉపసంపాదకుడిగా సంపాదకుడిగా చివరికి గ్లోబల్ ఆసుపత్రి ప్రజా సంబంధాల వ్యవహర్తగా కొనసాగారు.

తాను ఎంతగానో ఇష్టపడే కథానిక కోసం వేదగిరి చేయని కృషి అంటూ లేదు, కథా శిల్పాలు అనేక ప్రయోగాలు చేసిన ఈయన పెద్ద కథలు, గొలుసు కథలు, వయసు కథలు, పే(జీ)చీ కథలు, ఈ(కాలం) కథలు, ఉత్తరాల్ల కథలు, టెలిఫోన్ కథలు, స్వీట్ నాన్సెన్స్ కథలు, విభిన్న కథలు, వివిధ ప్రముఖ పత్రికల్లో రాశారు, వీరు రాసిన "వెలుగు దారిలో తెలుగు జర్నలిజం" అనే పుస్తకం బహుళ ప్రజాదరణ పొందింది.

కథనరంగం, కథానిక కొత్త కదలిక, వంటి వీరి పుస్తకాలు పి.జి విద్యార్థులకు పరిశోధక అంశాలు అయ్యాయి.

ప్రారంభం నుంచి తెలుగు కథానికలపై వచ్చిన సమీక్ష వ్యాసాలు సేకరించి "తెలుగు కథానిక లక్ష్యం లక్షణాలు" అనే పుస్తకం, కథానిక పీఠికలో "పరిశోధన సంహిత" అనే ప్రామాణిక పుస్తకం నాటి "పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం" కోసం అందించిన అక్షర కృషీవలుడు ఆయన.

1990 - 2000 దశాబ్దికి చెందిన సీనియర్ జూనియర్ కథా రచయితలు ప్రోత్సహించి సుమారు 50 నుంచి 60 పుస్తకాలు ప్రచురించారు కేంద్ర సాహిత్యఅకాడమీ ఢిల్లీ డైరెక్టర్‌గా ఉన్న యాదగిరి 1996లో ఐదు రోజులపాటు దేశంలోని అనేక ప్రాంతాల నుంచి వచ్చిన తెలుగు కథారచయితలతో "కథా రచయితల కార్య గోష్టి" హైదరాబాదులో సమర్థవంతంగా నిర్వహించిన కార్యదక్షుడు డాక్టర్ వేదగిరి.

రాష్ట్ర సాంస్కృతిక మండలి కోసం సి.నా.రె ఆధ్వర్యంలో రెండు వారాలపాటు నవరచయితల అధ్యయన కేంద్రం నిర్వహించి నవ కథారచయితల ఆవిర్భవానికి వేదగిరి చేసిన కృషి కలకాలం నిలిచిపోతుంది, ఈ సందర్భంగా రాయించిన కథలతో "నవతరం కథలు" సంకలనం ప్రచురించారు.

ఖైదీల మనోభావాలను క్షేత్రస్థాయి సందర్శనతో సేకరించి రాసిన రచన "జైలు గోడల మధ్య", సమాజంలో అతి నీచమైన వృత్తుల్లో జీవించే జీవన చిత్రాలకు అద్దం పట్టిన వీరి మరో రచన "వీళ్ళు ఏమంటారు?" వారి రచనా ప్రస్థానంలో ఆయనకు మంచి సంతృప్తిని అందించాయి.

ఇలా ఎన్నో ప్రామాణికమైన రచనలు అందించటంతో పాటు తెలుగు కథ ఆవిర్భావకుడు గురజాడ, భాషా వైతాళికుడు గిడుగు, చిన్న కథల కర్త శ్రీపాద, వంటి మహనీయుల నివాస స్థలపునః నిర్మాణం, సాహిత్యం పునఃముద్రణ, విగ్రహం ఏర్పాటు, వంటి బృహత్తర కార్యాలు చేసి సఫలీకృతుడైన తెలుగు కథానిక చిరంజీవి డా. వేదగిరి రాంబాబు 14 అక్టోబర్ 1952న గుంటూరుదగ్గర చుండూరులో జన్మించి 18 ఆగస్టు 2018న హైదరాబాదులో ఆఖరి శ్వాస విడిచారు. ఆయన తెలుగు కథా సాహిత్యంలో ఒక విశిష్టమైన వ్యక్తిగా, వారి అక్షర కృషి సాహితీ సేవల ద్వారా కలకాలం నిలిచి ఉంటారు.

(అక్టోబరు14, వేదగిరి జయంతి సందర్భంగా..)

యాత్రా సాహిత్య చరిత్రలో ఒక విలక్షణ గ్రంథం

గ్రంథ సమీక్ష

సన్నిధానం నరసింహాశర్మ
సెల్: 9292055531

అభ్యుదయ భావాల నిబద్ధత గల రాజమండ్రి నుంచి ఎన్నో ఏళ్ల నుంచి వెలువడుతూన్న జాతీయ వారపత్రిక ప్రజాపత్రిక సంపాదకుడు సుదర్శన్ ఈ గ్రంథ రచయిత. సుదర్శన్ తన కుమార్తెలైన శ్రావణి, ప్రియాంకలతో చేసిన పర్యటన ఫలాల ఏకరూపం ఈ గ్రంథం.

తెలుగులో ఏనుగుల వీరాస్వామి కాశీయాత్రా చరిత్ర, నీలగిరియాత్ర వంటి వచన యాత్రా చరిత్ర గ్రంథాలు. హిమాలయాల దర్శనం చేసి వాటిని చూపే ప్రయత్నంగా హిమగిరి శతకం వంటివి కొన్ని వచ్చాయి. హైదరాబాదుకి చెందిన డా॥నర్మదారెడ్డి తన భర్త ఇంద్రారెడ్డితో ఎన్నో యాత్రల్ని చేశారు. వారు 180 దేశాల్లో పర్యటించారు. 'ఆగదు మా ప్రయాణం', కొలంబస్ అడుగుజాడల్లో యుద్ధ క్షేత్రాలలో మా యాత్ర, నదీ తీరాల్లో మా నడక, అందమైన దీవులలో మా యాత్ర, దట్టమైన అడవుల్లో మా యాత్ర- ఇటువంటి మొత్తం 7 యాత్రా పుస్తకాలను పొందేలా నర్మదారెడ్డి రాశారు.

మాచారపు ఆదినారాయణ రాసిన భ్రమణకాంక్ష వంటి గ్రంథాలు ఆయన నడకలు 7 ఖండాల్లో అనుభవాలు గ్రంథాలుగా వచ్చాయి. ఇలా కొన్ని గ్రంథాలు వచ్చాయి.

ప్రస్తుత సమీక్ష వియత్నాం పర్యటన గురించి. రచయిత పత్రికా రచయిత సంపాదకుడు కావడంతో అనుభవ రచనా పరిపాకం గ్రంథంలో సాక్షాత్కరిస్తుంది. వియత్నాం గతంలో సామ్రాజ్యవాద దేశం అమెరికా దుర్మార్గ రాజకీయాల్లో నానా విధ్వంసాలకు గురి అయింది. ఆ జాడలు ఇంకా ఉన్నాయి. ఆనాటి యుద్ధ ధ్వంస అవశేషాలు విశేషాలుగా ఉన్నాయి.

మనకు పైసా ఖర్చులేకుండా, పాస్‌పోర్టు అవసరాలు లేకుండా పఠనవిమానం ద్వారా వియత్నాం ప్రధాన ప్రత్యేక స్థలాలు, ప్రదేశాల దర్శనంకి ఈ గ్రంథం మార్గంగా భాసిస్తుంది. సుదర్శన్ ఈ గ్రంథాన్ని తమ ప్రియ సహచరి కీ.శే.దేవికి అంకితమిచ్చారు తమ కూతుళ్లతో కలిసి.

రాజమండ్రి నుంచి చెన్నయ్, చెన్నయ్ నుంచి థాయ్‌లాండ్ అక్కడ నుంచి వియత్నాం రాజధాని హనోయ్‌కి వెళ్లిన సుదర్శన బృందం తాము దర్శించిన వానివల్ల విశేషానుభూతులు పొందారు. మనచేత ఆ అనుభూతులు పొందించేలా పొందికగా, ఉద్వేగ, ఉత్సాహభరతంగా రచన చేశారు. కుటుంబ పర్యటన గ్రంథం వలన సామాజికమైంది.

యుద్ధ భూమిలో విరిసిన మనస్సంగీతం- వియత్నాం శీర్షికతో సామాజిక కార్యకర్త శ్రీ గౌరవ్ రాసిన పీఠిక ఈ పుస్తకానికి ఒక అదనపు అలంకారం. అందులో "ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన వియత్నాం అగరువత్తుల సువాసనల ఘాటు ఈ పుస్తకంలోని అక్షరాల నిండా అలముకున్న భావన పాఠకులకు కలుగుతుంది" అన్నది యదార్థం.

వియత్నాం సాహిత్య సాంస్కృతిక వారసత్వానికి ఆ దేశం ఇచ్చే గౌరవం ఉట్టిపడే "టెంపుల్ ఆఫ్ లిటరేచర్" గురించి తెలుసుకునే అంశాలు నివ్వెరపరుస్తాయి. వియత్నాం

వీధుల్లోనే తినడం, తాగడం, అక్కడే ఆగి ఫుట్‌బాల్ మేచ్‌లు చూసే యువజన బృందాలు ఉంటాయి. ప్రతి పనిలో కళాత్మకత, నైపుణ్య గణ్యత వియత్నాం ప్రజల్లో ఎక్కువ. ఆది మానవుల గుహలు మనల్ని ఎక్కడికో తీసుకెళ్లిపోతాయి. అమెరికా, ఫ్రాన్సుల ఒకనాటి అమానుషకృత్యాలు సజీవచిహ్నాలై వివిధ ప్రదర్శనశాలల్లో అబ్బురపరుస్తాయి.

వియత్నాం అధ్యక్షుడు, కవి అయిన హోచ్‌మిన్‌కు ఆ దేశ ప్రజలు ఇచ్చే గౌరవం ఒక గొప్ప వీరారాధనగా ఉంటుంది. కమ్యూనిజం మూల నాయకులతో సమానంగా హోచ్‌మిన్‌ను గౌరవిస్తారు.

54 ఆదివాసీల తెగల గురించీ, గెరిల్లా పోరాటాల గురించిన వైనాలు విశేషంగా తెలుస్తాయి ఈ గ్రంథ పఠనం వల్ల. రెహన్ స్థాపించిన నవ్వుల మ్యూజియం ఒక ప్రధాన ఆకర్షణ. అమెరికా అహంకార దమన కాండల్ని సుదర్శనం వామపక్ష దృష్టితో తమ రచనా సృష్టిలో ప్రదర్శించారు.

ఆ దేశ చరిత్ర, సంస్కృతి ప్రజా సంప్రదాయాలు ప్రజల ఉనికి, మనకి ఎన్నో తెలుపుతూ కొన్ని మౌఢ్యాలనూ వివరించారు.

1958 లో ఇండియాకి హోచిమిన్ రావడం, నాటి ప్రధాని నెహ్రూ స్వాగతించడం వంటి ఆధునిక చారిత్రక సంఘటనలనూ రచయిత తెలిపారు. చిన్నవైనా ఉన్నతంగా చెప్పుకోవలసిన సంఘటనలు ఈ పుస్తకంలో ఆసక్తిదాయకంగా పువ్వుల పొట్లం విప్పినట్లుంటాయి.

ప్రపంచ చలనచిత్ర దర్శకుల్లో ప్రముఖుడు సత్యజిత్‌రాయ్ ఆ నాళ్లల్లో తన ఒక సినిమాలో ఒక పాత్ర ద్వారా వియత్నాం యుద్ధానికి మద్దతు ప్రకటించడం వంటి గమనార్హ చారిత్రక సంఘటనల్ని రచయిత అభివర్ణించారు.

తాను చూసిన వాటిని ఎన్నిటినో ప్రజాపరం చేయాలనే తపనతో ఎన్నో ఛాయాచిత్రాలను ప్రకటించారు. ఈ తపనకు పుస్తకం అట్ట మీదే 7 ఛాయాచిత్రాలు, వెనుక అట్టపై 13 ఛాయాచిత్రాలు వేయడం సాక్షీభూతాలౌతున్నాయి.

ఒక గ్రంథం గ్రంథాశయానుగుణంగా రావడానికి రచయిత జీవన నేపథ్యం కూడా ఒక గుణమౌతుంది. నమ్మిన వాటిని వమ్ము చేసుకోకుండా సత్య దృష్టితో తన పత్రికలో రాతలు రాసి కొన్ని కేసులను నిర్భయంగా ఎదుర్కొని నెగ్గి వచ్చిన ఒక సామాజిక కోణం ఉన్న సుదర్శన్ ఈ గ్రంథ రచయిత కావడంతో సామాజిక రాజకీయ ఆర్థిక నేపథ్య ఆలోచనల సమాహార దృష్టితో ఈ పుస్తకం వచ్చిందని చెప్పవచ్చు. అందుచేతనే మన ఘనయాత్రా గ్రంథాల్లో దీనిని ఒక విలక్షణ గ్రంథంగా పేర్కొనడం.

వియత్నాంలో సాధారణంగా టీ దొరకదట! కాఫీయే దొరుకుతుంది. కాఫీలో పాలుండక పోవడం విశేషం. కోడిగుడ్ల పచ్చి సొననే కాఫీలో వేస్తారు. కూలింగ్ వాటర్‌లో కాఫీపొడి వేసి తయారుచేస్తారు. అక్కడి ప్రజలు చట్టాలను పక్కాగా పాటిస్తారు. ట్రాఫిక్ లేకపోయినా రోడ్లపై ఎర్ర దీపాలు వెలిగితే నిరీక్షించి మరీ వెడతారు బాటసారులు. వియత్నాంలో ఇండియన్ రెస్టారెంట్లు మన అవసరాలను తీర్చేవిగా ఉన్నాయి. యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ రచనలు చేశాడన్న ఏకైక కారణంతో హోచిమిన్ సిటీకి చెందిన పండితకవి, పత్రికా రచయిత (హాంగ్ లేఖ) 'లేఖ్' అనే ఆయనను నిర్దాక్షిణ్యంగా 1960లో బహిరంగంగా ఉరి తీశారు.

వియత్నాం యుద్ధంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదయినా చరిత్రకారులు తక్కువ చేసి చూపించారనేది, ఈ రచయిత చేసే సత్యారోపణ. బలి దానాల్లో, గొరిల్లా పోరాటాల్లో ఉరి కంబాలెక్కడంలో మహిళల లెక్కలు (గణాంకాలు) తక్కువవి కావని నాట బలుకుతారు.

వియత్నాంలో పర్యటించడంలో బాణాహిల్స్ చూడడం ఓ గొప్ప ముచ్చట! నవ్వుల మ్యూజియం పై అభివర్ణన అభినందనీయం.

పుస్తకం 105 వ పుటలో 10 రకాల నవ్వుల ఛాయాచిత్రాలు బలేగా ఉన్నాయి. "నవ్వవు జంతువుల్ నరుడు నవ్వును. నవ్వులు చిత్త వృత్తికిన్ దివ్వెలు" అన్నాడు జాషువా మహాకవి.

109 నుంచి 112 వరకు గల పుటల్లో విభిన్న గిరిజన జాతీయుల ఛాయాచిత్రాలు ముఖ్యంగా మహిళలవి ఉండడం గమనార్హం. వియత్నాంలో 'టుడోక్' అనే చక్రవర్తి ఉండేవాడట. ఆయనకు 103 మంది భార్యలు, 300 మంది ఉంపుడుకత్తెలు ఉండేవారట. కానీ ఆయన పిల్లలు లేని చక్రవర్తిగానే ఉండిపోయాడట. ఇలా ఒకటి కాదు రెండు కాదు సవాలక్ష విశేష పఠన దర్శనాలకు ఈ పుస్తకం చదవాలి.

ప్రజాపత్రిక కుటుంబం వియత్నాం పర్యటన,
రచయిత: శ్రీ సుదర్శన్,
168 పుటలు, వెల: రూ 150/-
ప్రతులకు: ప్రజాపత్రిక, జాతీయ తెలుగు వారపత్రిక,
21-11-14/3 కోర్లమ్మపేట, రాజమండ్రి.
సెల్: 9848096374, 9441112624.

వ్యవధి

ఏమి బతుకిది, ఏమి బతుకిది,
బాధల, బాధ్యతల, బాదరబందీల బతుకిది,
నిలబడిచూసి నివ్వెరబోయే వ్యవధి లేనిది.
చెట్లకింద గొర్రెల, గోవుల
విశ్రాంత హేల వినే వ్యవధి లేనిది!
గడ్డిలో గింజలను భద్ర పరచే
కాననంలో కానవచ్చే ఉడుతను
చూసే కాలవ్యవధి లేనిది!
నిశీధి వినువీధిలో తళతళలాడే తారల్లా
పగటి నీటి మెరుపుల వెలుగు ప్రవాహాన్ని
పరికించే వ్యవధి లేనిది!
సుందర నర్తకి సునయన భావాలు
వెదజల్లే పెదవుల ద్విగుణీకృత భాషను
కనలేని కనులు!
బాధల, బాధ్యతల, బాదరబందీల బతుకిది!
వ్యవధి లేదు నిలబడి చూసి నివ్వెర బోనికి!!

(W.H. Davies ఆంగ్ల కవిత 'Leisure' కు అనుసృజన)

వేదం సూర్యప్రకాశం, సెల్: 9866142006

వేసిన రెండాకులు...

ఆ విత్తు నేలను చీల్చి రెండాకులేసింది
నింగిని చూసి నమస్కరిస్తూ
ఆకు ఆకు తన తనువుకు తొడుగుతూ
రెమ్మలై కొమ్మలై చేతులు చాస్తూ
నింగి వైపు పాకింది...

నేల కింద వేర్లను పునాదిలా బిగించి
ఆకాశం వైపునకు అలా అలా ఎదిగింది
రెండు ఆకులతో ప్రయాణం మొదలెట్టి
కోటానుకోట్ల
ఆకుల ఆభరణాలు ధరించింది

ఎదగడానికి ఎన్ని అడ్డంకులో దాటుతూ
గింజగా ఉన్నప్పుడు పురుగు చూసింది
మొక్కగా ఉంటే పశువు ఆశ పెంచుకుంది
చివరికి తానేఅందరికీ ఆసరా అయింది...

మహా వృక్షంగా పరిణతి చెందుతూ
ప్రకృతికి తానే ఒక శక్తిగా నిలిచింది
తానే తల్లిలా ఎందరికో దర్శనమిచ్చి
ఎన్నో జీవులకు
కూడు గూడులా ఆశ్రయమిచ్చే...

నింగికి కబురు పంపే వాయువై
సకల జీవులకు ప్రాణ వాయువై వ్యాపించే
మేఘాన్ని చిలికి అమృతాన్ని కురిపించే
సమస్త జీవులకు ప్రాణదాతగా పుట్టింది...

ముత్యాల్లాంటి పువ్వులను ధరించి
రత్నాల్లాంటి కాయలను పండించి
తాను జీవిస్తూ ఎందరికో జీవితాన్నిస్తూ
చివరికి తనువును కూడా ధారపోసింది...

అందుకే మనిషిని చెట్టుతో పోలుస్తూ
వాడు చెట్టంత మనిషి అని సంబోధిస్తూ
చెట్టుకున్న గౌరవాన్ని తెలియజేస్తారు
అందుకే చెట్టును పూజించి గౌరవించి పెంచండి.

కొప్పుల ప్రసాద్, 9885066235

మద్యంపై నిషేధం ఎత్తివేస్తాం జనసురాజ్

పట్నా: జన్‌సురాజ్ పార్టీ అధికారంలోకి వస్తే బీహార్‌లో మద్యం అమ్మకాలపై నిషేధాన్ని రద్దు చేస్తుందని ఆ పార్టీ ప్రతినిధి ఉదయ్ సింగ్ స్పష్టం చేశారు. నితీశ్ కుమార్ ప్రభుత్వం మద్యం అమ్మకాలు, వినియోగంపై విధించిన నిషేధాన్ని రద్దు చేస్తామని తెలిపారు. తద్వారా దాదాపు 28,000 కోట్ల ఆదాయం రావడంతోపాటు ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుండి రూ.5 నుండి రూ.6 లక్షల కోట్ల వరకు రుణాలు సేకరించడానికి అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

15న బీజేపీ కార్యకర్తలతో ప్రధాని భేటీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల15న బీహార్‌లోని బీజేపీ ముఖ్య కార్యకర్తలతో సంభాషించడం ద్వారా ఎన్నికల ప్రచారం ప్రచారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ప్రధాని ఆదివారం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ... 'మేరా బూత్, సబ్సే మజ్బూత్' (నా బూత్, బలమైనది) కార్యక్రమంలో భాగంగా బీజేపీ కార్యకర్తలతో నేరుగా సంభాషిస్తానని చెప్పారు. "బీహార్ లో ఎన్డీఏ విజయాన్ని నిర్ధారించడానికి మా కార్యకర్తలు పూర్తి శక్తితో పనిచేస్తున్నారు. అలాంటి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలతో సంభాషించడం ఎల్లప్పుడూ కొత్త స్ఫూర్తిని అందిస్తుంది. అక్టోబర్ 15న, అలాంటి కష్టపడి పనిచేసే కార్యకర్తలతో నేరుగా సంభాషించే అవకాశం నాకు లభిస్తుంది" అని ప్రధాని మోదీ అన్నారు.

పూర్వాంచల్‌లో ఆధిపత్యం ఎవరిది?

- లాలూ కంచుకోటలో హోరాహోరీ
- అధిక స్థానాలు తమవేనంటున్న ఆర్జేడీ

పట్నా: బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు చెందిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) పార్టీ బీహార్‌లోని పూర్వాంచల్ ప్రాంతంలో బలంగా ఉంది. ఆర్‌జేడీ వల్లే 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా సంఘటనకు పూర్వాంచల్ ప్రాంతంలో అత్యధికంగా 10 సీట్లు వచ్చాయి. ఈ ప్రాంతంలోని సారన్ జిల్లా ఆర్‌జేడీకి కంచుకోట లాంటిది. ఈ జిల్లాలోని మాంఝీ, ఛాప్రా, ఎక్మా అసెంబ్లీ స్థానాలు ఉత్తర్‌ప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్నాయి. ఎక్మా స్థానంలో ఆర్‌జేడీకి చెందిన శ్రీకాంత్ యాదవ్, జేడీయూకు చెందిన సీతా దేవిని 13,927 ఓట్ల తేడాతో ఓడించారు. శ్రీకాంత్ యాదవ్‌కు 53,875 ఓట్లు రాగా, సీతా దేవికి 39,948 ఓట్లు మాత్రమే వచ్చాయి. మాంఝీ అసెంబ్లీ స్థానంలో ఆర్‌జేడీ మద్దతుతో పోటీ చేసిన సీపీఐ అభ్యర్థి సత్యేంద్ర యాదవ్ 25,154 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అయితే లాలూ చరిష్మాకు కేంద్రబిందువుగా పేరొందిన ఛాప్రా అసెంబ్లీ స్థానంలో గత ఎన్నికల్లో ఆర్‌జేడీకి ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీ అభ్యర్థి సీఎన్ గుప్తా కేవలం 6,771 ఓట్ల తేడాతో ఆర్‌జేడీ అభ్యర్థి రణధీర్ కుమార్‌ను ఓడించారు. ఈసారి లాలూ కంచుకోటపై ప్రధాని మోదీ, సీఎం నీతీశ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. అక్కడ వీలైనన్ని ఎక్కువ సీట్లను ఎన్‌డీఏకు వచ్చేలా చేయాలనే సంకల్పంతో వారు వ్యూహరచన చేస్తున్నారు. ఇలాంటి కీలకమైన చోట్ల బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు ఎన్‌డీఏ కూటమి ముమ్మర కసరత్తు చేస్తోంది.

బీహార్‌లోని పూర్వాంచల్ ప్రాంతపు 7 జిల్లాల్లో ఉన్న 19 అసెంబ్లీ స్థానాలు ఉత్తర్‌ప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్నాయి. అందుకే యూపీ రాజకీయ, సామాజిక సమీకరణాలు, అక్కడి దిగ్గజ నేతల ప్రభావం ఈ సీట్ల ఫలితాలపై పడొచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో పూర్వాంచల్ ప్రాంతంలో ఇండియా ఐక్యసంఘటన (మహాగట్బంధన్) హవా వీచింది. అది అత్యధికంగా 10 సీట్లను కైవసం చేసుకుంది. ఎన్‌డీఏ కూటమికి 8 సీట్లు, బీఎస్పీకి 1 సీటు వచ్చాయి. బీహార్‌లోని పశ్చిమ ప్రాంతాన్ని 'పూర్వాంచల్' అంటారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు ప్రాంతాన్ని కూడా 'పూర్వాంచల్' అనే పిలుస్తారు. బీహార్‌లోని పశ్చిమ ప్రాంతం, ఉత్తర్‌ప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతం భౌగోళికంగా పక్కపక్కనే ఉంటాయి. ఈ రెండుప్రాంతాల్లోనూ సారవంత నేలలు ఉన్నాయి. ప్రజలు భోజ్‌పురి భాషను ఎక్కువగా మాట్లాడుతారు. సాంస్కృతిక, సంప్రదాయపర అంశాల్లోనూ సారూప్యత ఉంటుంది. బీహార్ పూర్వాంచల్ ప్రాంతంలో మొత్తం 7 జిల్లాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 19 అసెంబ్లీ స్థానాలు ఉత్తర్‌ప్రదేశ్ సరిహద్దుల్లో ఉండటం గమనార్హం. ఈసారి బీహార్‌లోని పూర్వాంచల్‌లో ఎన్‌డీఏ, ఇండియా ఐక్యసంఘటన మధ్య గట్టి పోటీ జరగొచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ అలాగే జరిగిందని రాజకీయ విశ్లేషకులు డా. సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. అప్పట్లో ఇండియా ఐక్యసంఘటనకు 10 సీట్లు, ఎన్‌డీఏకు 8 సీట్లు వచ్చాయని 'యూపీ ఫ్యాక్టర్'ను వాడుకొని పూర్వాంచల్‌పై పూర్తి పట్టు సాధించాలనే లక్ష్యంతో బీజేపీ ఉందన్నారు. ఈ క్రమంలోనే ఉత్తర్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యకు బీహార్‌లోని పూర్వాంచల్ ప్రాంత బాధ్యతను బీజేపీ అప్పగించిందన్నారు.

బీఎస్పీ ప్రభావం

మాయావతి సారథ్యంలోని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రధానంగా ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో క్రియాశీలకంగా ఉంది.

దీంతోపాటు బీహార్‌లోని పూర్వాంచల్ ప్రాంతంలో కొన్ని అసెంబ్లీ స్థానాలపైనా ఆ పార్టీకి ఫలితాలను శాసించే స్థాయిలో ఓట్లున్నాయి. ప్రత్యేకించి దళిత, బహుజనుల్లో ఈ పార్టీకి మంచి ఆదరణ ఉంది. గత ఎన్నికల్లో చైన్పూర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీకి చెందిన బ్రిజ్‌కిషోర్ బినాను బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)కి చెందిన జామా ఖాన్ 24,294 ఓట్ల తేడాతో ఓడించారు. ఎన్నికల తర్వాత జామా ఖాన్ జేడీయూలో చేరారు. ఈయనకు సీఎం నీతీశ్ కుమార్ మంత్రి పదవిని కేటాయించారు.

పైచేయి సాధిస్తాం: బీజేపీ

'ఈసారి బీహార్‌లోని పూర్వాంచల్‌లో మేం మెరుగ్గా ప్రదర్శన ఇస్తాం. మునుపటి కంటే ఎక్కువ అసెంబ్లీ సీట్లనే సాధిస్తామని బీజేపీ బీహార్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ పాఠక్ తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీహార్ సీఎం నీతీశ్ కుమార్ పూర్వాంచల్ ప్రాంతం అభివృద్ధికి ఎంతో చేశారని, అనేక పథకాలను ఈప్రాంతానికి కేటాయించారని చెప్పారు. యూపీ సీఎం యోగి సైతం ఈ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేస్తారని... అది తమకు కలిసొస్తుందని తెలిపారు.

2020 కంటే ఎక్కువ సీట్లు గెలుస్తాం: ఆర్జేడీ

ఈసారి పూర్వాంచల్ అధిక స్థానాల్లో గెలవబోతున్నట్లు ఆర్‌జేడీ అధికార ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ తెలిపారు. తేజస్వియాదవ్ నాయకత్వంలో పని చేస్తున్నామని...గత 17 నెలల్లో పూర్వాంచల్ లో మా ఎమ్మెల్యేలు చేసిన పని తప్పకుండా మంచి ఫలితాలను సాధించి పెడుతుందన్నారు.తమకు అఖండమైన ప్రజా మద్దతు లభిస్తోందని... మరోసారి పూర్వాంచల్‌లో మంచి మంచి ఫలితాను సాధిస్తామన్నారు. మా మిత్రపక్షాలను కలుపుకొని ముందుకు సాగుతాం. 2020 కంటే ఈసారి ఎక్కువ సీట్లను గెలుస్తామని తెలిపారు.

బీజేపీ ఎమ్మెల్యే మిశ్రిలాల్ రాజీనామా

దళితులు, ఓబీసీలకు అన్యాయం జరుగుతోందని విమర్శ

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీకి షాక్ తగిలింది. ఎమ్మెల్యే మిశ్రిలాల్ యాదవ్ బీజేపీకి రాజీనామా చేశారు. అలీనగర్ ఎమ్మెల్యే, ప్రముఖ ఓబీసీ నేతగా పేరొందిన ఆయన పార్టీలో జరుగుతున్న అవమానం కారణంగానే తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'బీజేపీలో ఉండటం మేము అవమానంగా భావిస్తున్నాం. పార్టీలో మమ్మల్ని చిత్రహింసలు పెడుతున్నారు. అవమాన పరుస్తున్నారు, మా ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నారు' అని పట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఆరోపించారు. బీజేపీలో దళితులు, ఓబీసీలకు వారి హక్కులు లభించడం లేదని ఆయన విమర్శించారు.

గత 30 ఏండ్లుగా ఏ ఒక్క ఎన్డీఏ అభ్యర్థి విజయం సాధించని స్థానంలో తాను 2020లో ఎమ్మెల్యేగా నెగ్గానని, అయినప్పటికీ తనను పార్టీ గౌరవించడం లేదన్నారు. కాగా, యాదవ్ ఆ ఎన్నికల్లో వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. మిశ్రిలాల్ సహా మిగిలిన నలుగురు వీఐపీ పార్టీ ఎమ్మెల్యేలు తర్వాత బీజేపీలో చేరారు. యాదవ్ ప్రస్తుతం ఏ పార్టీలో చేరేదీ వెల్లడించ లేదు. ఆయన ఆర్జేడీలో చేరే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. అయితే తాను మళ్లీ అలీనగర్ నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

ఆర్జేడీని వీడిన నవాడా ఎమ్మెల్యే

అసెంబ్లీ ఎన్నికల వేళ ఆర్జేడీ ఎమ్మెల్యే విభా దేవి యాదవ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. విభాదేవి నవాడా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నితీశ్ ప్రభుత్వం బీహార్ ప్రజలకు చాలా మంచి పనులు చేసిందని ప్రశంసించారు. నవాడకు ఎంతో మంచి చేశారని, ఇంకా చేస్తారని ఆశిస్తున్నాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నితీశ్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

నేడు జన్‌శక్తి జనతాదళ్ అభ్యర్థుల ప్రకటన

ఆర్జేడీ నుంచి బహిష్కరించిన తర్వాత జన్‌శక్తి జనతాదళ్ పార్టీ స్థాపించిన తేజ్ ప్రతాప్ యాదవ్... రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు తమ పార్టీ అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటిస్తానని చెప్పారు. ఈ ప్రకటన బీహార్ రాజకీయ రంగంలో కీలక పరిణామంగా మారనుంది. తేజ్ ప్రతాప్ యాదవ్ స్వయంగా మహూవా అసెంబ్లీ నియోజక వర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఎందుకంటే 2015లో ఆయన ఇక్కడి నుంచే పోటీ చేసి గెలుపొందారు.

'ఇండియా'లో సీట్ల సర్దుబాటు మరింత ఆలస్యం?

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇండియా ఐక్యసంఘటనలో భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపిణీ మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఆర్జేడీ అధినేత లాలుప్రసాద్, ఆయన తనయుడు తేజస్వీ యాదవ్ ఆదివారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అయితే సీట్ల పంపిణీపై వారు ఢిల్లీలో ఇండియా సీనియర్ నాయకులతో చర్చలు జరిపే అవకాశం లేదని... భూమికి ఉద్యోగాల కుంభకోణంలో సోమవారం విచారణ ఉన్నందున లాలూ జీ, తేజస్వి జీ ఢిల్లీకి బయలుదేరారని పార్టీ నాయకుడొకరు తెలిపారు.కాగా, విమానాశ్రయంలో, లాలు ప్రసాద్ యాదవ్, ఆయన సతీమణి రబ్డీ దేవి మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి ఇష్టపడలేదు. కానీ తేజస్వీ యాదవ్ మాత్రం 'అంతా బాగానే ఉంది' అని స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో చర్చలు జరిపేందుకే ఆర్జేడీ అగ్రనేతలు ఢిల్లీ వెళ్లారన్న వార్తలొచ్చాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ తన దూకుడుతో ఆర్జేడీని చికాకు పెట్టిందన్న వాదన ఉంది.

కొత్త భాగస్వాములను సర్దుబాటు చేసుకోవాలి: జైరాం రమేశ్

సీట్ల పంపిణీలో జాప్యంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ 'మహాఘట్బంధన్'లో కొంతమంది కొత్త భాగస్వాములను సర్దుబాటు చేసుకోవాల్సి ఉందని... సీట్ల పంపకంలో కూడా వారిని సర్దుబాటు చేయాలన్నారు. రాబోయే రెండు-మూడు రోజుల్లో అన్ని సీట్లను ఖరారు చేసి ప్రకటిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి కాంగ్రెస్ ఎన్ని సీట్లకు పోటీ చేస్తుందని అడగ్గా... "యాభై నుండి వంద మధ్య ఏదైనా" అని బదులిచ్చారు. లాలు, తేజస్వి ఢిల్లీలో ఉంటారు కాబట్టి ఆర్జేడీ-కాంగ్రెస్ అధినాయకత్వాల మధ్య సోమవారం చర్చలు జరిగే అవకాశం ఉందని ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి.

బీజేపీ సీట్లు ఇవ్వకుంటే ఒంటరిపోటీ: ఎస్‌బీఎస్‌పీ

పట్నా: ఎన్డీఏలో భాగమైన సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) జాతీయ ప్రధాన కార్యదర్శి అరవింద్ రాజ్‌భర్ ఆదివారం కీలక ప్రకటన చేశారు. పొత్తుల్లో భాగంగా అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి సీట్లు కేటాయించనట్లయితే పార్టీ ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నుండి ఐదు స్థానాల్లో పోటీ చేయడానికి తమకు ఆఫర్ వచ్చిందని ఆయన పేర్కొన్నారు. "బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మా పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుంది. బీజేపీతో చర్చలు ఫలించకపోతే, మేము ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేస్తాం" అని రాజ్‌భర్ అన్నారు.

ఆపరేషన్ బ్లూస్టార్ పెద్దపొరపాటు: చిదంబరం

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో పంజాబ్‌లోని స్వర్ణదేవాలయంలో 1984లో జరిపిన ఆపరేషన్ బ్లూస్టార్‌పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పి.చిదంబరం సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వర్ణ దేవాలయాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి అప్పట్లో నిర్వహించిన సైనిక చర్యను తప్పుడు మార్గంగా అభివర్ణించారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు ఇందిరా గాంధీ తన ప్రాణాలు కోల్పోయారన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలిలో జరిగిన ఓ సాహిత్య కార్యక్రమంలో చిదంబరం ఈ వ్యాఖ్యలు చేశారు. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో దాగున్న మిలిటెంట్లను పట్టుకునేందుకు భారత సైన్యం చేపట్టిన నాటి ఆపరేషన్ గురించి చిదంబరం మాట్లాడుతూ ఆపరేషన్ బ్లూ స్టార్ నిర్వహించాలనే నిర్ణయం కేవలం ఇందిరా గాంధీ ఒక్కరిదే కాదని, సైన్యం, పోలీసులు, నిఘా, పౌర సేవల సమష్టి నిర్ణయమని అన్నారు.

కానీ దానికి ఇందిరా గాంధీని మాత్రమే నిందించడం సరికాదన్నారు. ప్రస్తుతం పంజాబ్‌లో ఖలిస్థానీ మద్దతుదారుల సంఖ్య చాలా తగ్గిందని పేర్కొన్నారు. వివాదాస్పద నేత భింద్రన్ వాలే అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయాన్ని స్థావరంగా చేసుకుని వేర్పాటువాద చర్యలకు పాల్పడ్డారు. ఈ ప్రార్థనాలయంలో దాక్కున్న తీవ్రవాదులను పట్టుకునేందుకు భారత సైన్యం 1984 జూన్‌లో ఆపరేషన్ బ్లూ స్టార్ చేపట్టింది. మేజర్ జనరల్ బ్రార్ అధ్వర్యంలో కొనసాగిన ఆపరేషన్... భారత సైన్యం చేపట్టిన అతిపెద్ద సైనిక చర్యల్లో ఒకటిగా నిలిచింది. అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఆదేశాల మేరకు చేపట్టిన ఆ సైనిక చర్యలో 83 మంది భారత సైనికులు అమరులయ్యారు. వేర్పాటువాద నేతలూ చనిపోయారు.

అర్ధరాత్రి అమ్మాయిలను బయటకు పంపొద్దు: మమత

కోల్‌కతా: వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. అమ్మాయిల విషయంలో ప్రైవేటు విద్యాసంస్థలు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. అర్ధరాత్రి సమయంలో బాధిత అమ్మాయి బయటకు వెళ్లడంపై ప్రశ్నలు లేవనెత్తిన సీఎం... విద్యార్థినులను రాత్రిపూట బయటకు పంపించే విషయంలో కాలేజీ యాజమాన్యాలు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కోల్‌కతా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడిన మమత... ఈ కేసులో నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. 'బాధితురాలు ప్రైవేటు మెడికల్ కాలేజీలో చదువుతోంది. అర్ధరాత్రి 12.30కి అమ్మాయి బయటకు ఎలా వచ్చింది? నాకు తెలిసినంత వరకు ఈ ఘటన అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఆ సమయంలో ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. తీవ్ర దిగ్భ్రాంతి కలిగించే ఘటన. ఇటువంటి వాటిని మా ప్రభుత్వం సహించదు. ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేశాం. మిగతావారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎవరినీ వదిలిపెట్టం, దోషులను కఠినంగా శిక్షిస్తాం' అని మమత స్పష్టం చేశారు. 'మూడు వారాల క్రితం ఒడిశా బీచ్‌లో ముగ్గురు అమ్మాయిలు అత్యాచారానికి గురయ్యారు. అక్కడి ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంది. ప్రైవేటు మెడికల్ కాలేజీ ఘటనకు ఎవరు బాధ్యులు? ఈ వ్యవహారంపై పోలీసులే మాట్లాడగలరు. బాధితురాలు చదువుతున్న విద్యాసంస్థ ఈ ఘటనకు బాధ్యత వహించాలి. విద్యార్థుల భద్రత విషయంలో ప్రైవేటు మెడికల్ కాలేజీలు బాధ్యతగా వ్యవహరించాలి. ముఖ్యంగా అమ్మాయిలను రాత్రిపూట కాలేజీ బయటకు అనుమతించే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అమ్మాయిలకూ స్వీయ రక్షణ అవసరం' అని మమత సూచించారు.

నా కూతుర్ని ఒడిశాకు పంపండి: బాధితురాలి తండ్రి

తన కుమార్తెపై అఘాయిత్యం జరిగిన నేపథ్యంలో బాధితురాలి తండ్రి సీఎం మమతా బెనర్జీకి భావోద్వేగ లేఖ రాశారు. 'ఆమె నడవలేకపోతోంది, బెడ్‌రెస్ట్‌పై ఉంది. ముఖ్యమంత్రి, డీజీపీ, ఎస్‌పీ లాంటి అందరూ సహాయం చేస్తున్నారు. కానీ భద్రత కోసం మా కుమార్తెని ఒడిశా తీసుకెళ్లడానికి అనుమతించాలి. స్థానికంగా ఆమెకు ప్రమాదం' అని సీఎంను విద్యార్థిని తండ్రి తన లేఖ ద్వారా వేడుకున్నారు. తమ కుమార్తె హాస్టల్, కాలేజీకి దూరంగా ఉండటం, సెక్యూరిటీ లోపాలు కూడా ఘటనకు కారణమని బాధితురాలి తండ్రి ఆరోపించారు. ఇలా ఉండగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝీ ఈ ఘటనను 'అత్యంత దారుణమైనది' గా వర్ణించారు. విద్యార్థినిపై అత్యాచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన... మమతా బెనర్జీతో మాట్లాడారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమ ప్రభుత్వం బాధితురాలికి అండగా ఉంటుందని చెప్పారు. బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని దుర్గాపూర్‌లో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. దీంతో వైద్య కళాశాల దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైద్య కళాశాల ప్రాంతంలో పోలీసులు భారీగా మోహరించారు. ఇంకోవైపు ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం స్పందించింది. రాష్ట్రంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాలని మమత ప్రభుత్వాన్ని కోరింది.

చట్ట ప్రకారం నిందితులపై చర్యలు: గవర్నర్

చండీగఢ్: ఉన్నతాధికారుల కులవేధింపుల కారణంగా సర్వీస్ రివ్వాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఐపీఎస్ అధికారి వై.పూరన్ కుమార్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కర్తారియా తెలిపారు. ఈ సంఘటన తీవ్రమైనది, పోలీసులు ఇప్పటికే ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని, ఐపీఎస్ ఆత్మహత్య సంఘటనపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, ఐపీఎస్ అధికారిని ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 నుంచి 15 ఉన్నతాధికారుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసినట్టు మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ఎస్పీని బదిలీ చేశామని, డీజీపీని అరెస్ట్ చేయాలని డిమాండ్లు పెరిగిపోతున్నాయని, అన్ని కోణాల్లో విచారించి చట్ట ప్రకారం నిందితులపై చర్యలు తీసుకుంటామని గవర్నర్ అన్నారు. కాగా, తన చావుకు డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్తక్ ఎస్పీ నరేంద్ర బిజర్నియా లతో పాటు పలువురు అధికారులు కారణమని అదనపు డీజీపీ సుదీర్ఘమైన సూసైడ్ నోట్ పేర్కొన్నారు. దీనిపై గవర్నర్ స్పందించారు.

చెట్టు నరికివేత...వృద్ధురాలి రోదన

రాయ్‌పూర్: ఇరవై ఏళ్లుగా కన్న బిడ్డలా పెంచిన ఓ చెట్టును రియల్ ఎస్టేట్ వ్యాపారులు నరికేయడంతో ఓ వృద్ధురాలు ఆ చెట్టు వద్దకు వెళ్లి గుండెలవిసేలా రోదించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఖైరాగఢ్ జిల్లాలోని సరగొండి గ్రామానికి చెందిన డియోలా భాయ్ (85) అనే వృద్ధురాలు పర్యావరణ ప్రేమికురాలు. ఆమె గత 20 ఏళ్ల నుంచి ఓ రావి చెట్టును కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. కన్నబిడ్డ కంటే ఎక్కువగా దాన్ని చూసుకుంటుంది. ఈ చెట్టు ఉన్న భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. ఇమ్రాన్ మెమన్తో ... అతడి అనుచరులు కలిసి రావి చెట్టును నరికేశారు. గ్రామస్తులు అడ్డుకున్నప్పటికీ వారిని బెదిరించారు. కబ్జాదారులు వెళ్లిపోయిన తర్వాత డియోలా భాయ్... ఆ రావి చెట్టు వద్దకు వెళ్లి ఏడ్చింది. దీన్ని చూసి గ్రామస్తులు కూడా కంటతడి పెట్టారు. ఈ రావి చెట్టుకు తాము నిత్యం పూజలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సరగొండి గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రావి చెట్టును నరికేసినట్లు ఇమ్రాన్ అంగీకరించాడు. తాను ఈ చెట్టు ముందు ఉన్న భూమిని కొనుగోలు చేశానని, చదును చేసేందుకు చెట్టును నరికేయాల్సి వచ్చిందని తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

చెన్నై : తమిళనాడులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపంలోని బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిపై ఒకేసారి ఐదు వాహనాలు ఢీకొన్నాయి. వేగంగా వెళ్తున్న ఓ కారు... ట్రక్కును ఢీకొట్టింది. దీంతో దాని వెనుకాల ఉన్న మరో మూడు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు.

వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ కేసులో ముగ్గురి అరెస్టు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఒడిశాకు చెందిన ఓ వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇది చాలా సున్నితమైన కేసు అని అధికారులు తెలిపారు. సాక్ష్యాల సమీకరణకు ఘటనా స్థలికి ఫోరెన్సిక్ టీమ్ వెళ్లిందని, అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను కూడా సమీక్షించనున్నామని దుర్గాపూర్ కమిషనరేట్ డీసీ (ఈస్ట్) అభిషేక్ గుప్తా తెలిపారు. కాగా, బాధితురాలు బెడ్‌రెస్ట్ తీసుకుంటూ నడవలేని పరిస్థితిలో ఉందని ఆమె తండ్రి తెలిపారు. ఆమె భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఒడిశాకు తిరిగి వెళ్లేందుకు అనుమతించాలని కోరారు. ముఖ్యమంత్రి, డీజీ, ఎస్పీ, కలెక్టర్ తమకు సాయం చేస్తున్నారని, అయితే ఇక్కడ ఆమె భద్రతకు ప్రమాదం ఉందనే కారణంగా ఆమెను ఒడిశా తీసుకువెళ్లాలని కోరామని చెప్పారు. మరోవైపు పోలీసు విచారణ జరుగుతోంది. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు భరోసా ఇస్తున్నారు. అయితే నిందితుల వివరాలు వెల్లడించలేదు. బాలేశ్వర్ జిల్లాకు చెందిన యువతి(23) దుర్గాపూర్‌లోని శోభాపూర్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి ఆమె తన స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లింది. కొందరు దుండగులు బాధితురాలిని బెదిరించి సమీప అడవిలోకి ఎత్తుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ విషయం బయట ఎవరికైనా చెప్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బాధితురాలిని బెదిరించారు. తీవ్ర రక్తస్రావంతో స్పృహ తప్పిన బాధితురాలిని గమనించిన కొందరు స్థానికులు సమీప ఆసుపత్రిలో చేర్పించగా... ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో బాధితురాలి స్నేహితుడితోపాటు చాలామందిని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆమె వాంగ్మూలాన్ని కూడా నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని పోలీసులు ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని ప్రజలను కోరారు.

ఈడీ సోదాలు... రూ.45 లక్షల నగదు స్వాధీనం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఉద్యోగ నియామకాల్లో జరిగిన కుంభకోణం ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు నిర్వహించింది. రూ.45 లక్షల నగదు, డాక్యుమెంట్లను, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. సౌత్ డమ్‌డమ్ మునిసిపాలిటీలో జరిగిన నియామకాలల్లో అవతవకలకు సంబంధించి ఈ దాడులు నిర్వహించినట్లు ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది. దర్యాప్తులో భాగంగా రాష్ట్ర అగ్నిమాపక శాఖ మంత్రి సుజిత్ బోస్ నివాసం... సంస్థలతో పాటు కోల్‌కతాలోని 13 ప్రదేశాల్లో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. సాల్ట్ లేక్‌లోని మంత్రి నివాసం, ఆఫీసు, నాగర్‌బజార్ ప్రాంతంలోని కౌన్సిలర్ ఇల్లు, సౌత్ డమ్‌డమ్ మునిసిపాలిటీ మాజీ అధికారుల నివాసాలపై ఈడీ బృందాలు దాడులు చేపడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో కేంద్రం తనను లక్ష్యంగా చేసుకుందని సుజిత్ బోస్ మండిపడ్డారు. ఎన్నికలు తలుపుతట్టిన ప్రతీసారి ఈ దాడులను నిర్వహిస్తారని, ఇది కొత్తేమి కాదని అన్నారు. ఎన్నికల ముందు ఒత్తిడి పెంచేందుకు ఇది ఒక వ్యూహమని అన్నారు. 2024 జనవరిలో ఈడీ... సుజిత్ నివాసం, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించడంతో పాటు విచారణ చేపట్టింది.

విశాలాంధ్ర హైదరాబాద్

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లా కాంగ్రెస్ పార్టీ (డిసిసి) కొత్త అధ్యక్షుడి ఎంపిక కోసం అభిప్రాయాలు సేకరించేందుకు మహబూబ్ నగర్ జిల్లాకు వచ్చామని ఆసక్తి గల వారు ఎవరైనా డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోవచ్చు అని ఏఐసిసి పరిశీలకుడు ఎమ్మెల్సీ నారాయణ స్వామి తెలిపారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డితో కలిసి పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మూడురోజుల పాటు అందుబాటులో ఉంటానని నియోజకవర్గాల వారిగా, బ్లాక్ వారిగా నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి ఈ నెల 22 న ఏఐసిసికి నివేదిక అందిస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 20 వ తేదీ వరకు ఇవ్వాలని ఆయన సూచించారు. దరఖాస్తులను ప్రతి జిల్లా నుంచి 6 మంది పేర్లను ఏఐసిసికి పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి అబ్జర్వర్స్ గణేష్, బెట్టు సాయి, ఉజ్మ షకీర్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టీపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, టిపిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, జహీర్ అక్తర్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణ సుధాకర్ రెడ్డి, జీవన్ రెడ్డి, వినోద్ కుమార్, మారేపల్లి సురేందర్ రెడ్డి, ఎన్‌పి వెంకటేష్, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వసంత, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు సిజె బెనహర్, ఎస్సీ సెల్ చైర్మన్ సాయి బాబా, ఐఎన్టీయుసి రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తుకు చుక్కల మందు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : పల్స్ పోలియో సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ పాల్గొని చిన్నారులకు చుక్కల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పల్స్ పోలియో చుక్కలను అర్హులైన ప్రతి చిన్నారులకు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, ఏకలవ్య నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రాధా, కావాలి శ్రీనివాస్, వాసు, నరహరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్ అయ్యంగార్ మా సభ్యత్వం రద్దు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జాతిపిత మహాత్మా గాంధీపై సోషల్ మీడియాలో అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ డా.బల్మూర్ వెంకట్ మా అధ్యక్షుడు మంచు విష్ణును కోరారు. ఈ మేరకు ఆదివారం మా అధ్యకులు మంచు విష్ణు ను కలిసిన ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ ఫిర్యాదు చేశారు. నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ "మా" సభ్యత్వం రద్దు చేయాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. విషయంపై సినీ పరిశ్రమలోని పెద్దలు కూడా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఫిర్యాదుపై సానుకూలంగా మా అధ్యక్షులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. మా కమిటీలో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపిన మా ట్రెజరర్ శివ బాలాజీ వెల్లడించారు. రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని మా చెప్పింది.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోటీకి సిద్ధమైన ఆర్‌జేడీ

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : ఉపఎన్నికల్లో తమ అభ్యర్థిని నిలబెట్టే నిర్ణయం తీసుకున్నట్టు ఆర్జెడి (రాష్ట్రీయ జనతా దళ్) ప్రకటించింది. పార్టీ అధినేత లల్లు ప్రసాద్ యాదవ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లే క్రమంలో, తెలంగాణలో కూడా సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని బలోపేతం చేయాలని రాష్ట్ర ఆర్జెడి యూనిట్ నిర్ణయించినట్లు వెల్లడించారు. తెలంగాణ ఆర్జెడి అధ్యక్షురాలు సోమ శోభ యాదవ్ మాట్లాడుతూ "దళితులు, బలహీన వర్గాలు, వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయడమే మా ప్రధాన లక్ష్యం. ఈ నినాదంతోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మా పార్టీ అభ్యర్థిని బరిలోకి దింపుతున్నాం" అని తెలిపారు. ప్రస్తుతం బీహార్‌లో జరుగుతున్న హోరాహోరీ ఎన్నికల్లో ఆర్జెడి - కాంగ్రెస్ కూటమి, నితీశ్ కుమార్ -బీజేపీ కూటములతో గట్టి పోటీ పడుతున్న నేపథ్యంలో, ఆర్జెడి బీహార్ రాష్ట్రంలో అధిక స్థానాలు సాధించేందుకు శ్రమిస్తున్నది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోనూ పార్టీ తన విస్తరణ ప్రణాళికలో భాగంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పాల్గొనసుందని సోమ శోభా యాదవ్ తెలిపారు. తమ పార్టీ ప్రజాస్వామ్య విలువలను కాపాడే దిశగా కృషి చేస్తోందని, బీజేపీ మోసపూరిత హామీలను ఎండగొట్టడమే తమ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

'ఆరోగ్య తెలంగాణ'ను నిర్మించాలన్నదే ప్రభుత్వ సంకల్పం

మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో "రన్ ఫర్ గ్రేస్, స్క్రీన్ ఫర్ లైఫ్" అనే థీమ్‌తో నిర్వహించిన "గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ ఎనిమిదో ఎడిషన్" ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది మందిని కబళిస్తున్న కాన్సర్ మహమ్మారిపై అవగాహన కల్పించాల్సిన సామాజిక బాధ్యత మనందరిపై ఉందన్నారు. "ఆరోగ్య తెలంగాణ" ను నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఆరోగ్యాన్ని మించిన సంపద ఏదీ లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. సమాజంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు "గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్" చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. చినబాబు సుంకవల్లి తదితరులు పాల్గొన్నారు.

శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం చైతన్యం కావాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి పిలుపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉన్నటువంటి శ్రామిక వర్గాన్ని విస్మరించి వారి శ్రమను దోచి బడా కుబేరులకు అప్పచెప్పేందుకు ప్రయత్నాలు చేస్తా ఉన్నదని అందులో భాగమే చట్టాలలో తీసుకువస్తున్న మార్పులు అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి తెలియజేశారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ తరఫున సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైనటువంటి పల్లా వెంకటరెడ్డి కి సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం కార్మికులు తమ హక్కుల సాధనకై ఉద్యమిస్తూనే ఉన్నప్పటికీ అధికారంలో ఉన్నటువంటి పార్టీలు వారి రోదనలను వినటం లేదని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికవర్గాన్ని చైతన్యపరిచి పోరాట కార్యక్రమాల్లో రూపొందించడం ద్వారానే కేంద్ర ప్రభుత్వం చేస్తున్న శ్రమ ద్రోపిడిని అరికట్టడానికి వీలవుతుందని వారు వివరించారు. అనేక పరిశ్రమలలో కనీస వేతనాలు అమలు కావడం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పజెప్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని హైరెండ్ ఫైర్ సిస్టం తీసుకువచ్చి కార్మికులకు హక్కులు లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నదని అలాంటి కుట్రను ఏఐటియుసి నాయకత్వంలో సాగనివ్వకుండా కార్మిక వర్గం చైతన్యం కావాలని వారు. దేశంలో మతం పేరుతో రాజకీయం చేస్తున్నటువంటి బిజెపి పార్టీ మెజార్టీ సంఖ్యలో శ్రమదోపిడికి గురి అవుతున్నటువంటి కార్మికులందరూ హిందువులే అనే విషయాన్ని ఎందుకు భైర్గతం చేయటం లేదని వారు డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమను దోచుకునేందుకు అధికార పార్టీ పెట్టుబడిదారులు ఐక్యంగా ముందుకు నడుస్తున్నారని పేద కార్మిక వర్గాన్ని మతం పేరు చెప్పి శ్రమదోపిడికి గురిచేయుచున్నారని వారు పేర్కొన్నారు. ఏఐటియుసి చేసే అన్ని పోరాటాలలో కార్మిక వర్గ పార్టీ అయినటువంటి సిపిఐ పార్టీ తరఫున పూర్తి సంఘీభావం తెలియజేస్తామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్ ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ ఉపాధ్యక్షులు ఏసురత్నం కార్యదర్శులు బి వెంకటేశం ఎస్ విలాస్ సింగ్ నరసింహారావు పల్లా దేవేందర్ రెడ్డి ఓరుగంటి యాదయ్య వై భూమయ్య మేకల శ్రీనివాస్ ఎండి ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో మాగంటి సునీత గోపినాథ్‌ని గెలిపిద్దాం

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలలో భాగంగా, భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ గెలుపు కోసం శ్రీనగర్ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బూత్ ఇంచార్జీలతో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శ్రీనగర్ కాలనీ 8 బూత్‌ల ఇంచార్జీ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని, బూత్ నంబర్లు 303 నుండి 310 వరకు ఉన్న బూత్ ఇంచార్జీలతో ప్రత్యేకంగా సమావేశమై, పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రణాళికలను వివరించారు. పార్టీ శ్రేణులు ప్రతి ఓటరును కలిసి బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చేలా కృషి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి నియోజకవర్గం కార్పొరేటర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, శ్రీనగర్ కాలనీ బూత్ ఇంచార్జీలు పాల్గొన్నారు. అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని నేతలు, కార్యకర్తలు సంకల్పం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత, రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ మురుగేష్, నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, జె.ఎ.సి వెంకన్న, తోట నరేందర్ రెడ్డి మేకల రాము యాదవ్, అనిల్ కిషోర్ గౌడ్, అమీనుద్దీన్, డోలి రమేష్, చిన్న యాదవ్, మధుసూదన్ రెడ్డి, శివ గౌడ్, సురేష్, హేమంత్ పటేల్, సంపత్ యాదవ్, ఉస్మాన్, వంశీ ముదిరాజ్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బైర్ అనిల్, నర్సింగ్ రావు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం :ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నడకతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఆర్థరైటిస్ డే సందర్భంగా ఎస్వీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వాకథాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జెండా ఊపి వాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత దైనందిన జీవితంలో ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపిస్తూ అనేకమంది అనారోగ్యానికి లోనవుతున్నారని, ఆరోగ్యంగా ఉంటేనే మనిషి జీవితం సజావుగా సాగుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకుని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ప్రజల్లో ఆరోగ్యం పైన అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం ఎస్వీఎస్ ఆసుపత్రి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో వాకథాన్ నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. ప్రతి ఒక్కరికి నడక ఎంతో ముఖ్యమన్నారు. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలంటే ప్రతిరోజు వాకింగ్, వ్యాయామం అవసరమన్నారు. ఆర్థోపెడిక్‌కు సంబంధించి ఎస్వీఎస్ ఆసుపత్రిలో సురక్షితమైన అధునాతన ఎక్విప్మెంట్స్‌తో అన్ని రకాల శాస్త్రం చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనే బెస్ట్ ఆసుపత్రిగా ఎస్వీఎస్ ఆసుపత్రి అని ఆయన చెప్పారు. అనంతరం పద్మావతి కాలనీ కృష్ణ టెంపుల్ కమాన్ నుంచి ఏనుగొండ వరకు వాకథాన్‌లో ఆయన విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెజె రెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, రాంరెడ్డి, కర్నాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి స్టేషన్ అభివృద్ధి పనులు పరిశీలించిన రైల్వే అధికారులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా మల్కాజిగిరి స్టేషన్ అభివృద్ధి పనులు దాదాపు 80శాతం పూర్తి అయ్యాయి. అభివృద్ధి ఎంత మేర జరిగింది, నాణ్యత, ఇంకా ఏ మాత్రం పనులు జరగాలో పరిశీలించడానికి కొత్తగా నియమితులైన డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ నూర్ ద్దిన్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ డి.ప్రసాద రావు, వి.వివేక్ చౌదరి గతి శక్తి మల్కాజిగిరి వచ్చారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్స్, లిఫ్ట్స్ పనుల ఇంచార్జి ఇండ్ వెల్ కంపెనీ పి.నాగార్జున రెడ్డి, సివిల్ పనులు చూస్తున్న వీరభద్రయ్య, స్టేషన్ ఎలివేషన్ పనులు చూస్తున్న ఎస్.కృష్ణ మూర్తి, జెడ్ఆర్.యుసిసి మెంబర్ నూర్‌తో పాటు, ఇంజినీర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. టార్గెట్ సమయానికి పూర్తి చేయాలనీ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. టెర్మినల్ 2 వైపు రెండు గేట్‌లు స్టీల్ ఆర్చ్‌లు ఏర్పాటు చేశారు. మిగతా అన్ని పనులు ముగిస్తే మల్కాజిగిరి స్టేషన్ మినీ ఎయిర్ పోర్ట్ గా మారనుందని, హైదరాబాద్ డివిజన్ కాచిగూడ తర్వాత మల్కాజిగిరి రెండవ స్టేషన్‌గా ప్రాముఖ్యత కలుగుతుందని నూర్ తెలిపారు.

పోలియో చుక్కలు వేసిన కార్పొరేటర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బిజెఆర్ నగర్ బస్తీ దవాఖానలో పల్స్ పోలియో సందర్భంగా కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్స్ పోలియో చుక్కల మందు పిల్ల భవిష్యత్‌కు చుక్కాని అని ఆయన తెలిపారు. పల్స్ పోలియో చుక్కల మందు 0-5 యేళ్ళ పిల్లలకు తప్పని సరిగా వేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, బిక్షపతి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : సమాచార హక్కు చట్టాన్ని రక్షించుకొని అమలు చేసుకోవాల్సిన బాధ్యత పౌర సమాజానిదేనని సమాచార హక్కు చట్టం కమిషన్ చైర్మన్ పివి శ్రీనివాస్ అన్నారు. సమాచార చట్టం సాధన సమితి ఆధ్వర్యంలో సమాచార చట్టం ఆవిర్భవ దినోత్సవ వేడుకలు రవీంద్ర భారతిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పివి శ్రీనివాస్, సమాచార హక్కు చట్టం కమిషనర్ భూపాల్, మాజీ జడ్జి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నేరెళ్ల మాల్యాద్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పివి శ్రీనివాస్ మాట్లాడుతూ అనేక మంది త్యాగాల ఫలితంగానే సమాచార హక్కు చట్టం ఏర్పడిందని తెలిపారు. సమాచార హక్కు చట్టం అమలులో అధికారులు పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి జిల్లాలకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. భూపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయలేకపోవడం వల్ల దాదాపు 18 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకొని సమాచార చట్టాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. నాలుగు నెలల్లోనే అనేక జిల్లాలలో కమిషన్ పర్యటించి పెండింగ్ కేసులను పరిష్కరించామని వివరించారు. రిటైర్డ్ జడ్జి, సుప్రీంకోర్టు న్యాయవాది నేరెళ్ల మాల్యాద్రి మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో ఉన్న లోపాలే సమాచార హక్కు చట్టంలో ఉన్నాయన్నారు. చట్టంలో మార్పులు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ కొంతమంది ఉద్యోగులకు చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల సరైన సమాచారాన్ని అందించలేకపోవడం వల్ల ప్రజలకు చట్టాలపై నమ్మకం పోతుందన్నారు. చట్టాలలో సంస్కరణలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు కిరణ్ కుమార్, సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షురాలు స్రవంతి, దిలీప్ రావు, గోపినాథ్, చింతల రాఘవేంద్ర, చింతల కృష్ణ పాల్గొన్నారు.

ప్రయోజనం లేని ఫాగింగ్...

- కోట్లలో ప్రజాధనం వృధా...
- ఫాగింగ్‌తో పలు అనారోగ్య సమస్యలు...!

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దోమల నివారణ పేరుతో కోట్లాది రూపాయలను జిహెచ్ఎంసి ఖర్చు చేస్తున్నప్పటికీ ఆ లక్ష్యం నెరవేరుని పరిస్థితి నెలకొం టుంది. ముఖ్యంగా ఫాగింగ్‌తో ప్రయోజనం లేకపోయిన ప్పటికీ ప్రజల్ని మభ్యపెట్టేందుకు మాత్రమే ఫాగింగ్ చేస్తున్నారు. దీనివల్ల దోమల నియంత్రణ సాధ్యం కాదనే విషయం అధికారులకు తెలిసినా కోట్ల రూపాయలను ఫాగింగ్ పాలు చేస్తున్నారనే విమర్శలు చోటు చేసుకుం టున్నాయి. దోమల నియంత్రణ చర్యలు చేపడుతున్నా మని చెప్పుకోవడానికే ఫాగింగ్. అయితే ఈ ఫాగింగ్‌లో అక్రమాలు జరగుతున్నాయని అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా దీనిపై ఎందుకు దృష్టి సారించలేకపోతున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్ ప్రధానమైనది. కానీ దీనిపై దృష్టి సారించకుండా కేవలం ఫాగింగ్ పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏంటోనని పలవురు పెదవి విరుస్తున్నారు. ఫాగింగ్‌లో పని చేసే మొత్తం సిబ్బందిని యాంటీ లార్వా ఆపరేషన్ కేటాయించి దోమలు నివారణకు చర్యలు చేపట్టినట్లయితే దోమల నియంత్రణ సాధ్యమవుతుందనే అభిప్రాయం పలువురిలో వ్యక్తం అవుతుంది. ఫాగింగ్ చేయడం వల్ల పరువురికి అనారోగ్య సమస్యలు సైతం ఉత్పన్నమవుతాయనే విషయాన్ని అధికారులు విస్మరించడం సరికాదని, ముఖ్యంగా ఆస్తమా, గర్భిణీలు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్న రోగులకు ఫాకింగ్ వాసన పడక ఇబ్బందులను గురి కావాల్సిన పరిస్థితి సైతం పొంచి ఉందనే విషయం అధికారులు పరిగణలోకి తీసుకోవాలని, ఫాగింగ్ పూర్తి స్థాయిలో నియంత్రించి యాంటీ లార్వా ఆపరేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఫాగింగ్‌లో డిజిల్, పెట్రోల్ వాడుతుండడంతో ఇక్కడ అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతుంది. దీంతో కిందిస్థాయి సిబ్బందికి అనుకూలంగా లేని, ఏ.ఈలు, సూపర్వైజర్లపై ఫిర్యాదుల పరంపరను కొనసాగిస్తున్నటువంటి పరిస్థితి. కింది స్థాయి సిబ్బంది ఇతర పనులు చేసుకుంటూ ఎంటమాలజీ విభాగంలో పని చేస్తుంటారు. హాజరు వేయడం బయటి పనులకు వెళ్ళడం పరిపాటిగా మారుతోంది. ఇలాంటి వారికి ఏ.ఈ, సూపర్‌వైజర్లు అనుకూలంగా ఉంటే సరి. వారికి అనుకూలంగా లేకపోతే వారిపై ఫిర్యాదులను చేస్తున్నటువంటి పరిస్థితులు లేకపోలేదు. సూపర్‌వైజర్ తమ మాట వినడం లేదని ఏకంగా పూలే భవన్‌లో ఫాగింగ్ సిబ్బంది ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై ఏ విచారణ చేయకుండానే ఏకపక్షంగా ఆ సూర్‌వైజర్‌ను తొలగించడం అధికారుల అనాలోచిత విధానానికి నిదర్శనమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే గత కొద్ది రోజుల నుండి పెట్రోల్ బంక్‌లోనే డీజిల్, పెట్రోల్ నేరుగా మిషన్‌లల్లోనే కొడుతుండడంతో ఫాగింగ్ చేసే సిబ్బంది మిషన్‌లల్లో మిగిలిన డీజిల్ మిలాథీన్ పడవేసి ఫాగించే చేసినట్లు వ్యవహరిస్తున్న పరిస్థితి నెలకొంటుంది. ఈ విధంగా కూడ డిజిల్ దుర్వినియోగాన్ని నివారించలేని పరిస్థితిలో అధికారులుంటున్నారనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఫాగింగ్ సిబ్బంది బైక్‌పై ఫాగింగ్ చేస్తుండడంతో అర్థగంటలో కాలనీలో పూర్తి అవుతోంది. మిగిలిన పెట్రోల్ వారి బైక్‌లల్లో పోసుకోవడం, మిగిలిన కెమికల్ పారపోయడం, డిజిల్‌ను విక్రయించడమో జరుగుతోందనే ఆరోపణలున్నాయి. గ్రేటర్ పరిధిలో డివిజన్‌కు 2 చిన్న మిషన్‌లు ఉండగా జిహెచ్ఎంసి పరిధిలో మొత్తం 300 మిషన్‌లకు రోజుకు 300లీటర్ల పెట్రోల్ నెలకు 7800వేల లీటర్లు పెట్రోల్, డిజిల్ ఒక్కో మిషన్‌కు 7లీటర్లు రోజుకు 2100 లీటర్లు నెలకు 54,600 లీటర్లు డిజిల్ వినియోగిస్తున్నట్లు సమాచారం. అంతేకాక పెద్ద మిషన్లు సర్కిల్‌కు రెండు చొప్పున 60 ఉన్నాయి. వీటికి పెట్రోల్ ఒక్కో మిషన్‌కు 5 లీటర్లు 300లీటర్లు నెలకు 7800వేల లీటర్లు. డిజిల్ 30 లీటర్లు రోజుకు 1800 లీటర్లు, నెలకు 46,800 లీటర్ల డివిజిల్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం. ఏడాదికి మొత్తం పెట్రోల్ 1,87,200 కాగా డిజిల్ 12,16,800 వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. వీటి మొత్తానికి దాదాపు రూ.13 కోట్లు వెచ్చిస్తున్నప్పటికి దోమల వృద్ధి ఆగని పరిస్థితి. దీనిలో సగానికి పైగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే ప్రచారం ఉండనే ఉంది. మిషన్‌ల మరమత్తులు కూడ ఈ అక్రమాల సొమ్ముతోనే చేయిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఇప్పటికైనా ఫాగింగ్ సిబ్బందిని కూడ అంటి లార్వ ఆపరేషన్ (ఏఎల్‌ఓ)కు వినియోగించి పని చేయించినట్టైతే పూర్తి స్తాయిలో దోమల నివారణతో పాటు జిహెచ్ఎసికి కొంత మేర అయినా ఆర్థిక నష్టం వాటిల్లకుండా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా రచ్చ సుభద్రారెడ్డి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : అవినీతి నిర్మూలన, ప్రజా సేవే లక్ష్యంగా సోషలిస్ట్ పార్టీ (ఇండియా) రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లుగా ఆ పార్టీ నేతలు ప్రకటించారు. ఆదివారం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేష్, పాట మహేష్, రాజశ్రీ, ఎండి పాషా, నరసింహ, సిద్ధార్థ, పవన్ లతో కలిసి రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి హైదర్ గూడా ఎన్ఎస్ఎస్ భవనంలో విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ రాష్ట్ర కమిటీ నేతల తీర్మానం మేరకు తాను జూబ్లీహిల్స్ ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లుగా తెలిపారు. తనకు ఈ ఎన్నిక ఆరవధిగా తెలిపారు. తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమకారునిగా, రచయిత్రి, విద్యావంతురాలైన తాను పేద ప్రజల కోసం పోటీ చేస్తున్నట్లుగా చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగం వదులుకొని ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సోషలిస్టు పార్టీ (ఇండియా) తరపున ప్రజల ముందుకు వస్తున్నానని అన్నారు. చట్టసభల్లో మహిళల ప్రాధాన్యం తగ్గుతున్న నేటి తరుణంలో, వారి గొంతుకగా అసెంబ్లీలో తాను నిలబడతానని వెల్లడించారు. తన గెలుపు కోసం పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి పార్టీ జెండాను జూబ్లీహిల్స్ గడ్డపై ఎగరవేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పోలియోచుక్కలు తప్పనిసరి

జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

విశాలాంధ్ర - హైదరాబాద్ : చిన్నారుల బంగారు భవిష్యత్తు కై తల్లిదండ్రులు పల్స్ పోలియో చుక్కలు తప్పక వేయించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. తిలక్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 0-5 పిల్లల బంగారు భవిష్యత్ కై పల్స్ పోలియో చుక్కలను తప్పక వేయించాలని అన్నారు. భారతదేశంలో పోలియో రహిత సమాజాన్ని నిర్మానించడానికి 1995లో ప్రారంభించడం జరిగిందని, ప్రపంచ ఆరోగ్య సంస్థ 2014 లో భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా ప్రకటించడం జరిగిందని, ఈ సందర్భంగా గుర్తు చేసారు. అదేవిధంగా పొరుగు దేశాలలో ఇంకా పోలియో కేసులు నమోదు అవుతున్నందున భారతదేశంలో పోలియో కేసులు నమోదు కాకుండా పోలియో కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించుకొని 2586 పల్స్ పోలియో కేంద్రాల ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని ఆమె తెలిపారు. జిల్లాలో 0-5 పిల్లలు 5,17,238 మంది ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం తేదీ 13 నుండి 15 వరకు కొనసాగుతుందని, 12న పోలియో చుక్కలు వేయించలేనటువంటి పిల్లలకు 11200 మంది వైద్య సిబ్బంది ఇంటింటి కార్యక్రమంలో భాగంగా పోలియో చుక్కలు అందించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో 9,36,016 ఇండ్లల్లో ఉన్న 0-5 సంవత్సరాల గల పిల్లలకు కవర్ చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే 164 హై రిస్క్ ప్రాంతాలలో పోలియో చుక్కల కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. అక్టోబర్ 15 వరకు అన్ని రైల్వేస్టేషన్స్, బస్టాండ్లు అలాగే మెట్రో స్టేషన్లలో పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతుందని ఆమె తెలిపారు. జిల్లాలోని 2586 కేంద్రాలతో పాటు 91 మొబైల్ టీమ్స్ చిన్నారులకు వలస వాసుల ప్రాంతాలు, తాత్కాలిక నివాసాలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు అలాగే పార్కులలో పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అపార్ట్మెంట్‌లలో ఉండే 0-5 వయస్సు గల పిల్లలున్న తల్లిదండ్రులు తేదీ 13 నుండి 15 వరకు తమ పిల్లలకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, వాలంటీర్స్, పారా మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొనడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, డిఎంఓ రాములు, డిప్యూటీ హెచ్ఓ డాక్టర్ పద్మజ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని సోమాజి గూడ డివిజన్ శాలివాహన నగర్ కమ్యూనిటీ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం మన ప్రధాన లక్ష్యం. ప్రజలకు చేరువై, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమే మా ధ్యేయం. అలాగే 50,000 వేల భారీ మెజార్టీతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచి సీఎం, రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇద్దాం అని అన్నారు. రాబోయే ఉపఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా కృషి చేయాలి. ప్రజల ఆశలు, ఆవేదనలను గమనించి ప్రజా సంక్షేమమే మా దిశ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్ సెక్రటరీ విశ్వనాథన్ పెరుమాళ్ళ, కార్పొరేటర్ సంగీత యాదవ్. సోమాజిగూడ డివిజన్ అధ్యక్షులు నరేష్, కిరణ్ యాదవ్, మనోజ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, మజీద్ గోంటీ సాయినాథ్ యాదవ్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోపన్న అడుగుజాడల్లో పయనిస్తాం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : కార్పొరేషన్ మాజీ చైర్మెన్, శ్రీనగర్ కాలనీ డివిజన్ ఇంచార్జిలు వాసుదేవా రెడ్డి వెంకటేశ్వర కాలని డివిజన్ కార్పొరేటర్ మన్నె కవిత రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కమలాపురి కాలనీ ఫేస్-1, 2 ముఖ్య నాయకుల సమావేశానికి జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత వారి కుమారుడు వాత్సల్య గోపీనాథ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యూసఫ్ గూడ డివిజన్ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, జనరల్ సెక్రటరీ నర్సింగ్ దాస్, నాయకులు మన్నె గోవర్ధన్ రెడ్డి, బస్వరాజు పాల్గొన్నారు.

దేశ చరిత్రలో ఆర్టీఐ చట్టం చారిత్రాత్మక నిర్ణయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశ చరిత్రలో ఆర్టీఐ చారిత్రాత్మక నిర్ణయమని టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజలకి వాస్తవాలను తెలుసుకోవడానికి మహత్తర అవకాశం ఆర్టీఐ ద్వారా కల్పించారన్నారు. ఈ చట్టం చట్టం పేద, అణగారిన వర్గాలకు జీవనరేఖగా మారిందని అభిప్రాయపడ్డారు. ఆదివారం గాంధీభవన్‌లో.ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత యూపీఏ హయంలో చారిత్రాత్మక చట్టాలు అమల్లోకి వచ్చాయని గుర్తు చేశారు. డా. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం, సోనియా గాంధీ దూరదృష్టి నాయకత్వంలో, చారిత్రాత్మక సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) 2005 అక్టోబర్ 12న అమలులోకి వచ్చిందని నేటితో చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్ళు పూర్తి చేసుకుందన్నారు. చట్టంతో సరుకుల పంపిణీ, పెన్షన్‌లు, బకాయిలు, స్కాలర్‌షిప్‌లు వంటి హక్కులను సాధించుకునే శక్తిని ప్రజలకు ఇచ్చిందని తెలిపారు. సరుకుల పంపిణీ, పెన్షన్‌లు, బకాయిలు, స్కాలర్‌షిప్‌లు వంటి హక్కులను సాధించుకునే శక్తిని ప్రజలకు ఇచ్చిందని వివరించారు. అలాగే ఉపాధి కోసం అప్పటి యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఉపాధి హామీ పథకం (2005) తీసుకొచ్చిన్నట్లు వెల్లడించారు. ఆర్టీఐ చట్టం ప్రజలకు ప్రభుత్వ విభాగాల సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చి పాలనలో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. అటవీ హక్కుల చట్టం (2006),విద్య హక్కు చట్టం (2009), భూసేకరణ న్యాయమైన పరిహారం చట్టం (2013), ఆహార భద్రత చట్టం (2013) లో చట్టాలు ప్రజలకు సంపూర్ణ హక్కులను యుపిఏ ప్రభుత్వం కల్పించినట్లు చెప్పుకొచ్చారు. కానీ 2014లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్టీఐతూట్లు పొడుస్తోందని, 2019 సవరణలతో సమాచారం కమిషన్ల స్వతంత్రతను బలహీనపరిచాయన్నారు. కమిషనర్ల పదవీకాలం (5 సంవత్సరాలు) సేవా షరతులను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించేలా మార్పులు జరిగాయని చెప్పారు. స్వయం ప్రతిపత్తితో నిర్వహించే ఆర్టీఐ కమిషనర్లు కేంద్రం ఒత్తిడిలకు తల్లోగే పరిస్థితి ఏర్పడిందన్నారు. 2023 - డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం ఆర్టీఐ సెక్షన్ 8(1)(జె)లో సవరణలతో వ్యక్తిగత సమాచారం అనే నిర్వచనం విస్తరించబడిందన్నారు. "ప్రజాప్రయోజనం ఉన్నప్పటికీ" ఇంతకు ముందు వెల్లడించగలిగే సమాచారాన్ని ఇప్పుడు పూర్తిగా మినహాయింపుగా ప్రకటించారని, దీని వల్ల ఓటరు జాబితాలు, ప్రభుత్వ నిధుల వినియోగం, ఖర్చుల వివరాలు లాంటి ప్రజా ప్రయోజన సమాచారం దాచిపెట్టే అవకాశం పెరిగిందన్నారు. కేంద్ర సమాచారం కమిషన్ ప్రస్తుతం 11 పోస్టులకు బదులుగా కేవలం ఇద్దరు కమిషనర్లతోనే పనిచేస్తోందని, 2025 సెప్టెంబర్ తర్వాత చీఫ్ కమిషనర్ పదవి కూడా ఖాళీగా ఉంటుండాంటే ఇంతకంటే దుర్మార్గం లేదని విమర్శించారు. భోపాల్‌కు చెందిన పర్యావరణ కార్యకర్త షెహ్లా మసూద్ అక్రమ మైనింగ్ బహిర్గతం చేస్తూ ఉండగా ఇంటి వద్దే కాల్చి చంపబడ్డారని, ఇలాంటి ఘటనలు ఆర్టీఐ యాక్టివిస్టులలో భయాన్ని పెంచాయన్నారు. విజిల్ బ్లోవర్స్ ప్రొటెక్షన్ చట్టం యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టి పార్లమెంట్ ఆమోదించినప్పటికీ 2014 నుండి ఇప్పటి వరకు అమలు కాలేదని ఆరోపించారు. కేంద్రంలోని ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వ అవినీతిని బహిర్గతం చేసే వ్యక్తులు రక్షణ లేకుండా దాడులు, వేధింపులకు గురవుతున్నారని ధ్వజమెత్తారు. 2019 సవరణలను రద్దు చేసి కమిషన్ల స్వతంత్రతను పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. డీపీడీపీ చట్టంలోని ఆర్టీఐని బలహీనపరిచే సెక్షన్ 44(3) సవరణలను పునఃపరిశీలించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర కమిషన్లలో ఖాళీలను తక్షణమే పారదర్శకంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ల పనితీరుపై నిర్దిష్ట ప్రమాణాలు, ప్రజా నివేదికలు తప్పనిసరి చేయాలన్నారు. ఆర్టీఐ వినియోగదారులు, విజిల్ బ్లోవర్లకు బలమైన రక్షణ కల్పించాలని తెలిపారు. కమిషన్లలో జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు,

పోలియో రహిత సమాజ నిర్మాణానికి చుక్కలు తప్పనిసరి

విశాలాంధ్ర - కొత్తూరు : పోలియో రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పకుండ వేయించాలని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తూరు మున్సిపాలిటిలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయడం ద్వారా పోలియో వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించవచ్చని, అంగవైకల్యాన్ని పూర్తిగా నివారించి చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపెందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని సూచించారు. నేడు, రేపు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి చిన్నారులకు పోలియో చుక్కలు అందిస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, నాయకులు దేవేందర్ యాదవ్, రాఘవేందర్ యాదవ్, వైద్య ఆరోగ్య బృందం తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు

విశాలాంధ్ర - కొత్తూరు: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు చిన్నారులకు తప్పకుండా వేయిం చారని బీసీ సంఘం నందిగామ మండల అధ్యక్షుడు తోట మహేందర్ అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా నందిగామ మండలం, రంగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వైద్య అధికారులు నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండా పోలియో చుక్కలు వేయించి వారి వారి బంగారు భవిష్యత్తుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన నందిగామ మండలాధ్యక్షుడు తోట మహేందర్ తో పాటు అంగన్వాడీ టీచర్స్ సుజాత, ధనలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.నాగేంద్రబాబు అన్నారు. మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పల్స్ చుక్కలు వేయించేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అన్నపూర్ణ, సిహెచ్ఓ వెంకట్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అజారుద్దీన్‌ని కలసిన నవీన్ యాదవ్

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : కాంగ్రెస్ పార్టీ తరుపున టికెట్ లభించిన సందర్భంగా అజరుద్దీన్‌ని ప్రత్యేకంగా కలసి ఆశీర్వాదాలు పొందిన నవీన్ యాదవ్ పార్టీ బలోపేతం కోసం తన పూర్తి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా అజరుద్దీన్ నవీన్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల నమ్మకాన్ని గెలుచుకునేలా కృషి చేయాలని సూచించారు.

తెలంగాణలో వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే

విశాలాంధ్ర - మొయినాబాద్ : కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని వారికి తెలంగాణ ప్రజానీకం తగిన బుద్ధి చెప్పడం ఖాయమని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు కేతిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో కార్యకర్తలు వెంకట్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి వెంకట్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనేక తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను అనేక రకాలుగా మోసాలు చేస్తూ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఈ విషయాలన్నీ గుర్తించి గత కెసిఆర్ పాలన కోసం ఎదురుచూస్తూ మళ్లీ బీఆర్ఎస్ వైపు ఆసక్తి చెంది బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కానీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కానీ టిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారం లోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తప్పుడు హామీలతో కాంగ్రెస్ శ్రేణులు ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని ఈ విషయాన్ని అందరూ గమనించాలని సూచించారు. గత పది సంవత్సరాల నుంచి పేద ప్రజల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్‌రావు అనేక పథకాలు తీసుకొచ్చి పేద ప్రజలకు లబ్ధి చేకూర్చాలని గుర్తు చేశారు. వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు నాయకులు సురేష్, భాస్కర, శ్రీనివాస్, కుమార్, మహేందర్, సుమన్, వినోద్, కిరణ్, మైపాల్, లోకేష్, చరణ్, హరి, వెంకట్, శ్రీకాంత్, బాలాజీ, ఇస్మాయిల్, శివ, భారత్, మహేష్ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

వైష్ణవి డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం ఉదయం మాజీ మేయర్ అమర్ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరై వైష్ణవి దయాగ్నొస్టిక్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైటింటి ఈశ్వర్ రెడ్డి, బండారి రవీందర్ వెంకట్ గౌడ్, దేవేందర్ రెడ్డి, రంగారెడ్డి, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్‌గా ఎంపీ ఆర్ కృష్ణయ్య

విశాలాంధ్ర - బషీర్ బాగ్: తెలంగాణ లోని బీసీ సంఘాలు ఒక్క తాటి మీదకి వచ్చి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే లక్ష్యంగా తెలంగాణ బీసీ జేఏసీ ఆవిర్భావించింది. ఈ ఆదివారం లక్డీకాపూల్ లోని ఓ హోటల్ లో బీసీ సంఘాల సమావేశంలో జరిగింది. బీసీ నేత రాజారాం యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ బీసీ జేఏసీ (బీసీ జాక్) చైర్మన్‌గా ఎంపీ ఆర్ కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా విజిఆర్ నారగొని, వర్కింగ్ ఛైర్మెన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్, కో చైర్మెన్స్‌గా దాసు సురేష్ , రాజారామ్ యాదవ్, కో ఆర్డినేటర్‌గా గుజ్జ కృష్ణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణయ్య మాట్లాడుతూ బీసీల్లోని ప్రతి కుల సంఘాల నుండి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని, వాళ్లకు తగిన బాధ్యతలను అప్పగిస్తామని ఆయన తెలిపారు. ఈ ఉద్యమం ఇంతటితో ఆగదు. బీసీలను చట్ట సభల్లో కూర్చోబెట్టేవరకు తాము పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 18 న తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. బంద్ ఫర్ జస్టిస్ పేరుతో తెలంగాణ బీసీ జేఏసీ తరుపున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాబోయే ఈ వారం రోజుల కార్యాచరణను ఇప్పటికే మొదలు పెట్టామని, తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా అయితే పని చేసామో, అంత కన్నా ఎక్కువగా బీసీ ఉద్యమాన్ని చేస్తామని చెప్పారు. అన్ని పార్టీలను మా ఉద్యమంలో కలుపుకుని పోతామన్నారు. ఒక రాష్ట్రంలో ఉద్యమం జరిగితే ఆ ప్రభావం ఇతర రాష్ట్రాల్లో కూడా పడుతుందని, దేశాన్ని కదిలించే విధంగా ఈ బీసీ ఉద్యమాన్ని నిర్వహిస్తామని ఎంపీ కృష్ణయ్య స్పష్టం చేశారు. జాజుల మాట్లాడుతూ బీసీలు తినే కంచంలో మన్ను పోసే వారికి వ్యతిరేకంగా బీసీ జాక్ ఏర్పడిందన్నారు. 60 శాతం జనాభాకు 5 శాతం ఉన్న రెడ్డిలు సవాలు విసిరారు. దానిని స్వీకరిస్తున్నామన్నారు. ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో బీసీల హక్కులు, రిజర్వేషన్లను కాపాడుకోడానికి ఉద్యమానికి సిద్ధం అవుతున్నామన్నారు. అసలు యుద్ధం ఈరోజు నుండి మొదలైంది. బీసీల జనాభా 60 శాతం ఉంటే 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే రెడ్డి జాగృతి అడ్డుకుందని మండిపడ్డారు. మాధవ రెడ్డి, గోపాల్ రెడ్డి లు ఇద్దరు వ్యక్తులకే రెడ్డి సమాజం అండగా ఉందా అని ఆయన ప్రశ్నించారు. రెడ్డి ఆధిపత్యాన్ని బొంద పెట్టడానికి బీసీ జాక్ ఏర్పడిందని వివరించారు. రెడ్డిలు రాజకీయ శత్రువులు అని, బీసీ బిడ్డను ముఖ్యమంత్రిని చేసుకునేలా జాక్ పని చేస్తుందన్నారు. విద్యా సంస్థలు, ఆర్టీసీ యాజమాన్యం, వ్యాపారులు, ప్రజలు బంద్ కు మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీల ఓట్లు కావాలంటే రాజకీయ పార్టీలు

పల్స్ పోలియో కార్యక్రమన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్

విశాలాంధ్ర - మేడిపల్లి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం వైద్య ఆరోగ్యశాఖ చేపట్టినటువంటి పల్స్ పోలియో కార్యక్రమానికి 2వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కేతావత్ సుభాష్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పంచవటి కాలనీ రోడ్ నెంబర్ 1లో ఆదివారం ఉదయం పల్స్ పోలియో కార్యక్రమన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో పంచవటి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మణిరామ్ నాయక్, ప్రధాన కార్యదర్శి అంజి, కాలనీ వాసులు వైద్య ఆరోగ్యశాఖ నర్స్ రాణి, వార్డ్ ఆఫీసర్ గోవింద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లంపేట్‌లో బరితెగిస్తున్న బడా బిల్డర్లు...

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ అంతస్తులు

లంచాలు తీసుకుంటూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న వైనం...

విశాలాంధ్ర-దుండిగల్ : దున్నపోతుపై వాన పడ్డ ఎటువంటి స్పర్శ లేదన్నట్టుగా తయారైంది దుండిగల్ మున్సిపల్ అధికారుల పరిస్థితి. దుండిగల్‌లో కొందరు బడా బిల్డర్ తమ ఇష్టానుసారంగా మున్సిపల్ అధికారుల అండతో బరితెగించి అదనపు అంతస్థుల అక్రమ నిర్మాణాలను యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఆ భవనాలలో పార్కింగ్ సదుపాయం, సెట్ బ్యాకు లేకపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. విచ్చలవిడిగా సాగుతున్న నిర్మాణాలపై స్పెషల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా... పట్టించుకోకపోవడంతో మున్సిపల్ అధికారుల పని తీరుపై ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో టౌన్ ప్లానింగ్ సిబ్బంది కొన్నిసార్లు అక్రమ నిర్మాణాలకు నోటీసులిచ్చి హడావిడి చేసి వెళ్లిపోతున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా అక్రమంగా భారీ భవనాలు నిర్మిస్తున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. కానీ సామాన్యులు, మధ్యతరగతి వారు నిర్మిస్తున్న చిన్న చిన్న నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు ప్రతాపం చూపిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అందినకాడికి దండుకుని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అడ్డుకోవలసిన స్పెషల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ టీపీఎస్, చైన్ మెన్‌లు కలెక్షన్లపైనే దృష్టి సారించారని, అంతేకాకుండా అక్రమ నిర్మాణాలకు కొంత మంది రాజకీయ నేతలు అండగా నిలుస్తుండడంతో చర్యలు తీసుకునేందుకు సిబ్బంది జంకుతున్నారంటూ పలువురు విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్ శివారులోని శ్రీ సాయి బాలాజీ ఎంక్లేవ్ రోడ్ నెంబర్-1లో రహదారికి ఆనుకుని ఓ అక్రమ నిర్మాణదారుడు బరితెగించి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అండతో ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా 6 బహుళ అంతస్థుల భవన నిర్మాణాన్ని నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణానికి సంబంధిత అధికారులు డబ్బులు తీసుకుని వ్యాపార సముదాయాల నిర్మాణాలను అక్రమంగా నిర్మిస్తున్నారని వాదనలు వెలువడుతున్నాయి. అయితే వీటిపై స్థానికులు ఫిర్యాదులు చేసినప్పటికీ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. మల్లంపేట్ కె.వి.ఆర్ కాలనీలో ఓ బడా బిల్డర్ 400 గజాల స్థలంలో నిర్మిస్తున్న భారీ అక్రమ నిర్మాణానికి మున్సిపల్ నుంచి రెండు వేరువేరుగా అనుమతులు పొంది ఎటువంటి నిబంధనలు పాటించకుండా జీ+5 అంతస్తులతో ఒకే నిర్మాణాన్ని నిర్మిస్తున్నట్టు ఆయా కాలనీలో స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై సంబంధిత మున్సిపల్ అధికారులను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం. ఏదేమైనా అక్రమ నిర్మాణాలపై అరికట్టాల్సిన పట్టణ మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారా అనే ఆరోపణలు ఆయా కాలనీవాసుల్లో వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి : సీఐ

విశాలాంధ్ర - కొత్తూరు : వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కొత్తూరు సీఐ జి నర్సయ్య అన్నారు. ఆదివారం ఆయన సాధారణ తనిఖీల్లో భాగంగా కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధి నాట్కో జంక్షన్ బైపాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో కలిసి వాహనాలకు సంబంధించిన పత్రాల పరిశీలనలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండ, మద్యం సేవించి వాహనాలను నడపరాదని వాహనదారులకు పలు సలహాలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ తనఖీల్లో సీఐతో పాటు ఎస్సై సత్యశీల రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా' సీట్లపై 15లోగా స్పష్టత

నేడు దిల్లీలో ఆర్‌జేడీ, కాంగ్రెస్ అగ్రనేతల చర్చలు

న్యూదిల్లీ: అసెంబ్లీ ఎన్నికల తేదీల ప్రకటనతో బీహార్ రాజకీయాలు వేడెక్కాయి. అధికార-విపక్ష కూటములు సీట్ల సర్దుబాటుపై చర్చల్లో తలమునకలయ్యాయి. ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన కూడా చర్చోపచర్చలు కొనసాగిస్తోంది. బుధవారంలోగా చర్చలు కొలిక్కి వస్తాయని, పోటీ చేసే స్థానాల విషయంలో స్పష్టత లభిస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆర్‌జేడీ అగ్ర నాయకులు లాలు ప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్ ఆదివారం దిల్లీ వెళ్లారు. కోర్టు పేషి కోసం వెళ్లిన వీరు సోమవారం కాంగ్రెస్ అగ్ర నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో భేటీ అవుతారు. సీట్ల సర్దుబాటుపై చర్చిస్తారు. వీరి మధ్య ఏకాభిప్రాయం కుదిరితే అసెంబ్లీ ఎన్నికల తొలి దశ నామినేషన్ల గడువు (నవంబరు 6) ముగిసే రెండు రోజుల ముందు చర్చలు ముగుస్తాయన్న అంచనా ఉంది. ఈ వారంలో 'ఇండియా' పార్టీలు ఈబీసీలు, మహిళల కోసం హామీలతో ఉమ్మడి మేనిఫెస్టోలను విడుదల వంటి కార్యక్రమాలు జరగుతాయని తెలుస్తోంది. బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించేందుకు కాంగ్రెస్ విముఖంగా ఉందని సమాచారం. కాంగ్రెస్‌కు 52-55 స్థానాలు ఇచ్చేందుకు ఆర్‌జేడీ ముందుకొచ్చింది కానీ 60 కంటే తక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ ఒప్పుకోవడం లేదు. లాలు కుటుంబంపై కేసు నడుస్తున్న క్రమంలో తేజస్విని సీఎం అభ్యర్థిగా ప్రకటించడం కోసం కాంగ్రెస్ వెనుకాడుతోంది. తీర్పు వచ్చాక దీనిపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. ఆర్‌జేడీ మాత్రం తేజస్వీ యాదవ్‌ను సీఎం అభ్యర్థిగా ఖరారు చేయాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తోంది. తాజా పరిణామాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ 'ఇప్పటికే బీహార్‌లోని భాగస్వాములందరితోనూ ఖర్గే చర్చలు జరుపుతున్నారు. కాంగ్రెస్ పోటీ చేసే కొన్ని స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. కొన్ని పార్టీలు తమ బలం ఎక్కువని అంటున్నాయి. రెండు-మూడు రోజుల్లో అన్ని విషయాల్లో స్పష్టత వస్తుంది' అని అన్నారు. మహాకూటమిలో కొత్త పార్టీల చేరికతో ప్రకటన ఆలశ్యమైనట్లు చెప్పారు. ఇదిలావుంటే, కొత్తగా చేరిన ఇండియా ఇంక్లూజివ్ పార్టీ రెండు స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంది. ముకేశ్ సహనీ నేతృత్వ వీఐపీ 30 స్థానాలు డిమాండ్ చేస్తోంది. తనకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని సహనీ పట్టుపట్టారు. ఆర్‌జేడీ కేవలం 12-13 స్థానాలు ఇవ్వాలని భావిస్తోంది. మిగతా పార్టీలు కూడా సహనీకి ఉప ముఖ్యమంత్రి స్థానం ఇవ్వడానికి అనుకూలంగా లేవు. వామపక్షాల విషయానికొస్తే సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) కలిపి 35 స్థానాలు ఖరారయ్యాయి. 27-28 స్థానాలు డిమాండ్ చేసిన సీపీఐ(ఎంఎల్) 25 స్థానాలకు ఒప్పుకోగా, సీపీఐ 8 స్థానాలు కోరుతోంది.

మోదీ పాలనలో ఆర్టీఐకి తూట్లు

డీపీడీపీ చట్టం- 'నో డేటా' సూత్రం ప్రమాదకరం

సమాచార హక్కు చట్టానికి 20 ఏళ్లు సందర్భంగా కాంగ్రెస్

న్యూదిల్లీ: 'పౌరుల సాధికారతకు... ప్రభుత్వ జవాబుదారీతనానికి హామీ ఉండేలా తెచ్చిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) 20 ఏళ్లు పూర్తి చేసుకుంది. అయితే మోదీ పాలనలో ఈ చట్టం నిర్వీర్యమవుతోంది. ఆర్టీఐ చట్టాన్ని దెబ్బతీయడమంటే ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడమేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. 'నో డేటా అవైలబుల్' (సమాచారం అందుబాటులో లేదు) సూత్రాల అమలు, 2023, మార్చిలో తెచ్చిన డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ చట్టం (డీపీడీపీ)తో ఆర్టీఐను పూర్తిగా రద్దు చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఆర్టీఐ సవరణ చట్టంగా డీపీడీపీని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చింది. వ్యక్తిగత సమాచారానికి ఆర్టీఐ వర్తించదని ఈ చట్టం చెబుతోంది. డీపీడీపీ అమల్లోకి తేవద్దని, దానిని సమీక్షించడం, సవరించడం అవసరమని లేఖ ద్వారా కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సూచించినట్లు జైరాం రమేశ్ వెల్లడించారు. సవరించకుండా డీపీడీపీ అమలు చేస్తే ఆర్టీఐ రద్దు అవుతుందన్నారు. 2019లో జరిగిన సవరణలతో ఆర్టీఐ బలహీనమైందని, అప్పట్లో స్థాయి సంఘం సూచనలను మోదీ ప్రభుత్వం అంగీకరించలేదని, దీంతో సమాచార చట్టానికి మొదటిసారి ఎదురు దెబ్బ తగిలిందని జైరాం రమేశ్ గుర్తుచేశారు. అధికారిక ప్రకటనలకు భిన్నమైన సమాచారం ఆర్టీఐ ద్వారా లభించినదంటూ... ప్రధానమంత్రి చదివిన డిగ్రీ, లక్షల్లో నకిలీ రేషన్ కార్డులపై ప్రకటనలు, నోట్ల రద్దుపై ఆర్బీఐ కేంద్ర కమిటీ సమావేశాలు, ఎన్‌పీఏ ఎగవేతదారులు, రుణగ్రహీతలు, నల్ల ధనాన్ని స్వదేశానికి తేవడం వంటి ఐదు అంశాలను జైరాం రమేశ్ ఉదహరించారు.

మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ '11 ఏళ్ల మోదీ పాలనలో ఆర్టీఐ చట్టం క్రమంగా దెబ్బతినడంతో ప్రజాస్వామ్యం, పౌరుల హక్కులు గుల్ల అయ్యాయన్నారు. 2019లో ఆర్టీఐ చట్టాన్ని మోదీ ప్రభుత్వం హ్యాక్ చేసిందని, సమాచార కమిషనర్ల పదవీ కాలం, వేతనాలపై నియంత్రణ సాధించిందని, స్వతంత్ర సంస్థలను బానిస సంస్థలకు మార్చివేసిందని విమర్శించారు. ఆర్టీఐ కింద ప్రజా ప్రయోజనాల క్లాజుకు డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ చట్టం తొక్కేసిందని, ప్రైవసీ (గోప్యత) నెపంతో అవినీతికి రక్షణ కల్పించే సామర్థ్యం ప్రభుత్వానికి లభించిందని ఖర్గే దుయ్యబట్టారు. కేంద్ర సమాచార కమిషన్‌లో కీలక పోస్టులు భర్తీ కాకపోవడాన్ని ప్రస్తావించారు. గత 11 ఏళ్లలో ఏడు సార్లు ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) లేకుండా సంస్థ పనిచేసిందని, గత 15 నెలలుగా ఎనిమిది ఇతర ప్రధాన పోస్టులు భర్తీ కాలేదని ఖర్గే గుర్తుచేశారు. 'నో డేటా అవైలబుల్' అనేక భయానకమని, దీనిని అడ్డుపెట్టుకొని కోవిడ్ మరణాలు, ఎన్‌ఎస్‌ఎస్‌ఓ 2017-18, ఏఎస్‌యూఎస్‌ఈ 2016-20, పీఎం కేర్స్ వాస్తవిక సమాచారాన్ని తుడిచిపెట్టేసి జవాబుదారీతనం నుంచి సర్కారు తప్పించుకుందన్నారు. 2014 నుంచి 100 మంది ఆర్టీఐ కార్యకర్తలు హత్యకు గరయ్యారని తెలిపారు. సత్యం కోసం పోరాడేవారిని, అసంతృప్తి వ్యక్తం చేసే వారిని శిక్షించే భయోత్పాత వాతావరణాన్ని మోదీ ప్రభుత్వం సృష్టించిందని ఖర్గే అన్నారు. 16 క్లిష్టమైన ప్రభుత్వ డేటాసెట్లు ఆలశ్యమయ్యాయని, తొమ్మిది కేంద్ర మంత్రిత్వశాఖల వార్షిక నివేదికలు విడుదల కాలేదని, ఇందులో ఉన్నత విద్యపై అఖిలభారత సర్వే, దేశంలో రోడ్డు ప్రమాదాలు, జైళ్ల గణాంకాలు వంటివి ఉన్నాయని ఇండియా స్పెండ్ నివేదిక వెల్లడించిందన్నారు. తమిళనాడు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ 2019లో చేసిన సవరణలతో స్వతంత్రత బలహీనమైందని, శిక్షలు పెరిగాయని, సమాచార కమిషనర్ల పదవీ కాలం, సర్వీసు షరతులను శాశించే అధికారం కేంద్రానికి లభించిందన్నారు. వ్యక్తిగత సమాచార పరిధిని విస్తరించేందుకు 2023లో డీపీడీపీ చట్టం తెచ్చారని, కీలక సమాచారాన్ని బయటకు రానివ్వలేదన్నారు. పబ్లిక్ ఆడిట్, పర్యవేక్షణను దెబ్బతీశారని అన్నారు. ప్రధాని విదేశీ ప్రయాణాలపై, పీఎం కేర్స్ నిధుల వినియోగంపై ఆర్టీఐ ద్వారా కోరిన వివరాలను గోప్యంగా ఉంచారన్నారు. షెహ్లా మసూద్, సతీశ్ శెట్టి సహా ఆర్టీఐ కార్యకర్తల దారుణ హత్యలను కాంగ్రెస్ నాయకులు గుర్తుచేశారు. విజిల్ బ్లోయర్స్ పరిరక్షణ చట్టం అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నిజం బయటకు రాకుండా ఉద్దేశపూర్వకంగానే సమాచారాన్ని నిరాకరించిందని దుయ్యబట్టారు. సమాచార కమిషనర్ల స్వయంప్రతిపత్తిని పునరుద్ధరించాలని, డీపీడీపీ చట్టాన్ని సవరించాలని, ఖాళీలు భర్తీ చేయాలని, పని ప్రదర్శనపై నివేదికలు ఇవ్వాలని, ఆర్టీఐ వినియోగదారులు, విజిల్ బ్లోయర్లకు రక్షణ కల్పించాలని, జర్నలిస్టులు, కార్యకర్తలు, మహిళలను కమిషన్లలో చేర్చాలని మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

యూనివర్సిటీ సాంగ్ పాడినందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డు

నాగపూర్: మాజీ రాష్ట్రమంత్రి, దివంగత తుకడోజీ మహారాజ్ జయంతి సందర్భంగా నాగపూర్ విశ్వవిద్యాలయం చరిత్ర సృష్టించింది. 'యా భారత్ బంధుభావ్' అనే విశ్వవిద్యాలయ గీతాన్ని సామూహికంగా ఆలపించి గిన్నిస్ ప్రపంచ రికార్డు నెలకొల్పింది. దీంతోపాటు మరో మూడు ప్రపంచ రికార్డులూ నమోదు చేసింది. తుకడోజీ మహారాజ్ అందించిన కరుణ, మానవతా భావం, సోదరభావం, ఐక్యత, దేశభక్తి వంటి విలువలను విద్యార్థులతో పాటు సమాజంలోని ప్రతి వర్గానికి చేరవేయాలనే ఉద్దేశంతో ఈ విశిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఆయన 57వ జయంతి సందర్భంగా అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు మొత్తం 52 వేల మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిలో 16 వేల మంది ప్రత్యక్షంగా పాల్గొనగా... 15 వేల మందికి పైగా ఆన్‌లైన్‌లో గీతాన్ని ఆలపించారు. దీంతో ఓ విశ్వవిద్యాలయం పాటను ఎక్కువ మంది కలసి పాడిన అతి పెద్ద ఆన్‌లైన్ వీడియో ఆల్బమ్ కేటగిరీలో గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించింది. గిన్నిస్ ప్రతినిధి ఎమ్మా బ్రెయిన్ ఈ రికార్డును అధికారికంగా ప్రకటించగా... వైస్ ఛాన్సలర్ డాక్టర్ మాధవి ఖోడ్ చవరే నిర్వాహక కమిటీకి రికార్డు ధ్రువపత్రం అందజేశారు. ఒకేసారి ఎక్కువమంది కలసి గీతాన్ని ఆలపించినందుకుగానూ ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రికార్డ్ బుక్ ఆఫ్ ఇండియాలో విశ్వవిద్యాలయం స్థానం సంపాదించింది. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, ప్రముఖ హాస్యనటుడు భరత్ గణేశ్‌పురే, రాష్ట్ర మంత్రులు డాక్టర్ పంకజ్ భోయర్, ఆశిష్ జైస్వాల్, ఎమ్మెల్యే డాక్టర్ ఆశిష్ దేశ్‌ముఖ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని తుకడోజీ మహారాజ్ అధ్యాసన్, జాతీయ సేవా పథకం విభాగం, విద్యార్థి అభివృద్ధి శాఖ, క్రీడా శారీరక విద్యా విభాగం సంయుక్తంగా నిర్వహించాయి.

కమ్యూనిస్టుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: స్థానిక బ్రాడీపేటలోని సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో శతవసంతాల కమ్యూనిస్టు ఉద్యమంలో విరబూసిన ఎర్రమందారాల ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ... కమ్యూనిస్టు ఉద్యమ శతవసంతాల విజయగాథను స్మరించుకున్నారు. 95 ఏళ్ల వయసులో కూడా పార్టీ ఆలోచనల పట్ల అచంచలమైన విశ్వాసంతో ఉన్న షేక్ బుడే, గూడవల్లి నాగేశ్వరరావును సన్మానించారు. గుంటూరు జిల్లా కేంద్రంగా విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు ఉద్యమంలో అడుగుపెట్టి ప్రజా, కార్మిక, రైతు పోరాటాలకు తమ జీవితాన్ని అంకితం చేసిన సీనియర్‌ల సేవలను, వారు కమ్యూనిస్టు పార్టీ పట్ల చూపించిన నిబద్ధతను హాజరైన ప్రతిఒక్కరూ గుర్తుచేసుకున్నారు. కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, పార్టీ రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ అభివృద్ధికి పదేళ్లు చాలు

స్టీల్ ప్లాంట్ పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసేలా కృషి

4 జిల్లాలతో గ్రేటర్ విశాఖ ఎకనామిక్ జోన్: మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని... సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 20 లక్షల మందికి ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. నగరంలో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... విశాఖలో ఐదు లక్షలు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. టీసీఎస్‌కు తక్కువ ధరకు భూముల కేటాయింపుపై కొందరు కోర్టుకు వెళ్లారన్నారు. టీసీఎస్‌కు కేటాయింపుల తర్వాత అనేక సంస్థలు ఏపీకి వరుస కట్టాయని వివరించారు. డబుల్ ఇంజిన్ సర్కారు బుల్లెట్ రైలులా దూసుకెళ్తోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ సహకారం ఎంతో ఉందన్నారు. కేంద్రం చేపట్టే సంస్కరణల్లో ఏపీకి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు 80 శాతం సామర్థ్యంతో పని చేస్తోందని, పూర్తిస్థాయి సామర్థ్యంతో పని చేసేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విశాఖను జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్) రాజధానిగా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి 30 ఏళ్లు పడితే... విశాఖకు పదేళ్లు చాలన్నారు. 2047 నాటికి విశాఖ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారనుందన్నారు. ఏ రాష్ట్రానికైనా రాజధాని ఒక్కటే ఉండాలని, అభివృద్ధి వికేంద్రీకరణ మాత్రం జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రానికి రాబోయే 120 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో దాదాపు 50 శాతం విశాఖకే వస్తాయి అని లోకేశ్ అన్నారు. దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ విశాఖకు రాబోతోందని తెలిపారు. శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు అంటే నాలుగు జిల్లాలతో గ్రేటర్ విశాఖ ఎకనామిక్ జోన్ ఏర్పాటు చేస్తామన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన

అంతకు ముందు నగరంలో మొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. భీమిలి నియోజకవర్గం రుషికొండ, మధురవాడ ఐటీ పార్క్‌లోని హిల్ నెంబర్ 3లో సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ 50 మెగావాట్ల ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తోంది. ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్‌తో పాటు రుషికొండలో ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ శిలాఫలకాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ ఏఐ ఆధారిత డేటా సెంటర్ వల్ల భారతదేశ గ్లోబల్ డిజిటల్ గేట్ వేగా విశాఖ రూపుదిద్దుకోవడంతో పాటు సముద్రపు కేబుల్ కనెక్టివిటీ, ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయనుంది. నాస్ డాక్ లో నమోదైన దేశ ప్రముఖ డిజిటల్ ఐసీటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సిఫీ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్... ప్రభుత్వం కేటాయించిన 3.6 ఎకరాల్లో రూ.1,500 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ ను అభివృద్ధి చేయనుంది. తద్వారా వెయ్యిమందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నూతన కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ సదుపాయం వల్ల సముద్రపు కేబుల్ కనెక్టివిటీ మెరుగుపడనుంది. సిఫీ చైర్మన్ రాజు వేగేశ్న, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్స్ హర్షా రామ్, రాజేష్ తిరుమల రాజు, సిఫీ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ చెన్నకేశవ్ తో పాటు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పెన్మత్స విష్ణుకుమార్ రాజు, పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాస్ రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, గంటా రవితేజ, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఐటీసీ అండ్ ఈ సెక్రటరీ కాటంనేని భాస్కర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్, విశాఖ కలెక్టర్ హరీంద్రప్రసాద్, ఎన్.యువరాజ్ పాల్గొన్నారు.

తప్పు దిద్దుకున్న అఫ్గాన్ మంత్రి

మహిళా జర్నలిస్టులకు ఆహ్వానం

న్యూదిల్లీ: మహిళా జర్నలిస్టులను నిషేధించడంపై విమర్శలు రావడంతో అఫ్గాన్ విదేశాంగ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తాఖీ మెట్టుదిగారు. భారత్ పర్యటనలో భాగంగా దిల్లీలో ఆదివారం నిర్వహించిన రెండో విలేకరుల సమావేశానికి మహిళా జర్నలిస్టులను ఆహ్వానించారు. శుక్రవారం సమావేశంలో ఒక్క మహిళా జర్నలిస్టులు పాల్గొనకుండా అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. దీంతో ఆయన వివరణ ఇచ్చుకున్నారు. ఉద్దేశపూర్వకంగా మహిళలను మినహాయించలేదని వెల్లడించారు. మహిళలపై వివక్ష లేదన్నారు.

జర్నలిస్టులకు ఇచ్చిన పాస్‌ల సంఖ్య పరిమితంగా ఉండడంతో కొందరినే ఆహ్వానించామని అన్నారు. ఈ వ్యవహారంలో తమ ప్రమేయం ఏమీ లేదని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది.

అఫ్గాన్ ప్రతీకార దాడి

కాబూల్/ఇస్లామాబాద్: అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దుల్లో సైనిక ఘర్షణలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. గురువారం పాక్ జరిపిన వైమానిక దాడులకు అఫ్గాన్ ప్రతీకారం తీర్చుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు పెద్దఎత్తున సైనిక ఆపరేషన్ నిర్వహించింది. ఈ క్రమంలో రెండు దేశాల సరిహద్దులు మూసివేశారు. సరిహద్దు పోరులో తమ సైనికులు 23 మంది చనిపోయారని, తాలిబన్ సైనికులు తొమ్మిది మంది మరణించారని పాక్ సైన్యం ప్రకటించింది. పాకిస్థాన్‌లో దాడులు పెరిగిన క్రమంలో తీవ్రవాదులపై చర్యలు తీసుకోవాలని తాలిబన్‌ను ఇస్లామాబాద్ డిమాండ్ చేయడంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. తమ భూభాగంలో ఉగ్రవాదులే లేరని అఫ్గాన్ ప్రకటించింది. పాకిస్థాన్ ఆరోపణలను తోసిపుచ్చింది. అఫ్గాన్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా ఉందని పాక్ ఆరోపించింది. ఇదిలావుంటే, అఫ్గాన్ రాజధాని కాబూల్ సహా ఆ దేశ భూభాగంపై ఈనెల 10న పాకిస్థాన్ వైమానిక దాడులకు ప్రతీకారంగా తాలిబన్లు తాజాగా దాడులు చేశారు. సరిహద్దు పోరులో 200 మందికిపైగా తాలిబన్, అనుబంధ ఉగ్రవాదులను హతమార్చినట్లు పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది. 19 అఫ్గాన్ సరిహద్దు పోస్టులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. 58 మంది పాక్ సైనికులను మట్టుబెట్టినట్టు అఫ్గాన్ ఒక ప్రకటన చేసింది.

తాలిబన్ అధికార ప్రతినిధి ముజాహిద్ ఆదివారం తమ ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. బహ్రామ్‌పూర్ జిల్లాలోని వివాదాస్పద దురంద్ రేఖ వెంబడి పాకిస్థాన్ సైన్యంపై ఇస్లామిక్ ఎమిరతీ దళాలు ప్రతీకార ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించారు. భీకర పోరులో 58 మంది పాక్ సైనికులు మరణించగా మరో 30 మంది గాయపడ్డారని చెప్పారు. అనేక ఆయుధాలు సీజ్ చేశామన్నారు. దాడుల్లో 20 పాక్ అవుట్‌పోస్టులు ధ్వంసమయ్యాయని తెలిపారు. అఫ్గాన్ సైనికులు తొమ్మిది మంది చనిపోగా, 16 మంది గాయపడ్డారన్నారు. ఖతార్, సౌదీ అరేబియా విజ్ఞప్తి చేయడంతో శనివారం అర్ధరాత్రి ఆపరేషన్ నిలిపివేసినట్లు తెలిపారు. పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫక్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఇస్లామిక్ స్టేట్ అనుబంధ ఐసిస్-కె శిక్షణ శిబిరాలు ఉన్నాయని ఆరోపించారు. ఇరాన్, మాస్కోపై దాడులకు వ్యూహాలు అక్కడే రచించారని, అఫ్గాన్‌పై ఇటీవల దాడులకు ప్రణాళికలు కూడా ఈ స్థావరాల్లోనే రూపొందాయని ముజాహిద్ వెల్లడించారు. ఐసిస్-కె సభ్యులను ఇస్లామిక్ ఎమిరతీకి అప్పగించాలని పాకిస్థాన్ ప్రభుత్వానికి పిలుపునిచ్చారు. తమ బృందాన్ని కాబూల్‌కు పంపుతామని పాకిస్థాన్ చేసిన ప్రతిపాదనను ఇస్లామిక్ ఎమిరతీ తిరస్కరించినందుకు గురువారం రాత్రి పాకిస్థాన్ వైమానిక దాడులు జరిపిందని వెల్లడించారు. అఫ్గాన్ సార్వభౌమత్వంపై రాజీ లేదని, తమ భూభాగాన్ని కాపాడుకుంటామని అన్నారు.

సమర్థంగా తిప్పికొట్టాం: పాక్ సైన్యం

పాకిస్థాన్ సరిహద్దు పోస్టులపై అఫ్గాన్ దాడులకు తుపాకులు, ఫిరంగులతో బదులిచ్చినట్లు పాక్ సైన్యం తెలిపింది. రెండు దేశాల సరిహద్దు పోస్టులు ధ్వంసమయ్యాయి. అఫ్గాన్ పోస్టులపై దాడుల వీడియోను పాక్ సైన్యాధికారులు పంచుకున్నారు. ఆదివారం ఉదయం కల్లా పరస్పర దాడులు ముగిశాయని పాక్ సైన్యం తెలిపింది. పాకిస్థాన్‌లోని కుర్రమ్ ప్రాంతంలో కాల్పులు జరిగినట్లు స్థానిక అధికారులు, ప్రజలు వెల్లడించారు. శనివారం అర్ధరాత్రే దాడులు ఆపేసినట్లు అఫ్గాన్ రక్షణశాఖ ప్రకటించింది. గల్ఫ్ దేశాల విజ్ఞప్తి మేరకు ఆపరేషన్‌ను విరమించుకున్నట్లు తెలిపింది. అఫ్గాన్ భూభాగానికి ముప్పు లేదని పేర్కొంది. అఫ్గాన్‌తో పంచుకునే సరిహద్దు వెంబడి 2,600 కిమీల పరిధిలోని క్రాసింగులను మూసివేసినట్లు పాక్ వెల్లడించింది.

చర్చలతోనే పరిష్కారం:

ముత్తాఖీఅఫ్గాన్ జోలికి వస్తే సహించేది లేదని భారత్ పర్యటనలో ఉన్న ఆ దేశ విదేశాంగ మంత్రి ముత్తాఖీ తెలిపారు. అఫ్గాన్ శాంతిని కోరుకుంటోందని అన్నారు. అన్ని సమస్యలను సామరస్యంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్నది అఫ్గాన్ ఇస్లామిక్ ఎమిరతీ విధానమని చెప్పారు. అఫ్గాన్ కయ్యానికి కాలు దువ్వదని, అలాగనీ రెచ్చగొడితే ఊరుకోదని ముత్తాఖీ వెల్లడించారు. శాంతికి పాకిస్థాన్ ఒప్పుకోకపోతే తమకు వేరే మార్గాలు ఉన్నాయని హెచ్చరించారు. పాకిస్థాన్ ప్రజలు, రాజకీయ నాయకులతో తమకు ఎలాంటి సమస్యలు లేవని, ఆ దేశంలోని కొన్ని శక్తులే శాంతికి విఘాతం కలిగిస్తున్నాయన్నారు. తమ భూభాగం, గగనతల భద్రతకు అఫ్గాన్ కట్టుబడి ఉందని, ఉల్లంఘనలకు దీటుగా బదులిస్తుందని చెప్పారు. రాత్రి సమయంలో ప్రతీకార దాడులు జరిపి, అనుకున్నది సాధించామని ముత్తాఖీ వెల్లడించారు. 'ఖతార్, సౌదీతో పాటు అనేక మిత్రదేశాలు దాడులు ఆపమని కోరాయి. మా వైపు నుంచి పోరు ముగిసింది. పరిస్థితి అదుపులో ఉంది. మేము సత్సంబంధాలు కోరుకుంటున్నాం. చర్చల కోసం మా ద్వారాలు ఎప్పుడు తెరిచేవుంటాయి. అఫ్గాన్‌లో శాంతి నెలకొల్పాం. అన్ని దేశాలతో మంచి సంబంధాలు ఉండాలన్నదే మా విధానం. 40 ఏళ్లకుపైగా అఫ్గాన్‌లో పోరు సాగింది. సోవియట్ యూనియన్ ఓటమి పాలైంది. అమెరికా, నాటోతో పాటు 50కుపైగా దేశాల సైన్యం వచ్చాయి. 20 ఏళ్లకుపైగా పోరాడాయి. కానీ ఇప్పుడు అఫ్గాన్ స్వతంత్రంగా ఉంది. గత నాలుగేళ్లుగా ఒక్క చెడు ఘటన జరగలేదు. తూర్పు నుంచి పశ్చిమం వరకు ఉత్తరం నుంచి దక్షిణం వరకు ప్రజలంతా ఐక్యంగా ఉన్నారు. ఇస్లామిక్ ఎమిరతీకి అండగా నిలిచారు. అర్థవంతమైన చర్చలతో అన్ని సమస్యలు పరిష్కరించుకోవచ్చు' అని ముత్తాఖీ వెల్లడించారు.

ఆలోచించే స్వేచ్ఛ భారత్‌లో లేదు

విద్య కొందరికే పరిమితం కారాదు: రాహుల్ గాంధీ



న్యూదిల్లీ: గొప్ప వైవిధ్యతను ప్రతిబింబింపజేసే విద్యావ్యవస్థ భారత్‌కు అవసరమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. విద్య కొందరికే ఉండే ప్రత్యేక హక్కుగా మారిపోకూడదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు అనువైన ప్రత్యామ్నాయ మానుఫ్యాక్చరింగ్ వ్యవస్థ నిర్మించుకోవల్సిన అవసరం భారత్‌కు ఉందని, ఆ దిశగా అమెరికా లేక పెరూతో సహకారం దోహదం కాగలదని అభిప్రాయపడ్డారు. స్వేచ్ఛగా ఆలోచించే పరిస్థితి భారతదేశంలో లేదని రాహుల్ వ్యాఖ్యానించారు. మోదీ పాలనలో స్వేచ్ఛ, సైద్ధాంతిక ఆలోచనలపై తీవ్రంగా దాడులు జరుగుతున్నట్లు తెలిపారు. దక్షిణ అమెరికా పర్యటనలో భాగంగా చిలీ యూనివర్సిటీ విద్యార్థులతో మాట్లాడిన రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ పోస్టు చేసింది. విద్య, ప్రజాస్వామ్యం, జియోపాలిటిక్స్ అంశాలపై విద్యార్థులతో రాహుల్ మాట్లాడినట్లు పేర్కొంది. రాహుల్ మాట్లాడుతూ దేశ గొప్ప వైవిధ్యతను ప్రతిబింబించేలా అది ఉండాలి' అని అన్నారు. బహుళధృవ ప్రపంచంలో ముందుకెళ్లడం కోసం భారతదేశం బాటలు వేసుకోవాలని అన్నారు. విద్యా వ్యవస్థలో కాంగ్రెస్ ఎలాంటి మార్పులు తేవాలని అనుకుంటోందన్న ప్రశ్నకు 'విద్య విషయానికొస్తే... కొత్త విషయాలు తెలుకోవాలనే ఉత్సాహం, స్వేచ్ఛగా ఆలోచించడం, రాజకీయంగా, సామాజికపరంగా ఎలాంటి ఆంక్షలు, భయాలు లేకుండా ప్రశ్నించడంతోనే అది మొదలవుతుంది' అని రాహుల్ బదులిచ్చారు.భారతదేశానికి శాస్త్రీయపరమైన దృక్పథం అవసరమని, విశ్లేషణాత్మక ఆలోచన ధోరణి ముఖ్యమని చెప్పారు. భారత్‌లో ప్రజాస్వామ్యానికి ముప్పు ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు, భిన్న సంప్రదాయాలు, మతాలు, ఆలోచనలకు స్థానం దక్కాలని, ప్రజాస్వామ్యంలోనే అది సాధ్యమని రాహుల్ తెలిపారు. భారత్‌లో ప్రజాస్వామిక వ్యవస్థపై మూకుమ్మడిగా దాడి జరుగుతోందని వ్యాఖ్యానించారు. కాగా, రాహుల్ ఇటీవల కొలంబియా, బ్రెజిల్, పెరూ,చిలీ దేశాల్లో పర్యటించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.